# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 83 | హైదరాబాద్ | శనివారం 13-09-2025 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

బాంబు పెట్టాం.. అందరినీ బయటకు పంపించండి: ఢిల్లీ హైకోర్టుకు బెదిరింపు మెయిల్



## నేపాల్ లో భారతీయుల బస్సుపై దాడి

- ప్రయాణికులను దోచుకున్న దుండగులు
- పశుపతినాథ్ ఆలయం నుంచి తిరిగి వస్తుండగా ఘటన
- ఆర్మీ సాయంతో ప్రాణాలతో బయటపడ్డామన్న భక్తులు

11లో

## ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం



12లో

- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ప్రముఖులు
- ఇటీవలి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై గెలుపు
- మహారాష్ట్ర గవర్నర్ పదవికి నిన్ననే రాజీనామా
- ఆర్ఎస్ఎస్ నేపథ్యం నుంచి కీలక పదవికి ఎంపిక

## నేటి భారతం

- కడుపు నిండిన వాడికి పెట్టిన భోజనం..
- మహా సముద్రంలో కురిసిన భారీ వర్షం..
- ధనవంతుడికి ఇచ్చిన ఖరీదైన బహుమానం..
- పట్ట పగలు దేదీప్యమానంగా వెలుగుతున్న దీపం..
- ఎలాంటి ప్రేమాభిమానాలు లేని బంధాలు..
- ఎలాంటి పట్టు లేని అసమర్ధుడితో కలిసి చేసే వ్యాపారాలు..
- ఒక హద్దు అంటూ లేకుండా కొనసాగే స్నేహాలు..
- ఎలాంటి నిజాయితీ లేకుండా సాగిపోయే ప్రేమ..
- ఎన్ని ఉన్నా.. ఎంత కాలం ఉన్నా
- ప్రయోజనం శూన్యం.. మన సమయం..
- మన జీవితం వృధా.. వృధా వృధా..



11లో

## తెలంగాణలో పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు



## టౌన్ ప్లానింగ్ విభాగాల్లో టన్నులకొద్దీ అవినీతి..

జీ.హెచ్.ఎం.సి.లో విధులు నిర్వహిస్తున్న టవన్ ప్లానింగ్ అధికారుల అవినీతి గురించి ఎంత చెప్పకున్నా తక్కువే అవుతుంది.. ఎలాంటి భయం, భక్తి లేకుండా.. సిగ్గూ ఎగ్గూ లేకుండా పబ్లిక్ గానే లంచాలు డిమాండ్ చేస్తుండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.. చిన్న చిన్న పనులకోసం సామాన్యుడు కార్యాలయాలకు వెళితే ముక్కు పిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు.. ఎవరైనా తెగించి ఎదురుతిరుగుతే ఇక అంతే సంగతులు.. నెలల తరబడి తమ చుట్టూ తిప్పికుంటారు.. చివరికి విసిగిపోయిన జనాలు వారు కోరినంత లంచాలను అప్పో సాప్పో చేసి వారి చేతుల్లో పోస్తున్నారు.. ఇక కొంతమంది ధైర్యంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. జరిగేది ఏమీ ఉండదు.. ఏసీబీ లాంటి సంస్థలకు దొరికిపోయినా కేర్ చెయ్యడం లేదు.. రెండు మూడు నెలలు సస్పెండ్ అవుతారు.. తిరిగి విధుల్లో చేరతారు.. తమ బిజినెస్ ని కంటిన్యూ చేస్తారు.. ఈ సీట్ కాకపోతే మరో సీటు.. ఈ ఏరియా కాకపోతే మరో ఏరియా.. తమ ఫంథా మాత్రం మార్చుకోరు.. కుక్క తోక వంకర అన్నట్టుగా.. ఇలా దొరికిన వారిని కేవలం సస్పెండ్ చేయకుండా విధులనుంచి పూర్తిగా డిస్మిస్ చేయాలి.. కఠిన శిక్షలు అమలు చేయాలి.. అప్పుడే కొంతైనా మార్పు సంభవం అవుతుంది..




## కోల్ ఇండియా ఉద్యోగులకు కేంద్రం శుభవార్త..

## భారత్‌లో లక్షల ఉద్యోగాలు గల్లంతు

ట్రంప్ అధిక టారిఫ్‌పై శశిథరూర్ తీవ్ర ఆగ్రహం

- ట్రంప్ నిర్ణయంతో సూరత్ వజ్రాల పరిశ్రమలో లక్షకు పైగా ఉద్యోగాలు పోయాయని ఆరోపణ
- ఇది సంకం కాదు, రష్యా నుంచి చమురు కొంటున్నందుకు విధించిన కక్షపూరిత ఆంక్షలని వ్యాఖ్య
- మనకన్నా ఎక్కువ చమురు కొంటున్న చైనాపై చర్యలు లేవని, ఇది అన్యాయమని వ్యాఖ్య
- ట్రంప్ విచిత్రమైన వ్యక్తి అని, ఆయన విధానాలు అర్థరహితంగా ఉన్నాయని థరూర్ విశ్లేషణ

11లో




## 2034 నాటికి ఏపీ ఎలా ఉండబోతోందనే అంశాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు

- వే2న్యూస్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌పై ప్రణాళిక ఆవిష్కరణ
- 2034 నాటికి రూ. 57 లక్షల కోట్ల జీఎస్‌డీపీ సాధనే లక్ష్యం
- ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం రూ. 10 లక్షలు దాటించడమే టార్గెట్
- సూపర్ సిక్స్‌తో సంక్షేమం, ప్రణాళికలతో అభివృద్ధికి సమ ప్రాధాన్యం



11లో

# సంపాదకీయ

## రుతుపవనాల తీరు మారిందా?

### వానలు ఎందుకు ఎక్కువ పడుతున్నాయి

భారతదేశంలో రుతుపవనాలు తీవ్రంగా మారాయి. అసాధారణ వర్షాల వల్ల దేశంలోని సగం ప్రాంతం వరదల్లో చిక్కుకుంది. పంజాబ్‌లో 1988 తర్వాత అత్యంత తీవ్ర స్థాయిలో వరదలు కనిపిస్తున్నాయి. పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో 24 గంటల వ్యవధిలోనే సాధారణం కంటే 1000 శాతానికి మించి అధికంగా వర్షాలు పడ్డాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. వాయువ్య భారతదేశంలో ఆగస్టు 28 సెప్టెంబర్ 3 మధ్యన వర్షపాతం సగటు కంటే 180 శాతం ఎక్కువగా ఉంది. దక్షిణ భారతదేశంలో ఇదే కాలంలో కురిసిన వర్షం సగటు వర్షపాతం కంటే 73 శాతం ఎక్కువగా ఉంది. ఈ వారంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాలు, వరదల కారణంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి. వరదలు పోటెత్తాయి. గ్రామాలు, పట్టణాలు నీట మునిగాయి. వందల మంది మరణించారు. పర్యావరణ మార్పుల కారణంగా రుతు పవనాల తీరు మారుతోంది. ప్రస్తుతం గాలిలో తేమ శాతం పెరుగుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూతాపం పెరగడం వల్ల హిందూ మహా సముద్రం, అరేబియా సముద్రం నుంచి వేడి గాలులు వస్తున్నాయి. అందుకే గాలిలో తేమ శాతం పెరుగుతోంది. గతంలో జూన్, జులై, ఆగస్ట్, సెప్టెంబర్‌లో రుతుపవనాలు స్థిరంగా వ్యాపించడం.. వాటి వల్ల వర్షాలు సమానంగా కురవడం జరిగేది. అయితే ప్రస్తుతం పొడి వాతావరణం కొంతకాలం కొనసాగిన తర్వాత కొద్ది ప్రాంతంలో ఒకేసారి పెద్దమొత్తంలో వర్షాలు కురుస్తున్నట్లు తాము గుర్తించామని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తేమతో నిండిన భారీ మేఘాలు పర్వత ప్రాంతాల్లో కొండలను తాకినప్పుడు చిన్న ప్రాంతంలో పెద్ద వర్షం పడుతోందని నిపుణులు చెబుతున్నారు. దీన్నే క్లౌడ్ బరస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ఆగస్ట్ మొదటి వారంలో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కశ్మీర్‌లో భారీ వరదలు వచ్చి కొన్ని ఊళ్లు కొట్టుకుపోవడానికి ఇదే ప్రధాన కారణం. అయితే హిమాలయ రాష్ట్రాల నుంచి దక్షిణాది వైపు వెళ్తే భారీ వర్షాలు, వరదలకు వేరే కారణాలు కనిపిస్తాయి. ఆగస్ట్‌లో పంజాబ్, హరియాణా, దిల్లీని భారీ, అతి భారీ వర్షాలు ముంచెత్తాయి. భారత ఉపఖండంలో ఇప్పటికే ఉన్న రుతుపవన వ్యవస్థ, వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ (మధ్యధరా ప్రాంతంలో ఏర్పడే అల్పపీడనాలు, తుపానులు) తూర్పు వైపు ప్రయాణించేటప్పుడు కలవడం వల్ల ఇలా జరుగుతోందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. స్టర్న్ డిస్టర్బెన్సెస్ తరచూ పైవాతావరణంలో భారీ మొత్తంలో చల్లని గాలులను మోసుకెళ్తుంది. కింది వాతావరణంలో రుతుపవనాలు మోసుకెళ్లే వేడి గాలులు, తేమ నిండిన గాలులను ఇవి కలిసినప్పుడు వాతావరణం తీవ్రంగా మారిపోతుంది. "రుతుపవనాలు, వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ మధ్య అరుదైన వాతావరణ కలయిక ఫలితం ఇది" అని బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్‌లో వాతావరణ శాస్త్ర విభాగంలో రీసెర్చ్ సైంటిస్ట్ అక్షయ్ దేవరస్ చెప్పారు. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ప్రధాన కారణం రుతుపవనాలు, వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ కలయికేనని భారత వాతావరణ శాఖ నిర్ధరించింది. "రుతుపవనాలు విస్తృతంగా వ్యాపించి ఉన్నప్పుడు ఇలాంటి కలయిక అసాధారణం. ఎందుకంటే ఈ సమయంలో వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ ఉత్తర దిశగా ప్రయాణిస్తాయి" అని దేవరస్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పడమర నుంచి తూర్పుకు వీచే బలమైన గాలులే దీనికి కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఈ గాలుల మార్గం అనూహ్యంగా మలుపులు తిరుగుతోంది. అంటే ఇవి అంతకు ముందు తమదైన సహజ మార్గంలో వీయడం లేదు. ఇది మిగతా వాతావరణ వ్యవస్థలపైనా ప్రభావం చూపుతోంది.

గాలులు వీచే దిశ మారడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అసాధారణ వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నట్లు అధ్యయనాల్లో తేలింది. భారత్‌లోనూ ఇటీవల ఈ పరిస్థితులు కనిపిస్తున్నాయి. దిశ మార్చుకున్న గాలులు ఉత్తరం వైపు వెళ్లాల్సిన వెస్టర్న్ డిస్టర్బెన్సెస్‌ను తూర్పు వైపు మళ్లించాయి. "ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ స్థానిక రుతుపవనాల గతిశీలతను ఎలా మారుస్తుందో చెప్పడానికి ఇది సూచిస్తుంది" అని దేవరస్ చెప్పారు. భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో అధిక వర్షపాతం వల్లనే వరదలు ఏర్పడుతున్నాయి. అయితే ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. హిమాలయాలో ఉద్భవించే నదులకు దిగువన ఉన్న ఉత్తర భారతదేశం, పాకిస్తాన్‌లోని అనేక ప్రాంతాలు క్లౌడ్ బరస్ట్, వర్షాలు లేనప్పుడు కూడా వరదల బారిన పడ్డాయి. హిమనీనదాలు వేగంగా కరగడం, అవి వేగంగా ప్రవహించడం వల్ల భూగర్భ సరస్సులు పైకి వచ్చి ఆ ప్రవాహాలను అడ్డుకోవడం వల్ల కృత్రిమ సరస్సులు ఏర్పడటం, వాటి వల్ల వరదలు వస్తున్నట్లు శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. కచ్చితమైన కారణాలు తెలియనప్పటికీ, గ్లోబల్ వార్మింగ్ వల్ల వేగంగా కరుగుతున్న హిమనీనదాలు, కరిగిపోతున్న మంచు క్షేత్రాలు లాంటివి పర్వత ప్రాంతాల్లో అస్థిర వాతావరణ పరిస్థితుల్ని సృష్టిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. పర్వతాల్లో వాలుగా ఉండే ప్రాంతాలను స్థిరంగా ఉంచడానికి మంచు సిమెంట్‌లాగా పని చేస్తుంది. వర్షాలు కురిస్తే ఈ పరిస్థితి మారుతుంది. భూతాపం కారణంగా ఎత్తైన ప్రాంతాల్లో ఎక్కువగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇక్కడ నీరు ఇంకడం వల్ల నేల మెత్తగా మారుతుంది. దీంతో పర్వతాలు గట్టిదనాన్ని కోల్పోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. "వర్షం కురిసి, భారీ మొత్తంలో నీరు వరదగా ప్రవహించినప్పుడు ఒకటి రెండు రోజుల్లో పర్వాతాల్లో మంచు అంతా కరిగిపోవడాన్ని మేం చూస్తున్నాం" అని గ్రాజ్ యూనివర్సిటీలో జియో సైంటిస్ట్ జాకబ్ స్టైనర్ అన్నారు.

భూ తాపం పెరగడం వల్ల వాతావరణంలో సంభవిస్తున్న మార్పులకు తోడు మనుషుల చర్యలు కూడా వరదలకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. పర్వతాలు, మైదాన ప్రాంతాల్లో నదుల ప్రవాహాన్ని అడ్డుకుంటూ అనేక నిర్మాణాలు జరుగుతున్నాయి. నదీ తీరాల వెంబడి జరుగుతున్న ఆక్రమణలు కూడా దీనికి కారణంగా మారుతున్నాయి. పర్వత ప్రాంతాల్లో రహదారులు, సొరంగాలు, జల విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం వంటి వాటి వల్ల పర్వతాలు బలహీనపడుతున్నాయి. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ, చాలా చోట్ల నదుల కరకట్టలు, కాల్వల ఆధునికీకరణ లాంటి పనులు చేపట్టలేదు. పట్టణ ప్రాంతాల్లో వరద ప్రవాహానికి ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డంకిగా మారుతున్నాయి. భారీ వర్షాలు, వరదల వల్ల నష్టాలను తగ్గించడానికి సమస్యలను ముందే పరిష్కరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# తురకపాలెం మరణాలపై కొనసాగుతున్న మిస్టరీ







**గుంటూరు, సెప్టెంబర్ 12,(భారతశక్తి):**
గుంటూరు జిల్లా తురకపాలెంలో వరుస మరణాలు సంచలనంగా మారాయి. అధికారులను పరుగులు పెట్టించిన ఘటను అసలు కారణం ఏంటనేది ఇంత వరకు వెలుగులోకి రాలేదు. ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నా ప్రయోజనం లేదు. దీంతో స్థానికంగా ఉన్న ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ వ్యాధి నియంత్రణ బృందం అక్కడ మరికొన్ని పరీక్షలు చేస్తోంది. అసలు విషయం గుర్తించే పనిలో ఉంది. ఓవైపు వైద్య పరీక్షలు కొసాగిస్తూనే మరోవైపు ఇతర కారణాలపై అధికారులు ఆరా తీశారు. ఈ క్రమంలోనే కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఈ మిసరీ మరణాల కేసు మరో మలుపు తిరిగేటట్టు కనిపిస్తోంది. ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష వైద్యం కారణంగానే ఇదంతా జరిగిందనే అనుమానాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన సెలైన్ వాడకం, మితి మీరిన డోస్‌లో మందులు ఇవ్వడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందా అన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. తురకపాలెంలో జ్వరం వచ్చిన తర్వాత చాలా మంది బాధితులు అనుమానిత ఆర్ఎంపీ వద్దే చికిత్స చేయించుకున్నారని తెలుస్తోంది. వారికి చికిత్స చేసే క్రమంలో కాలం చెల్లిన సెలైన్‌తోపాటు, మోతాదుకు మించిన యాంటీబయాటిక్స్ వాడినట్టు అధికారులు గుర్తించారు. ఈ చర్యల వల్ల బాధితులకు జ్వరాలు తగ్గకపోవడంతోపాటు ప్రాణాంతకంగా మారినట్టు భావిస్తున్నారు. పరిస్థితి చేయి దాటిపోయిన తర్వాత వాళ్లంతా వేర్వేరు ఆసుపత్రులను ఆశ్రయించారని తెలుస్తోంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడిన తర్వాత అధికారులు ఆర్ఎంపీ వైద్యంపై క్లారిటీకి వచ్చారు. దీంతో ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌లో జిల్లా వైద్యాధికారులు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో యాంటీబయోటిక్ మందులు గుర్తించారు. అనంతరం క్లినిక్‌ను సీజ్ చేశారు. ప్రస్తుతం అధికారుల అదుపులోనే ఆర్ఎంపీ ఉన్నారు. చేసిన వైద్యంపై ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వైద్యం ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు

**ఆర్ ఎంపీ క్లినిక్ సీజ్**

భయానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిన తురకపాలెంలో గ్రామంలోని ఓ ఆర్ఎంపీ నడుపుతోన్న క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి సీజ్ చేశారు. మృతుల్లో కొందరు ఆర్ఎంపీ వద్దే తొలుత చికిత్స పొందినట్లు గుర్తించారు. అధిక మోతాదులో యాంటీ బయాటిక్స్‌ను బాధితులకు ఆర్ఎంపీ ఇచ్చినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అంతేకాదు, ఎక్కువగా సెలైన్ల వాడకం కూడా ఇన్‌ఫెక్షన్‌కు కారణమని భావిస్తున్న అధికారులు.. ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసినట్టు వెల్లడించారు. అయితే, ఈ స్థానికులు మాత్రం ఆ ఆర్ఎంపీ వైద్యంపై విశ్వాసం వ్యక్తం చేయడం గమనార్హం. గత పదేళ్లుగా అతడు తమకు వైద్యం చేస్తున్నాడని, ఎప్పుడూ ఏం కాలేదని చెబుతున్నారు. తమ పిల్లలకు జ్వరం వచ్చినా ఆయన దగ్గరకే వెళ్తామని, చుట్టుపక్కల పది గ్రామాల్లో అతడు వైద్యం చేస్తున్నాడని అంటున్నారు. దాదాపు మూడు వేల జనాభా ఉన్న పల్నాడు జిల్లా తురకపాలెం గ్రామంలో గత ఐదు నెలల్లోనే 28 మంది చనిపోయినట్టు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇటీవల వెల్లడించారు. జులై, ఆగస్టులోనే 20 మంది వరకు మరణించారు. పలువురు అతి ప్రమాదకరమైన 'మెలియాయిడోసిస్' అనే ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆరుగురిలో ఒకరికి 'మెలియాయిడోసిస్' పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కానీ, మెలిన్ అనే బ్యాక్టీరియా వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుండగా.. గ్రామస్థులకు స్వయంగా ప్రభుత్వమే ఆహారం, తాగునీరు అందజేస్తోంది. అటు, పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. వీధులు, పరిసరాలతో పాటు 68 నీటి ట్యాంకులను శుభ్రపరిచార.

మరోవైపు, తురకపాలెంలో పరిస్థితి అదుపులోకి వచ్చిందని జీజీహెచ్ వైద్యులు తెలిపారు. మెలియాయిడోసిస్ లక్షణాలతో ఆసుపత్రి చేరిన ఇద్దరు కోలుకోవటంతో వారిని డిశ్చార్జ్ చేశామని చెప్పారు. మరికొందరు అనుమానితుల నివేదికలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అటు, ఎన్‌సీడీఏ ఆధ్వర్యంలోని వైద్య నిపుణుల బృందం కూడా గ్రామంలో పర్యటించి, గ్రామస్థులు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసింది.

# వీడిన శ్రీవారి పింక్ డైమండ్ మిస్టరీ




**తిరుమల, సెప్టెంబర్ 12, ,(భారతశక్తి):**
తిరుమల శ్రీవారి పింక్ డైమండ్ మిస్టరీ వీడింది. అసలు నిజం వెలుగులోకి వచ్చింది. అది అసలు పింక్ డైమండ్ కాదు కెంపు... 1945లో మైసూరు మహారాజు శ్రీవారికి బహూకరించారు1945 జనవరి 9న మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చి, తాను బాల్యంలో ధరించిన హారాన్ని స్వామికి సమర్పించారు. ఈ హారంలో ఉన్నది పింక్ డైమండ్ కాదని, కెంపు (రూబీ) అని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో వెల్లడైంది. మైసూరు ప్యాలెస్ రికార్డుల ప్రకారం, ఈ హారంలో కెంపులు, ఇతర రత్నాలు మాత్రమే ఉన్నాయి, పింక్ డైమండ్ గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ఈ సర్వే వెల్లడించిన విషయాలతో పింక్ డైమండ్ కథ కంచికి చేరినట్లైంది. గతంలో రాజకీయ విమర్శలతో పింక్ డైమండ్ వ్యవహారం భారీగా చర్చకు తావిచ్చింది. ప్రభుత్వాన్ని, తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేసేలా అప్పట్లో వైసీపీ చేసిన ప్రచారం అసత్యం అని తేల్చి చెప్పేలా కొన్ని ఆధారాలను బయపెట్టారు ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నం. తిరుమల శ్రీవారికి విలువైన ఆభరణాలు సమర్పించిన రాజుల్లో మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ కూడా ఉన్నారు1945 జనవరి 9న తిరుమల శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. ఈ పర్యటనకు సంబంధించి మైసూర్ ప్యాలెస్ నుంచి 1944 డిసెంబరు 29న రామయ్య అనే ప్యాలెస్ అధికారి ఐఆ కమిషనర్‌కు లేఖ రాసినట్టు ఆధారాలున్నాయి. రైలు ద్వారా 1945 జనవరి 9న ఉదయం 8 గంటలకు రేణిగుంటకు చేరుకున్న రాజావారు తిరుపతి, శ్రీకాళహస్తి రాకపోకలకు 2 కార్లు ఏర్పాటు చేసేందుకు సహకరించాలంటూ ఆ లేఖలో ఉంది. టూర్ షెడ్యూల్ కాపీని కూడా పంపించారు. ఈ పర్యటనకు వచ్చినప్పుడే మహారాజు శ్రీవారికి హారాన్ని సమర్పించారు. అప్పటి నుంచి ఆ హారాన్ని విశేష ఉత్సవాల సమయంలో ఉత్సవమూర్తులకు అలంకరిస్తోంది టీటీడీ. ఇందులో భాగంగా 2001 అక్టోబరు 21న జరిగిన గరుడ సేవలో మలయప్పస్వామికి అలంకరించిన ఆహారం..కెంపు విరిగిపోయింది. భక్తులు విసిరిన నాణేలు తగిలి ఇలా జరిగిందని ఆ విషయాన్ని తిరువాభరణం రిజిస్టర్ లో నమోదు చేశారు. అయితే మైసూర్ మహారాజు సమర్పించిన హారంలో ఉన్నది కెంపు కాదు పింక్ డైమండ్ అని.. దాన్ని అపహరించి జెనీవాలో జరిగిన వేలంలో విక్రయించారని 2018లో తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు రమణదీక్షితుల వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయ్. ఆ ఆరోపణల్లో వాస్తవం లేదంటూ జగన్నాధరావు కమిటీ ఇచ్చిన నివేదికలో పగిలిన కెంపు ముక్కలు పేష్కార్ ఆధీనంలో ఉన్నాయని స్పష్టంగా వివరణ ఇచ్చారు. అయినప్పటికీ స్వామికి కొన్నేళ్లుగా కైంకర్యాలు నిర్వహిస్తున్న రమణ దీక్షితులు ఈ మాట చెప్పడంతో భక్తులు సందేహంలో పడ్డారు. శ్రీకృష్ణ దేవరాయలు ఇచ్చిన ఆభరణాల్లో కొన్ని మాయమయ్యాయనే ఆరోపణలు రావడంతో 2009 సెప్టెంబరులో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జగన్నాధరావు నేతృత్వంలో ఓ కమిటీ, 2010లో జస్టిస్ వాద్వా నేతృత్వంలో మరో కమిటీ వేశారు. ఆభరణాలన్నీ సక్రమంగానే ఉన్నాయని తేలింది. జగన్నాథరావు కమిటీ కూడా 1952 నుంచి ఉన్న రికార్డుల ప్రకారం ఆభరణాలన్నీ పదిలంగా ఉన్నాయని నివేదికలో పేర్కొంది. 2001బ్రహోత్సవాల సమయంలో పగిలిన కెంపు స్థానంలో వెంటనే ఓ పగడం తిరిగి అమర్చినట్టు కమిటీ వివరించింది. మైసూరు మహారాజు సమర్పించిన హారంలో పింక్ డైమండ్ లేదనే విషయాన్ని తేల్చి చెప్పారు మైసూరులోని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నం రెడ్డి. మైసూరు మహారాణి ప్రమోద దేవిని కలవడంతో పాటూ ప్యాలెస్ లో రికార్డులు పరిశీలించగా ఈ విషయాలు వెలుగుచూశాయ్. దీంతో గతంలో చేసిన విమర్శలు అవాస్తవాలే అని తేలింది.

# ఏంటీ విచిత్ర వాతావరణం

**కాకినాడ, సెప్టెంబర్ 12, ,(భారతశక్తి):**
ఏపీలోవిచిత్ర వాతావరణం కొనసాగుతోంది. ఒకవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. అదే స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. ఉక్కపోత, వేడి తీవ్రత కొనసాగుతోంది. సరిగ్గా ఇదే సమయంలో బంగాళాఖాతం నుంచి ఒక హెచ్చరిక వచ్చింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఏపీవ్యాప్తంగా వర్షాలు పడే సూచన కనిపిస్తోంది. కొన్ని జిల్లాలకు అయితే భారీ వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. ప్రధానంగా ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు పడతాయని చెబుతోంది. విశాఖ, అల్లూరి, సీతారామరాజు, అనకాపల్లి,కాకినాడలో తీవ్రత అధికంగా ఉండనుంది.

ఈనెల 14 వరకు వర్షాలు ఉండబోతున్నాయని చెబుతోంది. చాలా జిల్లాలకు వర్ష సూచన ఉంది. ప్రధానంగా అల్లూరి,ఏలూరు, ఎన్టీఆర్,గుంటూరు, బాపట్ల,పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. విజయనగరం, విశాఖ, అనకాపల్లి,కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. ఇంకోవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. పరిస్థితి చూస్తుంటే వేసవి( మాదిరిగానే ఉంది.

ఉదయం 8 గంటలనుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండలు కాస్తుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు దాటుతున్నాయి. అయితే ఈ నెలాఖరు వరకు ఉపరితల ఆవర్తనాలు ఏర్పడేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. అయితే నదుల్లో నీటి ప్రవాహం అధికంగా ఉంది. ప్రాజెక్టుల్లో సైతం నీటి లభ్యత అధికంగా కనిపిస్తోంది. ఖరీఫ్ కూడా ఈ ఏడాది ఆశాజనకంగా. అయితే ఎరువుల కొరత రైతులను వేధిస్తోంది. సాగునీటిపరంగా ఇబ్బందులు లేకున్నా యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. ఈనెల చివరి వరకు వర్షాల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

# అమరావతి ఓఆర్ఆర్ అడుగులు




**అమరావతి, సెప్టెంబర్ 12, ,(భారతశక్తి):**
అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.25 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా. 190 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా ఈ రహదారి ఉండనుంది. దీనికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. ఈ ప్రతిపాదనలను కేంద్రానికి పంపగా, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాజధాని అమరావతి ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. ఓఆర్ఆర్‌కు దాదాపు రూ.25 వేల కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు 190 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా ఉంటుంది. ఓఆర్ఆర్‌కు ఇరువైపులా రెండు వరుసల సర్వీస్ రోడ్లు కూడా ఉంటాయి. మొత్తం పది వరుసల నిర్మాణానికి ఈ అంచనాలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలను అధికారులు కేంద్రానికి పంపారు. గతంలో ఈ ప్రాజెక్టుకు 70 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించారు. అప్పుడు దీని నిర్మాణానికి రూ.16,310 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇప్పుడు 140 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించాల్సి ఉంది. ఇప్పుడు ప్రాజెక్టు వ్యయం రూ.25 వేల కోట్లకు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో భూసేకరణ భారం కాకుండా ఉండేందుకు ఆయన కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ లోని ప్రాజెక్ట్ అప్రైజల్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీకి పంపారు. మోర్త్ ఆమోదం తెలిపితే ఆ ఫైల్(ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య అప్రైజల్ కమిటీ) దగ్గరకు వెళుతుంది. ఆ తర్వాత సెంట్రల్ కేబినెట్ కమిటీ ఆఫ్ ఎకనమిక్ ఎఫైర్స్ ఈ ప్రాజెక్టు బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేస్తే అమరావతి ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. వాస్తవానికి ఓఆర్ఆర్ నిర్మాణానికి మోర్త్ ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ మొదట 70 మీటర్ల వెడల్పుతో అనుమతి ఇచ్చింది. దీనికి సివిల్ పనుల కోసం రూ.12,995 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అలాగే 1,702 హెక్టార్ల భూమిని సేకరించేందుకు రూ.2,665 కోట్లు, 124 హెక్టార్ల అటవీ భూమికి రూ.150 కోట్లు, పర్యావరణ అనుమతులకు రూ.200 కోట్లు, ఇతర ఖర్చుల కోసం రూ.300 కోట్లు కేటాయించారు. మొత్తంగా రూ.16,310 కోట్లకు ఆమోదం తెలిపారు. రింగ్ రోడ్డు లోపలి వైపు మాత్రమే సర్వీస్ రోడ్డు నిర్మించాలని కమిటీ పేర్కొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి భవిష్యత్తులో ఓఆర్ఆర్‌ను విస్తరించాల్సి వస్తే భూసేకరణ ఖర్చు పెరుగుతుందన్నారు. అందుకే ఇప్పుడే 150 మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేయాలని కేంద్రాన్ని కోరారు. రింగ్ రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఉండాలని కేంద్రానికి లేఖ రాశారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు స్వయంగా మాట్లాడారు. సీఎం చంద్రబాబు విజ్ఞప్తికి గడ్కరీ సానుకూలంగా స్పందించారు. 140 మీటర్ల వెడల్పుతో భూసేకరణకు, ఓఆర్ఆర్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ఆయన అంగీకరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 140 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతి లభించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా తనవంతుగా సహకారంగా నిర్మాణంలో ఉపయోగించే వస్తువులపై జీఎస్టీ 9 శాతం మినహాయించింది. మట్టి, కంకర, గ్రావెల్ వంటి వాటిపై సీనరేజ్ ఫీజును పూర్తిగా రద్దు చేశారు. ప్రభుత్వం దాదాపు రూ.2 వేల కోట్లు భరించనుంది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.25 వేల కోట్లకు చేరగా.. అందులో భూసేకరణకు రూ.5,600 కోట్లు అవుతుంది.. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు భరిస్తుంది. అమరాతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు భూసేకరణకు సంబంధించి ఏ భూములు కావాలో గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లా కలెక్టర్లకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వివరాలు అందజేశారు. ఆ ప్రతిపాదనల్ని పరిశీలించి కలెక్టర్లు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. కొన్ని జిల్లాల నుంచి ఇప్పటికే వివరాలు అందజేయగా.. మరికొన్ని జిల్లాలవారు అందజేయాల్సి ఉంది.. మరో రెండు వారాల్లో వివరాలు వస్తాయంటున్నారు.

# కనిగిరికి ట్రైన్...

**ఒంగోలు, సెప్టెంబర్ 12, ,(భారతశక్తి):** ఏపీలోని ఆ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది.. అక్కడ కొత్త రైల్వే స్టేషన్ సిద్ధమైంది, తొలిసారి రైలు పరుగులు తీసింది. మొదటిసారిగా వచ్చిన రైలుకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు.. మరో మూడు నెలల్లో పూర్తిస్థాయిలో రైళ్లు తిరుగతాయనే ఆనందంలో ఉన్నారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో ప్రజలకు నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ రైలు మార్గం ఎన్నో ఏళ్ల కలగా మిగిలింది.. అయితే ఎట్టకేలకు ఆ మార్గంలో పనులు వేగవంతం కావడంతో రైలు కూతలు వినిపిస్తున్నాయి. కనిగిరి వరకు రైలు పట్టాలు, స్టేషన్ల నిర్మాణ పనులు ముగింపు దశకు వచ్చాయి. తాజాగా ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాస్‌పూర్ నుంచి ఓ గూడ్స్ రైలు కనిగిరి సమీపంలోని యడవల్లికి చేరుకుంది. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనుల కోసం ఈ రైలు వచ్చింది. దీంతో స్థానిక ప్రజలు ఆనందంలో ఉన్నారు.. ఆ రైలుకు స్వాగతం పలికారు. ఈ రైలు బిలాస్‌పూర్ నుంచి 30 పెట్టెలతో వచ్చింది. నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు కావలసిన ట్రాక్‌లు, ఇతర సామాగ్రిని ఈ రైలులో తీసుకొచ్చారు. ఈ రైలు మార్గంలో భూసేకరణ సమస్యలు తీరడం, క్వారీ సమస్య పరిష్కారం కావడంతో రైలు మార్గం త్వరలో అందుబాటులోకి రానుంది. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్‌లో స్థల సేకరణకు సంబంధించిన పరిహారం రూ.7 కోట్లు చెల్లించడంతో సమస్యలు పరిష్కారం అయయ్యాయి. రైల్వే లైన్ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారంలో కనిగిరికి రైళ్లు వస్తాయని తహసీల్దార్ రవిశంకర్ అంటున్నారు. దీంతో కనిగిరి ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది. కనిగిరి దగ్గరలోని శంకవరం దగ్గర ఈ రైలు మార్గంపై క్వారీ నిర్వాహకులు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో వంతెన నిర్మాణం ఆగిపోయింది.




దీంతో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి క్వారీల నిర్వాహకులతో చర్చలు జరిపారు, వారితో సమస్యలపై మాట్లాడారు. సమస్యను పరిష్కరించడంతో వంతెన నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. యడవల్లి, పోలవరం రైలు నిలయాలతో పాటు వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయి.

ఈ ఏడాది డిసెంబరు నాటికి కనిగిరికి రైళ్లు వస్తాయని రైల్వేశాఖ అధికారులు కూడా చెబుతున్నారు. జిల్లాలోని దర్శి, పొదిలి వరకు రైల్వే మార్గం పనులు దాదాపుగా పూర్తయ్యాయి.. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. మిగిలిన పనుల్ని కూడా ఈ ఒకటి, రెండు నెలల్లో పూర్తి చేస్తామంటున్నారు అధికారులు. కనిగిరి వైపు పనులు జరుగుతున్నాయి..

యడవల్లి రైల్వే స్టేషన్‌కు సంబంధించిన పనులు ముగింపు దశకు వచ్చాయి. ఈ రైలు మార్గంలో నడికుడి నుంచి కనిగిరి వరకు దాదాపు 145 కిలో మీటర్ల మేర రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. యడవల్లి రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్, అధికారుల గెస్ట్ హౌస్‌లు, సిగ్నల్ కార్యాలయం, ప్రయాణికులు కూర్చోడానికి బల్లలు, తాగునీటితో వంటి వసతుల పనులు జరుగుతున్నాయి. అటు పామూరు మండలం రావిగుంటపల్లి వరకు ట్రాక్ సిద్ధమైందని చెబుతున్నారు

# దొరకని యూరియా..తప్పని పడిగాపులు

**సూర్యాపేట సెప్టెంబర్ 12, ,(భారతశక్తి):** అర్థరాత్రి జాగారం చేస్తున్న వీరంతా అన్నం పెట్టే అన్నదాతలు . పంటకు అత్యంత ముఖ్యమైన యూరియా కోసం రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తూ , తమ పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు . మీరు చూస్తున్న ఈ రైతుల అరిగోస దృశ్యాలు సూర్యాపేట పీఏసీఎస్ ముందు దర్శనమిస్తున్నాయి .



వర్షాలు బాగా పడటంతో పంటలు వేసుకున్న రైతులకు ఇప్పుడు యూరియా అవసరం ఏర్పడింది కానీ, డీలర్ల దగ్గర సరైన మోతాదులో యూరియా దొరకడం లేదు . దీంతో ఎక్కడ యూరియా దొరుకుతుందో తెలుసుకుని, అక్కడికి వెళ్లి బారులు తీరుతున్నారు . తమకు యూరియా దొరుకుతుందో లేదో తెలియకపోయినా, ఒకవేళ దొరికినా, తెల్లారేసరికి నిండుకుంటుందేమోననే భయంతో రాత్రంతా అక్కడే జాగారం చేస్తున్నారు . పగలు దుకాణాల ముందు గంటల తరబడి వేచి చూస్తుండగా యూరియా దొరక్క రాత్రిళ్ళు సైతం జాగారంతో దైన్యంగా విక్రయ కేంద్రాల దగ్గర , గోడౌన్ల ముందు పడిగాపులు కాస్తున్న రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి . కుటుంబ సభ్యులకు దూరంగా, చలిలో గజగజ వణుకుతూ యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతుల దీనస్థితి మనసును కదిలిస్తుంది. పంటలు పండించడానికి ఒక వైపు కష్టపడుతూనే , ఇప్పుడు ఎరువుల కోసం ఇలా అష్టకష్టాలు పడాల్సి వస్తోంది అని రైతులు వాపోతున్నారు .

సమాజానికి అన్నం పెట్టే ఈ

రైతుల దయనీయ పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది . యూరియా సరఫరాలో ఉన్న లోపాలను సరిచేసి , రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చూడాలని లేకపోతే , తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొని, పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుందని రైతు సంఘాలు కోరుతున్నాయి . ఈ సమస్యకు వెంటనే ఒక పరిష్కారం చూపకుంటే, పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపి ఆహార సంక్షోభం ఏర్పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు . రైతుల కష్టాలను తీర్చడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. అర్థరాత్రి జాగారం చేస్తున్న

వీరంతా అన్నం పెట్టే అన్నదాతలు . పంటకు అత్యంత ముఖ్యమైన యూరియా కోసం రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తూ , తమ పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు . మీరు చూస్తున్న ఈ రైతుల అరిగోస దృశ్యాలు సూర్యాపేట పీఏసీఎస్ ముందు దర్శనమిస్తున్నాయి .
వర్షాలు బాగా పడటంతో పంటలు వేసుకున్న రైతులకు ఇప్పుడు యూరియా అవసరం ఏర్పడింది కానీ, డీలర్ల దగ్గర సరైన మోతాదులో యూరియా దొరకడం లేదు . దీంతో ఎక్కడ యూరియా దొరుకుతుందో తెలుసుకుని, అక్కడికి వెళ్లి బారులు తీరుతున్నారు . తమకు యూరియా దొరుకుతుందో లేదో తెలియకపోయినా, ఒకవేళ దొరికినా, తెల్లారేసరికి నిండుకుంటుందేమోననే భయంతో రాత్రంతా అక్కడే జాగారం చేస్తున్నారు . పగలు దుకాణాల ముందు గంటల తరబడి వేచి చూస్తుండగా యూరియా దొరక్క రాత్రిళ్ళు సైతం జాగారంతో దైన్యంగా విక్రయ కేంద్రాల దగ్గర , గోడౌన్ల ముందు పడిగాపులు కాస్తున్న రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి . కుటుంబ సభ్యులకు దూరంగా, చలిలో గజగజ వణుకుతూ యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతుల దీనస్థితి మనసును కదిలిస్తుంది. పంటలు పండించడానికి ఒక వైపు కష్టపడుతూనే , ఇప్పుడు ఎరువుల కోసం ఇలా అష్టకష్టాలు పడాల్సి వస్తోంది అని రైతులు వాపోతున్నారు .సమాజానికి అన్నం పెట్టే ఈ రైతుల దయనీయ పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది . యూరియా సరఫరాలో ఉన్న లోపాలను సరిచేసి , రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చూడాలని లేకపోతే , తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొని, పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుందని రైతు సంఘాలు కోరుతున్నాయి . ఈ సమస్యకు వెంటనే ఒక పరిష్కారం చూపకుంటే, పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపి ఆహార సంక్షోభం ఏర్పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు . రైతుల కష్టాలను తీర్చడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

# ఇండియా కూటమిలో క్రాస్ ఓటింగ్ చిచ్చు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12,(భారతశక్తి):** ఉపరాష్ట్రపతి ఉప ఎన్నికల్లో ఇండియా కూటమికి పెద్దగా ఆశలు లేవు. కాకపోతే ఏకపక్షం కాకుండా పోటీ ఇవ్వాలనేదే ఆ కూటమి అసలు ఉద్దేశం. అందువల్లే రేవంత్ చెప్పిన మాటకు రాహుల్ తల ఊపాడు. ఇండియా కూటమిలో పెద్దలను కూడా ఒప్పించాడు. దీంతో రేవంత్ పరపతి జాతీయస్థాయిలో పెరిగింది. ఇది సహజంగానే గులాబీ పార్టీకి నచ్చదు కాబట్టి ఓటింగ్ కు దూరంగా ఉంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 0 సీట్లు వచ్చినప్పటికీ.. రాజ్యసభ ప్రకారం నాలుగు ఓట్లు గులాబీ పార్టీకి ఉన్నాయి. కాకపోతే ఓటింగ్ కు దూరంగా ఉండి పరోక్షంగా ఎన్డీఏ కూటమికి సపోర్ట్ చేసింది. మీదికేమో మేము తెలంగాణ ప్రజలకు మాత్రమే సభార్డినేట్ అంటూ గొప్ప గొప్ప మాటలు చెబుతోంది. అధికారం కోల్పోయిన తర్వాత గులాబీ పార్టీ మరింత ప్రజాస్వామ్య పార్టీగా రూపాంతరం చెందుతోంది. సుదర్శన్ రెడ్డి మీద అమిత్ షా చేసిన ఆరోపణలు ఒక్కసారిగా జాతీయస్థాయిలో ప్రచారానికి నోచుకున్నాయి. దీనికి తోడు సుదర్శన్ రెడ్డి సల్వాజుడుం మీద తాను ఇచ్చిన తీర్పును మరోసారి విలేకరుల సమావేశంలో ప్రస్తావించారు. తద్వారా నక్సలైట్లకు ఇండియా కూటమి పాజిటివ్ అనే సంకేతాన్ని బలంగా తీసుకెళ్లారు. అయితే ఇది కొంతమంది కమ్యూనిస్టులకు.. మరి కొంతమందికి నచ్చవచ్చు గాని.. అంతిమంగా ఓట్లను కురిపించే మంత్రంగా మాత్రం మారలేకపోయింది. అటు రాజ్యసభలో.. ఇటు పార్లమెంట్లో ఎన్డీఏకు బలం ఉంది కాబట్టి రాధాకృష్ణన్ గెలుపు నల్లేరు మీద నడక అయింది. కానీ ఇక్కడే ఇండియా కూటమి పప్పులో కాలు వేసింది. రాధాకృష్ణన్ గెలుపు తర్వాత.. లెక్కించిన ఓట్లలో ఈ విషయం బయటపడింది. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ప్రచారంలో ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అందులో ప్రధానమైనది ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలని ఓటర్లకు ఆయన ఇచ్చిన పిలుపు..




ఆ పిలుపుఆయన విజయానికి కాకుండా ఎన్ డి ఏ అభ్యర్థి బలాన్ని మరింత పెంచింది. రాధాకృష్ణన్ కు 19 ఓట్లు అదనంగా పడ్డాయట. అంతేకాదు 15 ఓట్లు చెల్ల లేదట. ఇదే విషయాన్ని ఓట్ల లెక్కింపు తర్వాత బయటపెట్టారు. వాస్తవానికి పార్లమెంట్, రాజ్యసభ కలిపి సభ్యులకు మొత్తం 786 ఓట్లు ఉన్నాయి. ఇందులో భారత రాష్ట్ర సమితి ఓటింగ్లో పాల్గొనేది కాబట్టి.. 782 మంది అభ్యర్థులు మాత్రమే ఓటింగ్ లో పాల్గొన్నారు. నిబంధనల ప్రకారం 394 ఓట్లు వచ్చిన వారు గెలిచినట్టు లెక్క.. ఇప్పటికే ఎన్డీఏకు 425.. ఇండియాకుటమికి 324 మంది సభ్యులు ఉన్నారు. కానీ లెక్కింపు తర్వాత ఎన్డీఏ అభ్యర్థికి అదనంగా 19 ఓట్లు వచ్చాయి. దారుణమైన విషయం ఏంటంటే 15 ఓట్లు చెల్లలేదు. దీనినిబట్టి ఇండియా కూటమి ఆత్మ ప్రబోధానుసారం ఆత్మ విమర్శ చేసుకోవాలి. లేకపోతే మొదటికే మోసం వచ్చే అవకాశం ఉంది.



# ఎలాన్ మస్క్‌పై ఎల్లిసన్ ఆధిపత్యం..

**హైదరాబాద్, సెప్టెంబర్ 12,(భారతశక్తి):** ప్రపంచ కుబేరుడిగా అర్ధ దశాబ్దంపాటు కొనసాగాడు ఎలాన్ మస్క్. అయితే మస్క్ ఆధిపత్యానికి చెక్ పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో విభేదాలు వచ్చిన కొన్ని రోజులకే మస్క్ నంబర్ వన్ స్థానం కోల్పోయాడు. ఇప్పుడు ప్రపంచ కుబేరుడిగా ట్రంప్ ఫ్రెండ్ ఒరాకిల్ సంస్థ అధినేత ఎల్లిసన్ నిలవడం చర్చనీయాంశంగా మారింది. ఒరాకిల్ కంపెనీ ఇటీవల విడుదల చేసిన ఆదాయ నివేదిక ఆర్థిక మార్కెట్‌లో సంచలనం సృష్టించింది. కృత్రిమ మేధస్సు (ఏఐ) కస్టమర్ల నుంచి డేటా సెంటర్ సామర్థ్యానికి భారీ డిమాండ్‌తో ఒరాకిల్ షేర్లు ఒక్క రోజులో 40% పెరిగాయి. ఈ ఆర్థిక విజయం ల్యారీ ఎల్లిసన్ సంపదను 101 బిలియన్ డాలర్లకు పెంచి, 393 బిలియన్ డాలర్లకు చేర్చింది. దీంతో ఎలాన్ మస్క్‌ను (385 బిలియన్ డాలర్లను) అధిగమించి, బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో అగ్రస్థానానికి చేరాడు. ఒరాకిల్ సీఈవో సఫ్రా కాట్జ్ ప్రకారం, కంపెనీ ఈ త్రైమాసికంలో నాలుగు బిలియన్ డాలర్ల కాంట్రాక్ట్‌లపై సంతకం చేసింది. రాబోయే నెలల్లో మరిన్ని భారీ ఒప్పందాలు ఖాయమని ఆమె తెలిపారు. ఏఐ సాంకేతికతకు సంబంధించిన డేటా సెంటర్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను ఒరాకిల్ సమర్థవంతంగా అందిపుచ్చుకోవడం ఈ విజయానికి ప్రధాన కారణం. ఈ వ్యూహం కంపెనీ మార్కెట్ విలువను గణనీయంగా పెంచింది, ఎల్లిసన్ సంపదను కొత్త శిఖరాలకు చేర్చింది. 81 ఏళ్ల ల్యారీ ఎల్లిసన్ 1977లో ఒరాకిల్‌ను స్థాపించాడు. 2014 వరకు సీఈవోగా సేవలందించారు.

ప్రస్తుతం ఛైర్మన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా కొనసాగుతున్న ఆయన, కంపెనీ సాంకేతిక ఆవిష్కరణలకు మార్గదర్శకుడిగా ఉన్నారు. ఎల్లిసన్ వ్యాపార దూరదృష్టి, ఏఐ, క్లౌడ్ సాంకేతికతలపై దృష్టి సారించడం వల్ల ఒరాకిల్ ప్రపంచ టెక్ దిగ్గజంగా ఎదిగింది. ఆయన వ్యక్తిగత సంబంధాలు, ముఖ్యంగా ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలు, ఒరాకిల్‌కు వ్యాపార అవకాశాలను మరింత విస్తరించాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎలాన్ మస్క్ గతంలో ప్రపంచ కుబేరుడిగా ఆధిపత్యం చెలాయించినప్పటికీ, ఒరాకిల్ షేర్ల ఊపందిస్తూ ఎల్లిసన్ అతన్ని అధిగమించారు. టెస్లా, స్పేస్‌ఎక్స్ వంటి కంపెనీలతో మస్క్ సంపద గణనీయంగా ఉన్నప్పటికీ, ఒరాకిల్ ఇటీవలి ఆర్థిక విజయం ఎల్లిసన్‌ను ముందంజలో నిలిపింది. ఈ ఆర్థిక మైలురాయి టెక్ పరిశ్రమలో ఏఐకు పెరుగుతున్న ప్రాముఖ్యతను, అలాగే ఒరాకిల్ యొక్క వ్యూహాత్మక విజయాన్ని సూచిస్తుంది.

# ఫేమస్ ఫంక్షన్ హాల్ సీజ్.

**హైదరాబాద్, సెప్టెంబర్ 12,(భారతశక్తి):** ప్రభుత్వ స్థలంలో నిర్మించిన చాలా వరకు నిర్మాణాలు హైడ్రా వచ్చిన తర్వాత ఒక్కోటి బయటకు వస్తున్నాయి. కొంత మంది అక్రమ కట్టాలు విషయంలో ఫిర్యాదు చేసేందుకు హైడ్రా దాక వెల్లకుండా.. ఆ పరిధి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అక్కడ నిజంగానే అక్రమ కట్టడం జరిగిందా లేదా అనేది అధికారులు నిర్ధారించుకొని వాటిని కూల్చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో ఏ నిర్మాణాలు చేపట్టవద్దని ప్రభుత్వం చెబుతున్నా.. చాలా మంది పెడచెవిన పెడుతున్నారు. ఈ కోవలోకే వస్తుంది ఈ ఘటన. హైదరాబాద్ లో ఫేమస్ ఫంక్షన్ హాల్ ను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు చర్యలు వేగవంతం చేస్తున్నారు. తాజాగా హిమాయత్‌నగర్‌లో హైదరగూడ అపోలో ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఈఎఫ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు.

ఈ స్థలం ప్రభుత్వానికి చెందిందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. పోలీసులు భద్రత కల్పించగా అధికారుల బృందం స్వాధీనం చేసుకుందిఈ వ్యవహారం చాలా కాలంగా న్యాయపరమైన వివాదంలో ఉంది. ఫంక్షన్ హాల్ యజమానులు ప్రభుత్వ భూమిలో వ్యాపారం నడుపుతున్నారని గతంలో కేసు నమోదైంది. చివరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ఈ చర్య సపట్టారు. ఈ సందర్భంగా మజ్లీస్ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం కూడా చోటుచేసుకుంది. హైడ్రా ఏర్పడిన తర్వాత నగరంలో అనేక అక్రమ నిర్మాణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటివరకు ప్రజలు అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు చేసేందుకు నేరుగా హైడ్రాకు వెళ్లకపోయినా.. పరిధి రెవెన్యూ అధికారులకు సమాచారం అందిస్తే అక్కడి పరిశీలన తర్వాత నిర్మాణం చట్టబద్ధమా కాదా అనేది నిర్ధారిస్తున్నారు.

అక్రమంగా తేలితే వాటిని కూల్చివేయడం లేదా స్వాధీనం చేసుకోవడం జరుగుతోంది. ప్రభుత్వం తరచూ ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తోంది. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి కట్టడాలు, వ్యాపారాలు, ఫంక్షన్ హాళ్లు లేదా వాణిజ్య ప్రాజెక్టులు చేయకూడదని స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ కొంతమంది పెద్దల మద్దతుతో అక్రమంగా భూములను ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈఎఫ్ గార్డెన్ ఘటన కూడా అదే తరహాలో వెలుగులోకి వచ్చింది. నగరంలో అనేక ప్రాంతాల్లో ఇలాంటి కేసులు బయటపడుతున్నాయి. శివార్లలో గాని, వాణిజ్య కేంద్రాల్లో గాని అక్రమ కట్టడాలు గుర్తించిన వెంటనే హైడ్రా బృందాలు అక్కడికి చేరుకొని చర్యలు తీసుకుంటున్నాయి. ప్రజలు కూడా ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. అధికారుల కఠిన చర్యలు కొనసాగితే భవిష్యత్తులో నగరంలో అక్రమ నిర్మాణాల పెరుగుదల తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# స్వస్థలాకు సేఫ్ గా ఆంధ్రులు

**ఖాట్మాండు, విజయవాడ, సెప్టెంబర్ 12,(భారతశక్తి):** ఏపీ మంత్రి నారా లోకేష్ కృషి ఫలించింది. ఆయన చొరవతో నేపాల్ నుంచి ఏపీ వాసులు క్షేమంగా చేరుకున్నారు. నేపాల్ లో ఆందోళనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. హింసతో నేపాల్ అట్టుడుకి పోతోంది. ఈ నేపథ్యంలో నేపాల్ వెళ్లిన తెలుగు ప్రజల భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అయ్యింది. నేపాల్ వెళ్లిన బాధిత కుటుంబాలు ఆందోళనతో ఉన్నాయి. ఈ తరుణంలో నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించేందుకు మంత్రి నారా లోకేష్ రంగంలోకి దిగారు. ఢిల్లీలో ఏపీ భవన్ తో పాటు నేపాల్ లో ఉన్న భారత రాయబార కార్యాలయంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకున్నారు. నేరుగా బాధితులతో వీడియో కాల్ లో మాట్లాడుతూ తగు జాగ్రత్తలు సూచించారు. అక్కడ నుంచి స్వస్థలాలకు క్షేమంగా బయలుదేరేలా ఏర్పాట్లు చేయడంలో నరాల్లోకే సక్సెస్ అయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్న క్రమంలో 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' పేరుతో అనంతపురంలో కూటమి ప్రభుత్వం విజయోత్సవ సభ నిర్వహించింది. అయితే ఆ సభకు మంత్రి నారా లోకేష్ వెళ్లలేదు. సచివాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్ నుంచి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ చర్యలు ఫలించి నేపాల్ లో చిక్కుకున్న తెలుగు ప్రజలు స్వదేశానికి పయనం అవుతున్నారు. నేపాల్ లో 12 ప్రాంతాల్లో 217 మంది ఏపీ వాసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిని ఏపీకి రప్పించేందుకు చర్యలు ప్రారంభించారు. తొలివిడతగా నేపాల్ లోని హెటౌడా నుంచి 22 మంది ఏపీ వాసులను సురక్షితంగా బీహార్ సరిహద్దు ప్రాంతాలకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఏపీకి రప్పించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తమను క్షేమంగా తీసుకురావడంపై ఏపీ ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ఖాట్మండు పరిసరాల్లో ఉన్న 173 మందిని తరలించేందుకు గురువారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక విమానం ఢిల్లీ నుంచి నేపాల్ వెళ్లింది.

# లిక్కర్ కేసులో కొత్త మలుపులు

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 12(భారతశక్తి):** ఏపీలో మద్యం కుంభకోణం కేసు మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో ఒకవైపు విచారణ.. ప్రత్యేక దర్యాప్తు బృందం తనిఖీలు.. మరోవైపు నిందితుల అరెస్టు.. కోర్టు బెయిళ్లు కొనసాగుతున్నాయి. తాజాగా జగన్మోహన్ రెడ్డి సన్నిహితుడు నర్రెడ్డి సునీల్ రెడ్డికి సంబంధించిన కార్యాలయాల్లో ఏకకాలంలో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. హైదరాబాద్ తో పాటు విశాఖలోని 11 కార్యాలయాల్లో సోదాలు జరుపుతున్నారు. మద్యం కుంభకోణం కేసులో సునీల్ రెడ్డి సైతం ఉన్నారు.



హైదరాబాద్లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3 స్నేహ హౌస్ లో, సాగర్ సొసైటీలో, ఖైరతాబాద్ కమలాపురి కాలనీలో, విశాఖలోని వాల్తేరు రోడ్డులో ఉన్న కార్యాలయాల్లో సిట్ అధికారుల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడ ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులకు కొన్ని ఆధారాలు పట్టుబడినట్లు సమాచారం. మద్యం కుంభకోణం కేసులో పట్టు బిగిస్తోంది ప్రత్యేక దర్యాప్తు బృందం. కానీ ఈ కేసులో అరెస్ట్ అయిన మాజీ ఐఏఎస్ అధికారి ధనంజయ రెడ్డి, అప్పటి జగన్ ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్ప బాలాజీలు బెయిల్ పై విడుదలయ్యారు. వారిపై ఆధారాలకు సంబంధించి చార్ట్ సీట్లో సరైనవి చూపించలేదు. దీంతో కోర్టు వారికి బెయిల్ ఇచ్చింది. అయితే మిగతా నిందితులకు సంబంధించి బెయిల్ వస్తుందని అంతా భావిస్తున్నారు. అయితే ఆ ముగ్గురు బెయిల్ విషయంలో సిట్ వ్యూహాత్మకంగా వ్యవహరించిందని తెలుస్తోంది. అదే సమయంలో ఐదు రోజుల కిందట మధ్యంతర బెయిల్ పై విడుదలయ్యారు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి. ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి సమన్వయం చేసుకునేందుకుగాను ఆయన వేసిన పిటిషన్ మేరకు ఏసిబి కోర్టు బెయిల్ ఇచ్చింది. ఐదు రోజుల అనంతరం కోర్టు ఆదేశాల మేరకు రాజమండ్రి సెంట్రల్ జైల్లో సరెండర్ అయ్యారు మిథున్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్యం కుంభకోణం కేసును చాలా తేలిగ్గా తీసుకుంది. అసలు ఇందులో ఆధారాలు లేవని చెప్పుకొచ్చింది. కానీ సిట్ దర్యాప్తు చూస్తుంటే లోతైన విచారణలా కనిపిస్తోంది. మరోవైపు నిందితులకు బెయిల్ వస్తోంది. ఇటువంటి కన్ఫ్యూజన్ వాతావరణంలో జగన్మోహన్ రెడ్డికి సన్నిహితుడిగా భావిస్తున్న సునీల్ రెడ్డి కంపెనీల్లో ఏకకాలంలో సోదాలు జరుగుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏకకాలంలో 10 కంపెనీల్లో తనిఖీలు చేస్తుండడం సంచలనంగా మారింది. అక్కడ కీలక ఆధారాలు లభ్యమైనట్లు ప్రచారం నడుస్తోంది.

## ఉప్పొంగిన మూసి నది



యాదాద్రి జిల్లా.. సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):
ఉప్పొంగి ప్రవహిస్తున్న మూసి వాగు లో లెవెల్ బ్రిడ్జి పై నుండి వరద నీరు వెళ్తుండంతో అధికారులు రాకపోకలు మూసివేసారు. హైదరాబాద్లో కురిసిన భారీ వర్షానికి మూసి వాగు ఉదృతంగా ప్రవహిస్తుంది. దీనితో యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ పోచంపల్లి వలిగొండ బోనగిరి మండలాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది లో లెవెల్ బ్రిడ్జి పై నుండి ఉదృతంగా వరద నీరు వెళుతున్న కారణంగా అధికారులు రహదారిని మూసివేశారు. వలిగొండ మండలం భీమలింగం కత్వ వద్ద మూసి వాగు లో లెవెల్ బ్రిడ్జి పై నుండి వెళ్తుంది.. బీబీనగర్ మండలం రుద్రవెల్లి గ్రామ సమీపంలోని మూసి వాగు లో లెవెల్ బ్రిడ్జి పై నుండి ఉదృతంగా ప్రవహిస్తుంది.

==============================

## ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం



హుస్నాబాద్ సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):
హుస్నాబాద్ మండలం తోటపల్లి లో ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారులు గూళ్ళ లింగం లావణ్య ల నూతన గృహ ప్రవేశం సందర్భంగా పూజ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని ఇందిరమ్మ ఇళ్లు ను ప్రారంభించారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో పేదల ఇంటి కల నెరవేర్చడానికి ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. మొదటి దశలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు.
ఇల్లు కట్టి చూడు పెళ్ళి చేసి చూడు అంటారు.. ప్రజాపాలన ప్రభుత్వంలో ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుంది. ఇల్లు ఒక కల.. ప్రభుత్వం ఇస్తున్న సహకారంతో త్వరగా నిర్మాణం చేసుకోవాలని అన్నారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతులకు తప్పని యూరియా కష్టాలు

**వేకువజాము నుంచే సొసైటీల వద్ద బారులు తీరిన రైతులు**

**సైదాపూర్, చిగురుమామిడి, వేములవాడ మండలాల్లో యూరియా కోసం క్యూ కట్టిన రైతులు**

**రైతుకు ఒక బస్తానే ఇస్తున్న అధికారులు**

**కావలసినంత యూరియా దొరక్క ఆవేదనతో అన్నదాతల ఆందోళన**

హుజురాబాద్, సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):
యూరియా కష్టాలు రైతులను వెంటాడుతున్నాయి. రోజుకు యూరియా కొరత తీవ్రం అవుతుండడంతో అన్నదాతలు ఆవేదనతో ఆందోళన చెందుతున్నారు. నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు యూరియా కోసం సొసైటీల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడింది. హుజురాబాద్, హుస్నాబాద్, వేములవాడ నియోజకవర్గాల్లో వేకువజాము నుంచే రైతన్నలు సొసైటీల వద్ద బారులు తీరారు. మహిళలు పురుషులు అనే తేడా లేకుండా అన్నదాతలు క్యూ కట్టి యూరియా కోసం ఎదురు చూశారు. యూరియా లారీ వస్తుందన్న సమాచారంతో సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామంలో ది విశాల సహకార పరపతి సంఘం వద్దకు రైతులు భారీ సంఖ్యలో చేరారు. టోకెన్ల కోసం క్యూ కట్టారు. పాస్ బుక్కులు ఆధార్ కార్డుల ఆధారంగా రైతు ఒక్కంటికి ఒక్క యూరియా బస్తా మాత్రమే అధికారులు పంపిణీ చేశారు. అటు చిగురుమామిడి మండలం సుందరగిరి లో అదే పరిస్థితి కనిపించింది. యూరియా వస్తుందనే సమాచారంతో పెద్ద సంఖ్యలో రైతులు సొసైటీ సెంటర్ వద్దకు చేరుకొని యూరియా కోసం ఎదురు చూశారు. కావలసినంత యూరియా లభించకపోవడంతో రైతన్నలు ఆవేదనతో ఆందోళన వ్యక్తం చేశారు. వేములవాడలో వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు వేకువజాము నుంచే క్యూ కట్టి నిరసన తెలిపారు. రైతుకు ఒక బస్తా కంటే ఎక్కువ ఇవ్వకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ ను రైతుకు ఒక బస్తా ఇస్తున్నామని త్వరలోనే స్టాక్ వచ్చిన తర్వాత ఎకరానికి ఒక బస్తా చొప్పున పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. అదను దాటిన తర్వాత ఇచ్చి ఏమి ప్రయోజనమని రైతన్నలు అధికారులను నిలదీశారు. యూరియా దొరకక పలుచోట్ల రైతన్నలు నిరసన ఆందోళన వ్యక్తం చేశారు.

==============================

## గోదావరిలో గల్లంతయిన రాజేష్ మృతదేహం లభ్యం

మంచిర్యాల సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):
పెద్దపల్లి జిల్లా గోదావరిఖని గోదావరి వంతెన వద్ద వారం రోజుల క్రితం గణేష్ నిమజ్జనం సమయంలో గోదావరిలోపడి గల్లంతైన రాజేష్ మృతదేహం మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం లక్ష్మీపురం వద్ద లభ్యం అయింది. రామగుండంకు చెందిన రాజేష్ స్నేహితులతో కలిసి నిమజ్జనం చేయడానికి గోదావరి కి వచ్చాడు. విగ్రహంను గోదావరి లో వేస్తుండుగా ప్రమాదవశాత్తు కాలు జారి గల్లంతైయ్యాడు. వారం రోజులుగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా లక్ష్మీపురం వద్ద మృతదేహం లభ్యమైంది. చెన్నూరు పోలీసులు రాజేష్ మృతదేహాన్ని బందువులకు అప్పగించారు.

==============================

## డిమాండ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఆర్టీసీ కార్మికులు

మంథని సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):
సెప్టెంబర్ 12న ఆర్టీసి పరిరక్షణ దినం గా పాటించాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు టిఎస్ ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంథని బస్సు డిపోలో శుక్రవారం ఉదయం నుంచి పలు డిమాండ్ లతో కూడిన బ్యాడ్జీలను స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కరీంనగర్ రీజియన్ అధ్యక్షులు రాపెల్లి రాజయ్య విధులకు హాజరయ్యే ఆర్టీసీ కార్మికులకు అందించి ధరింపజేశారు.

## కొత్త కార్డుల కష్టాలు....ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు




వరంగల్, సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):
తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిన ప్రభుత్వం.. కొత్త వారికి కూడా సెప్టెంబర్ కోటా రేషన్ విడుదల చేసింది. అయితే వీరిలో చాలా మందికి డీలర్లు రేషన్ ఇవ్వడం లేదు. కారణం ఈకేవైసీ పూర్తి చేయకపోవడం. కొందరు ఈకేవైసీ పూర్తి చేసినా.. ఆధార్ అప్డేట్ లేకపోవడంతో వారి రేషన్ కార్డు ఈకేవైసీ రావడం లేదు. దీంతో వారంతా ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కొత్త రేషన్కార్డులు మంజూరు చేసింది. జూన్ నెలలోనే మూడు నెలల రేషన్ పంపిణీ చేసిన ప్రభుత్వం సెప్టెంబర్ 1 నుంచి తిరిగి రేషన్ పంపిణీ ప్రారంభించింది. కొత్తగా రేషన్ కార్డు పొందిన వారికి కూడా సెప్టెంబర్ నుంచి రేషన్ పంపిణీ చేస్తున్నారు. అయితే కొత్తగా కార్డు పొందిన వారితో పాటుగా.. పాత రేషన్కార్డు హోల్డర్లకు ఆధార్ కార్డుకు సంబంధించిన ఓ ఇష్యూ వల్ల సమస్య ఎదుర్కొంటున్నారు. దీంతో డీలర్లు వారికి బియ్యం ఇవ్వడం లేదు. ఇంతకు సమస్య ఏంటి అంటే..రేషన్కార్డు దారులు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత రెండేళ్ల నుంచి చెబుతూనే ఉన్నాయి. పైగా ఈకేవైసీ అప్డేట్ కోసం గడువు పెంచుతూపోతున్నాయి. అయినా సరే ఇంకా కొందరు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయలేదు. అలానే తాజాగా మంజూరు చేసిన కొత్త రేషన్కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చారు. వీరికి కూడా సెప్టెంబర్ నెలకు సంబంధించిన రేషన్ కోటా విడుదల చేశారు. అయితే వీరంతా బియ్యం పొందాలంటే కచ్చితంగా ఈకేవైసీ చేయించాల్సిందే అంటున్నారు డీలర్లు. చాలా వరకు జిల్లాల్లో సుమారు 80 శాతం మందికి ఈకేవైసీ పూర్తి కాగా.. మరో 20 శాతం మంది మాత్రం ఇంకా పూర్తి చేయలేదు. దీంతో వారికి రేషన్ బంద్ చేస్తామని డీలర్లు చెబుతున్నారు.అయితే వీరిలో కొందరు ఈకేవైసీ చేయించుకున్నప్పటికీ.. వీరి వేలి ముద్రలు అప్డేట్ కావడం లేదు. దీని గురించి ఆరా తీయగా.. సదరు వ్యక్తుల ఆధార్ కార్డు అప్డేట్ కాలేదని.. అందుకే వారి ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కాలేదని తెలిసింది. చిన్నారులకు ఆధార్ కార్డు అప్డేట్ చేయకపోవడం వల్ల వారు ఈకేవైసీకి దూరం అయ్యి.. రేషన్ బియ్యం పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో వీరంతా ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే పలు జిల్లాల్లో ఆధార్ కేంద్రాలు తక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని మండలాల్లో ఆధార్ కేంద్రాలు లేవు. దీంతో వీరు ఇతర మండలాలకు వెళ్తున్నారు. దీంతో పలు ఆధార్ కేంద్రాల వద్ద జనాలు పెద్ద సంఖ్యలో క్యూ కడుతున్నారు. అధికారులు మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది అంటున్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఆలస్యం అయినా పర్లేదు కానీ.. ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకుంటే మంచిది అంటున్నారు. ఆధార్కు ఈ-పాస్ యంత్రాన్ని అనుసంధానం చేయడంతో.. తప్పుడు వ్యక్తులు బియ్యం తీసుకోవడానికి వీలుండదు. అందుకే కేవైసీ నిబంధన తప్పనిసరి చేశారు.

## జూబ్లీహిల్స్ నుంచి కవిత పోటీ



హైదరాబాద్, సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):
బీఆర్ఎస్ పార్టీ నేతలపై సంచలన ఆరోపణలు చేసి ఆ పార్టీలో తుపాన్ సృష్టించారు. కల్వకుంట్ల కవిత. స్వయంగా పార్టీ అధినేత కేసీఆర్ కూతురు.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఈఆర్ సోదరి. కానీ, పార్టీలో తన గుర్తింపు కోసం కొన్నాళ్లుగా సంచలన వ్యాఖ్యలు చేస్తూ.. పార్టీని దెబ్బతీసేలా మాట్లాడుతూ వచ్చారు. ఇటీవలే బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్రావు, సంతోష్కుమార్పై అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో అధిష్టానం కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఇప్పుడు కవిత మరో సంచలన నిర్ణయం తీసుకుని బీఆర్ఎస్ కంట్లో నలుసులా మారారు. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్, ఆ తర్వాత పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. తన సామాజిక, సాంస్కృతిక సంస్థ అయిన తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా మార్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త పార్టీ స్థాపన ద్వారా తెలంగాణ రాజకీయాల్లో తన సొంత గుర్తింపును నెలకొల్పాలని కవిత భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు ఆమెకు ఒక కీలక వేదికగా మారనున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ నడుస్తుండగా, కవిత ఎంట్రీ రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశం ఉంది. కవిత స్వతంత్రంగా లేదా కొత్త పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగితే, బీఆర్ఎస్ ఓటు బ్యాంకులో చీలిక తప్పదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికలు హైదరాబాద్లో బీఆర్ఎస్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే అవకాశంగా కాంగ్రెస్, బీజేపీలు భావిస్తున్నాయి. కవిత జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే, ఆమె గెలిచే అవకాశాలు తక్కువైనప్పటికీ, బీఆర్ఎస్ ఓట్లను ఆకర్షించడం ద్వారా పార్టీకి నష్టం కలిగించే అవకాశం ఉంది. అయితే కవిత తన సస్పెన్షన్, పార్టీలో తనను సైడ్లైన్ చేసిన ఆరోపణలను ఉపయోగించి బాధితురాలిగా సానుభూతి పొందేందుకు ప్రయత్నించవచ్చు. ఈ పరిస్థితి బీఆర్ఎస్కు ఇబ్బందిగా మారవచ్చు.కవిత జూబ్లీహిల్స్లో తన ప్రభావాన్ని అంచనా వేసేందుకు సర్వేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ సర్వేలు ఆమె ఓటు బ్యాంకు, స్థానిక రాజకీయ పరిస్థితులు, బీఆర్ఎస్పై ప్రభావితం చేసే అంశాలను తెలుసుకోవాలని చూస్తున్నారని సమాచారం. కవిత తన తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చి, బహుజన రాష్ట్ర సమితి (టీబీఆర్ఎస్) వంటి పేరుతో కొత్త రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని ఊహాగానాలు సాగుతున్నాయి. ఈ ఎన్నికలు ఆమె రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే కీలక పరీక్షగా మారనున్నాయి.కవిత ఎంట్రీతో బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బలహీనపడితే, కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఉప ఎన్నిక ఒక అవకాశంగా మారవచ్చు. కాంగ్రెస్ ఈ ఎన్నికను హైదరాబాద్లో తమ ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు ఉపయోగించుకోవాలని చూస్తోంది. నవీన్ యాదవ్, రంజిత్ రెడ్డి వంటి నాయకులు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశం ఉంది. బీజేపీ కూడా సికింద్రాబాద్ లోక్సభ స్థానంలో భాగమైన ఈ నియోజకవర్గంలో తమ ప్రభావాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. కవిత పోటీ వల్ల బీఆర్ఎస్ ఓట్లు చీలితే, ఈ రెండు పార్టీలకు లాభం చేకూరే అవకాశం ఉంది.

## ధరణిలో మాయమైన కోట్లాది ఎకరాలు....

**నాలుగు జిల్లాల్లో కనిపించని లెక్కలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):
కాళేశ్వరం పెద్ద స్కామని.. అందులో వేలకోట్ల అక్రమాలు జరిగాయని రేవంత్ నుంచి మొదలు పెడితే ఉత్తంకుమార్ రెడ్డి వరకు ఆరోపిస్తుంటారు. దాని తర్వాత గొర్రెలు.. ఫార్ములా ఈ రేస్ కుంభకోణాలు ఉంటాయని అంటుంటారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజలు అసలు విషయాన్ని మర్చిపోతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ధరణి గురించి గులాబీ నేతలు గొప్పగా చెప్పుకున్నారు. తెలంగాణ భూ రికార్డులు మొత్తం డిజిటలైజ్ చేసామని.. వాటిని సరికొత్తగా మార్చామని వివరించారు. కానీ ఆ ధరణి పెద్ద మోసమని.. అందులోనే పెద్ద వ్యవహారం ఉందని అప్పట్లోనే ఆరోపణలు వినిపించాయి. ఇప్పటికీ కూడా ధరణి పాపాలు తెలంగాణ రైతుల ఉసురు తీసుకుంటూనే ఉన్నాయి. తాజాగా దీనికి సంబంధించి ఒక కీలక విషయం బయటకు వచ్చింది.తెలంగాణ రాష్ట్రంలో ధరణి రాక ముందుకు పట్టా భూములు 1.30 కోట్ల ఎకరాల వరకు ఉండేవి. ధరణి వచ్చిన తర్వాత ఏకంగా 25 లక్షల ఎకరాలకు పట్టా భూములు పెరిగాయి. ఫలితంగా 1.55 కోట్ల ఎకరాలకు పట్టా భూములు పెరిగిపోయాయి. ఇదే సమయంలో ప్రభుత్వ, అటవీ, దేవాదాయ, వివాదాస్పద, వక్ఫ్ భూములు మాయమయ్యాయి. ధరణిలో భూములు మాయమైన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్ గిరి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాలలో అత్యధికంగా భూములు మాయమైనట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతాలలో భూముల ధరలు అధికంగా ఉండడంతోనే మాయమైనట్టు తెలుస్తోంది. కొన్ని జిల్లాలలో కలెక్టర్లు నోటిఫై చేయడానికి నిరాకరించిన భూములను కూడా టీజీటీఎస్ ద్వారా తమకు అనుకూలంగా మార్చుకున్నట్టు తెలుస్తోంది.గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ను ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహించింది. గత సర్కార్ పెద్దలు, చీఫ్ సెక్రటరీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే భూములలో మార్పులు చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు భూముల నిర్వహణకు సంబంధించి చేసిన ఫోరెన్సిక్ ఆడిట్ కంటే ముందే టెర్రా సిస్ అనే సంస్థ ఈ వ్యవహారాన్ని అధికారులకు చెప్పింది. మార్చిన భూములకు సంబంధించిన వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి అందించింది. కాళేశ్వరం కేసును ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థ చేతిలో పెట్టింది రేవంత్ ప్రభుత్వం. ఇంకా కొన్ని కేసులను కూడా కేంద్ర దర్యాప్తు సంస్థకు ఇవ్వడానికి రెడీగా ఉంది. అసలు గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన కుంభకోణాల కంటే అతి పెద్ద మాయాజాలం ధరణి. ఇన్ని వివరాలు తెలిసాయి

## టీడీపీపైనే బీజేపీ భారం...

హైదరాబాద్, సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):
తెలంగాణలో( తెలుగుదేశం పార్టీ మరోసారి క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. తెలుగుదేశం పార్టీ ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రభావవంతమైన పార్టీగా ఎదిగింది. సుదీర్ఘకాలం అధికారంలో ఉంది. ప్రతిపక్ష పాత్ర కూడా పోషించింది. రాష్ట్ర విభజన తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో ఉనికి కోల్పోయింది. అయినా సరే అక్కడ క్యాడర్ కొనసాగుతోంది. ప్రధానంగా సెటిలర్స్ ఉన్న గ్రేటర్ హైదరాబాద్, ఖమ్మం వంటి జిల్లాల్లో ఇప్పటికీ టిడిపి జెండాలు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఇప్పుడు మరోసారి గ్రేటర్లో తెలుగుదేశం పార్టీ క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ముఖ్యంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఆసక్తికరంగా మారుతోంది. ఇక్కడి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఈ స్థానానికి ఎన్నిక అనివార్యంగా మారింది. ఈ ఏడాది చివర్లో ఎన్నిక జరిగే అవకాశం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తో పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రకటన రావచ్చు అని అంచనా వేస్తున్నారు. దీంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కుతున్నాయి. ప్రధాన పార్టీలు పోటీకి సిద్ధపడుతున్నాయి. కానీ అందరి చూపు తెలుగుదేశం పార్టీ పైనే ఉంది.2014లో మాగంటి గోపీనాథ్ తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే తెలంగాణలో మారిన రాజకీయ ముఖచిత్రంతో ఆయన కెసిఆర్ వెంట అడుగులు వేస్తారు. జూబ్లీహిల్స్ అనేది సెటిలర్స్ ఎక్కువగా ఉండే ప్రాంతం. అయితే మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. అప్పట్లో ఏపీలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు అరెస్ట్ అయ్యారు. ఆ సమయంలో ఎన్నికలు రావడంతో టిడిపి బరిలో దిగలేదు. అయితే ఇప్పుడు కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో టిడిపి పోటీ చేసే ఛాన్స్ లేదు. అందుకే ఆ పార్టీ మద్దతు కూడగట్టేందుకు అటు బిఆర్ఎస్, ఇటు బిజెపి ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.ఎమ్మెల్యే గోపీనాథ్ అనారోగ్యంతో మృతి చెందడంతో.. వచ్చిన ఉప ఎన్నికను ఏకగ్రీవం చేయాలని బిఆర్ఎస్( భావిస్తోంది. కానీ కాంగ్రెస్ పార్టీ ఒప్పుకునే పరిస్థితిలో లేదు. ఇక్కడ బీసీ నేత నవీన్ యాదవ్ కు ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. నవీన్ యాదవ్ తండ్రి శ్రీశైలం యాదవ్ కు టిడిపి తో మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే టిడిపి ఓటర్లు నవీన్ యాదవ్ పై మొగ్గు చూపుతారని రేవంత్ అంచనా వేస్తున్నారు. మరోవైపు టిఆర్ఎస్ అభ్యర్థిగా దివంగత మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులను బరిలో దించేందుకు కేసిఆర్ నిర్ణయించారు. 2014లో మాగంటి గోపీనాథ్ టిడిపి ద్వారా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఈ నియోజకవర్గంలో కమ్మ సామాజిక వర్గంతో పాటు సెటిలర్స్ అధికంగా ఉన్నారు. వీరంతా టిడిపి సానుభూతిపరులే. మాగంటి కుటుంబం ఇప్పటికీ చంద్రబాబు కుటుంబంతో సన్నిహితంగా మెలుగుతూ వచ్చింది. అందుకే గోపీనాథ్ మృతి చెందినప్పుడు మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు పరామర్శకు వచ్చారు. మొన్న ఆ మధ్య జూబ్లీహిల్స్ కు సంబంధించి మాట్లాడేందుకు కేటీఆర్ నారా లోకేష్ ను కలిసినట్టు కామెంట్స్ వినిపించాయి. స్వయంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ ఆరోపణలు చేశారు.ఇంకోవైపు ఏపీలో తెలుగుదేశం పార్టీతో కీలక భాగస్వామిగా ఉంది భారతీయ జనతా పార్టీ. కేంద్రంలో సైతం టిడిపి కీలక భాగస్వామి. సుదీర్ఘకాలం పొత్తు ద్వారా ముందుకు వెళ్లాలని ఆ రెండు పార్టీలు ఒక నిర్ణయం తీసుకున్నాయి. అందుకే ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సైతం బిజెపి తప్పకుండా టిడిపి సహకారం కోరే అవకాశం ఉంది. బిజెపి సైతం టిడిపి మూలాలు ఉన్న నేతకు టికెట్ ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. అందుకే ఇప్పుడు తెలుగుదేశం పార్టీ తెలంగాణలో ముద్ర చాటుకునే అవకాశం వచ్చింది. మరి టిడిపి నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి

## డయేరియా ప్రభావిత ప్రాంతం న్యూ రాజేశ్వరరావు పేటలో మంత్రులు, ఎంపీ పర్యటన

విజయవాడ సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):
డయేరియా ప్రభావిత ప్రాంతం న్యూ రాజేశ్వరరావు పేటలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా, మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, డీఎంహెచ్వో సుహాసిని పర్యటించారు. ×కేర్ అండ్ షేర్ వి. ఎమ్. సి స్కూల్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో డయేరియా బాధితులతో మాట్లాడారు,. వారి ఆరోగ్య స్థితిపై ఆరా తీసారు. జిల్లా అధికారులతో మంత్రులు, ఎంపీ సమీక్షా సమావేశంనిర్వహించారు. ×తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రంగానికి మంత్రులు, ఎంపీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు.
ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ×మెడికల్ క్యాంపుపై ప్రజలందరికీ అవగాహన కల్పించాం. ప్రజలు ఇబ్బంది పడకుండా ముందు తాత్కాలిక చర్యలు చేపట్టాం. రాబోయే



రోజుల్లో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తో కలిసి ఇలాంటి ఘటనలో పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని అన్నారు.

# వానలు, వరదలతో అన్నదాత ఘోష

అదిలాబాద్, సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):

నిర్మల్ జిల్లాలో గత నెల 27 నుంచి కురిసిన వర్షాలు అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. వాన కాలంలో సాగుచేసిన పంటలకు భారీ వర్షాల వల్ల వాగులు గొర్రెలు చెరువు లు నదులు ఉప్పొంగి ప్రవహించడంతో వరదదాటికి పంటలు నీట మునగడమే కాకుండా కొట్టుకపోయాయి. నిర్మల్ జిల్లాలో 79 వ్యవసాయ కష్టాల పరిధిలో వర్షాలు వరదల వల్ల20, 000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు వంచన వేస్తున్నారు.జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు స్వర్ణ వాగు ప్రాజెక్ట్ గడ్డన్న శుద్ధ వాగు తో పాటు గోదావరి పరివాహక ప్రాంతమైన బాసర లోకేశ్వరం దిల్వార్పూర్ సొన్ లక్ష్మణ చందా ఖానాపూర్ కడెం దస్తురాబాద్ మండలాల్లో పత్తి సోయా మొక్కజొన్న వరి పసుపు తదితర పంటలు మూడు రోజులపాటు నీటిలోనే ఉండడంవల్ల అధిక నీటితో కూలిపోయినట్టు రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు సారంగాపూర్ నర్సాపూర్ కుబీర్ కుంటాల తదితర మండలాలు చెరువు అలుగులు వాగుల వల్ల వరదల్లో తీవ్ర నష్టం జరిగినట్టు రైతులు పేర్కొంటున్నారు. నిర్మల్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల రైతులు సాగు చేసుకున్నాం పంటలు నష్టపోవడంతో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించినట్టు తెలిపారు. జిల్లాలోని 79 వ్యవసాయ క్లస్టర్లలో ఏఈవోలు ఆయా కష్టాల పరిధిలో భారీ వర్షాలు వరదల వల్ల దెబ్బతిన్న వివిధ పంటలను సర్వే నెంబరు ఫోటో రైతు పేరు పంట నష్టం ఎకరాలు తదిత వివరాలను నమోదు చేసుకొని ఆన్లైన్ చేశారు.జిల్లాలో మొత్తం 12,804 రైతులు 19530 ఎకరాల్లో వివిధ పంటలు నష్టపోయినట్టు తెలిపారు. ఇందులో వరి పంట 59 82 ఎకరాలు పత్తి 38:40 సోయా 62 86 మొక్కజొన్న 18 85 పసుపు 10 62 ఆయిల్ సీడ్ పంట 326 ఎకరాలు నష్టపోగా మిగతాది పప్పు దినుసులు పంటలు కూరగాయ పంటలు నష్టపోయినట్లు అధికారులు సర్వే నిర్వహించారు.వాన కాలంలో పంటలు సాగు చేసుకునేందుకు దుక్కులు దునడాన్ని మొదలుకొని విత్తనాలు వేయడం కలుపు



తీయడం ఎరువులు వేయడం కూలీల ఖర్చులు పిచికారి మందులతో ఎకరానికి 10,000 వరకు ఖర్చు వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే అధిక వర్షాలు ఆపై వరదలు పంటలను నీటిలో ముంచడంతో పంట పొలాల్లో నీరు నిలిచిపోవడం వల్ల కూలిపోయి పంట చేతికి వచ్చే అవకాశాలు లేదని ఆయా గ్రామాల రైతులు కన్నీటి పర్యవంతమవుతున్నారు.మరో నెలరోజులు కడితే పంటలు చేతికొచ్చి దశలో తాము పంట కోల్పోలువలసి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యవసాయ పంట భూములు కోతలు ఏర్పడి ఇసుక మేటలు కూడా వేయడంతో వాటిని తొలగించాలంటే వేలాది రూపాయల ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం సర్వే చేసి పంట నష్టం వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన పరిహారంపై ఇంకా స్పష్టత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారుఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటేనే మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో భారీ వర్షాలు వరదల వల్ల నష్టపోయిన పంటలను జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి వేడుమ బుజ్జి పటేల్ రామారావు పటేల్ క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు జరిగిన నష్టం పై విచారం వ్యక్తం చేశారు.ప్రభుత్వం పరిహారాన్ని ఎకరానికి 25 వేలు చెల్లించాలని బిజెపి ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుండగా అధికార పార్టీ మంత్రి మాత్రం ప్రభుత్వం ఆదుకుంటుంది అని చెప్పారు తప్ప ఎకరానికి ఇంత డబ్బులు ఇస్తామని ఎక్కడ స్పష్టం చేయకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకునేలా నష్టపరిహారాన్ని ప్రకటించి రెండు పంట పెట్టుబడికి బ్యాంకు రుణాలు అందించాలని జిల్లా రైతులు కోరుతున్నారు

# అవసరాల మేరకు అభివృద్ధి పనులు

సికింద్రాబాద్ సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):

ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మోండా డివిజన్ లో పర్యటించి కోటి 34 లక్షల రూపాయల వ్యయంతో మూడు చోట్ల చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ముందుగా బండిమెట్ లో 39.60 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు, జైన్ టెంపుల్ సమీపంలో 49.50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు, రాజేశ్వరి థియేటర్ వెనుక 45 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శంఖుస్థాపన చేశారు. ముందుగా స్థానికంగా ఉన్న పలువురు వ్యాపారులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కు శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలువురు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా విద్యుత్ స్తంభాలపై కుప్పలుగా ఉన్న కేబుల్ వైర్లు, క్రిందకు వేలాడుతున్న వైర్లతో ప్రమాదం పొంచి ఉన్నదని ఎమ్మెల్యే కు విన్నవించారు. స్పందించిన ఆయన వెంటనే కేబుల్స్ తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గతంలో ఈ ప్రాంతంలో పర్యటించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రధానంగా మోండా డివిజన్ లోని బండి మెట్ ప్రాంతంలో డ్రైనేజీ, రోడ్లు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించడం జరిగిందని చెప్పారు.



వారి సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్ లైన్ లను నిర్మించడం జరిగిందని, నేడు నూతన రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో కోట్ల రూపాయల వ్యయంతో రోడ్ల నిర్మాణం, అభివృద్ధి, డ్రైనేజీ సమస్యల ను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాల నుండి పరిష్కారానికి నోచుకోని అనేక దీర్ఘకాలిక సమస్యలను బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో పరిష్కారం చూపినట్లు వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ఈ సిసి రోడ్ల నిర్మాణం పూర్తయితే 30 సంవత్సరాల వరకు లైఫ్ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆఆ డాకు నాయక్, కార్పొరేటర్ దీపికా, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, ఆఇ మహేష్, వాటర్ వర్క్స్ ఆఉఓ ఆశిష్, శానిటేషన్ ఆఇ వెంకటేష్, ఎలెక్ట్రికల్ ఀఇ వరలక్ష్మి, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, రాములు, ఓదెల సత్యనారాయణ, జయరాజ్, మహేష్ యాదవ్, మహేందర్, హన్మంతరావు తదితరులు ఉన్నారు

## చోరికి పాల్పడిన నిందితురాలు అరెస్టు

కాకినాడ సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):

ఇంట్లోనే పనిమనిషిగా పనిచేస్తూ ఆ ఇంటిలోనే చోరీకి పాల్పడిన నిందితురాలను కాకినాడ వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు..స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఐ నాగ దుర్గారావు కేసు వివరాలను వివరించారు.. కాకినాడ బాలాజీ సెంటర్ సమీపంలోని కొమ్మిరెడ్డి వారి వీధిలో 60 ఏళ్ల బత్తుల కనకదుర్గ ఆమె కుమార్తె ప్రశాంతి నివాసం ఉంటున్నారు ఈనెల రెండవ తేదీన 183 గ్రాముల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయల నగదు అపహరణకు గురైనట్లు ఇంటి యజమాని పోలీసులుకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాలుగా గుర్తించామని తెలిపారు...

=====================

## చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలకు పాలభిషేకం

విశాఖపట్నం సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):

సూపర్ సిక్స్ అమలు చేసి ఉచిత బస్సు ఇచ్చిన నారా చంద్రబాబు నాయుడు లోకేష్ లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ విశాఖ లో వారి చిత్రపటాలకు ఏపీ నిరు ద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత కుమార్ పాలాభి షేకం నిర్వహించి పెద్ద ఎత్తున యువ తతో ర్యాలీ చేశారు, జగన్ చంద్ర బాబును బావిలో దూకమనడం ను ఖండిస్తూ జగన్ క్షమాపణ చెప్పా లని కోరారు. లేనిపక్షంలో జగన్ నిరుద్యోగులను మోసం చేసినం దుకు, ఒక్కడీఎస్సీ ,పోలీస్ శాఖ గ్రంథాలయ శాఖ ఉద్యోగం కూడా నింప లేనందుకు బే ఆఫ్ బెంగాల్లో దూకాలని హేమంత్ అన్నారు.

========================

## 27ఛలో గాంధీ భవన్‌కి పిలుపునిచ్చిన మున్నరుకాపు నేతలు


హైదరాబాద్ సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):

ఛలో గాంధీ భవన్ కి పిలుపునిచ్చిన మున్నరుకాపు నేతలు, గాంధీ భవన్ ముట్టడికి ప్రయత్నించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మున్నూరు కాపు నేతకే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేసారు. మున్నూరుకాపు నేతకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని డిమాండ్ చేసారు. రెండు వేల కోట్లతో మున్నూరుకాపు కార్పొరేషన్ విధివిధానాలు ప్రకటించాలని డిమాండ్ చేసారు. అందోలనకారులను పోలీసులు అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు.

========================

## కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కు మంత్రుల స్వాగతం

తిరుపతి సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):



మూడు రోజుల తిరుమల. తిరుపతి పర్యటన నిమిత్తం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి వర్యులు శ్రీమతి నిర్మలా సీతా రామన్ రేణిగుంట విమానా శ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు అసెంబ్లీ వ్యవ హారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, టి. టి.డి బోర్డు మెంబెర్ భానుప్రకాష్, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట రెవిన్యూ డివిజనల్ అధికారులు భానుప్రకాశ్ రెడ్డి, కిరణ్మయి, డి ఎస్ పి తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

========================

## ఆర్య వైశ్య మహిళా సంఘం జిల్లా కోశాధికారిగా రావికంటి రేణుక
### -హర్షం వ్యక్తం చేసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

మంథని సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):

పెద్దపెల్లి జిల్లా ఆర్య వైశ్య మహిళా సంఘం కోశాధికారిగా మంథని పట్టణానికి చెందిన రావికంటి రేణుక నియామకమయ్యారు.ఈ మేరకు పెద్దపల్లి జిల్లా ఆర్య వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి అల్లంకి లింగమూర్తి నియామకపు ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు. గతంలో రేణుక సంఘానికి చేసిన సేవలను గుర్తించి వారి అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పెద్దపెల్లి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నల్మాసు ప్రభాకర్ అనుమతితో జిల్లా మహిళా సంఘానికి సేవలందించడం కొరకు జిల్లా కోశాధికారిగానియమించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రావికంటి రేణుక మాట్లాడుతూ తన సేవలను గుర్తించి జిల్లా కోశాధికారిగా నియమించిన ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నల్మాసు ప్రభాకర్ కు, నా నియామకానికి సహకరించిన ఆర్యవైశ్య సంఘం మంథని పట్టణ గౌరవాధ్యక్షుడు ఓల్లాల సత్యనారాయణ, నాయకుడు కొమురవెల్లి విజయ్ కుమార్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఎల్లంకి వంశీ, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఓల్లాల నాగరాజు, పట్టణ ఉపాధ్యక్షుడు రాచర్ల నాగరాజు, మంథని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు రాచర్ల తిరుమల లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య మహిళ సంఘం అభివృద్ధికి తన శక్తి



వంచన లేకుండా కృషి చేస్తానని రేణుక పేర్కొన్నారు.జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం కోశాధికారిగా రావికంటి రేణుక ఎన్నికవ్వడం పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకురాల్లు హర్షం వ్యక్తం చేశారు.

## రోడ్డు విస్తరణకు భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం
### -బైపాస్ రోడ్డును మళ్లించాలని మంత్రి శ్రీధర్ బాబుకు వినతి

మంథని సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):

మంథని గోదావరి నది తీరం నుండి నిర్మించ తలపెట్టిన పెద్దపల్లి జిల్లా మంచిర్యాల జిల్లాల అనుసంధానం చేసే వంతెన నిర్మాణ బైపాస్ రోడ్డును నూతనంగా వేరే చోట నుండి మళ్లిస్తున్నారని అలా కాకుండా ప్రస్తుతం ఉన్న రోడ్డు ద్వారానే బైపాస్ రోడ్డు మళ్లించాలని కోరుతూ రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ మంథని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేశారు.

కొత్తగా నిర్మిణ తలపెట్టిన రోడ్డు ద్వారా ప్రజలకు రైతులకు రహదారి దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని అలా కాకుండా గోదావరి గౌతమేశ్వర ఆలయం పక్క నుండి దారి మళ్లించి ప్రస్తుతం ఉన్న రోడ్డు మార్గాన లింకు కలిపి మంథని బస్ డిపో వరకు తీసుకువస్తే ఇటు పట్టణానికి, మెయిన్ రోడ్డు కు దగ్గర అవుతుందని ప్రజలకు వ్యాపారాస్తులకు శివ్వారం, పౌనూరు గ్రామాల నుండి వచ్చే ప్రజలకు, మంథని వ్యాపార సముదాయంతో పాటు ఆసుపత్రులు ప్రతి ఒక్కటి అందుబాటులోకి వస్తాయని వారు వినతిపత్రం లో పేర్కొన్నారు.

## భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఓ అధికారి వింత నిర్వాకం

- పదోన్నతి కోసం కమిషనర్ ఆఫీస్ ఉద్యోగికి లంచం చూపిన భద్రాచలం
- ఆలయ ఏఈఓ భవాని రామకృష్ణ
- కమిషనర్ ఆఫీస్ ఉద్యోగికి పదోన్నతి కోసం 20 వేలు నగదు బదిలీ చేసిన ఏఈఓ భవాని రామకృష్ణ
- ఫోన్ పే ద్వారా పంపిన ఆ డబ్బును వెనక్కి పంపిన కమిషన్ ఆఫీస్ ఉద్యోగి
- నగదు పొందిన ఉద్యోగి కమిషనరేట్ లో ఫిర్యాదు చేయడంతో సీన్ రివర్స్
- ఏఈఓ భవాని రామకృష్ణ మీద ఎంక్వయిరీకి ఆదేశించిన కమిషనర్
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

.భద్రాద్రి సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):

కొత్తగూడెం జిల్లా భద్రాచలం దేవస్థానంలో ఓ అధికారి తన ప్రమోషన్ కోసం ఆ శాఖలోని ఉన్నతాధికారికి ఫోన్ పే ద్వారా లంచం ఇవ్వగా ఆ అధికారి తన నిజాయితీ ప్రదర్శిస్తూ లంచానికి ఆశపడకుండా వృత్తి ధర్మాన్ని నిలబెట్టుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి పలువురికి ఆదర్శంగా నిలిచాడు పై అధికారి.వాయిస్..1.భద్రాచలం శ్రీ సీతారామన్న చంద్ర స్వామి వారి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఒక అధికారి పదోన్నతి కోసం ముడుపులు ఆశ చూపిన అంశం వెలుగులోకి వచ్చింది..

అయితే దేవాదాయ శాఖ కమిషన్ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న ఆ అధికారి ముడుపులు స్వీకరించకుండా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం విశేషం. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ విచారణ ముందుకు సాగలేదు తోటి ఉద్యోగిని ప్రలోభాలకు గురిచేయాలని ప్రయత్నించిన సదరు అవినీతి ఉద్యోగిపై చర్యలు చేపట్టలేదు. వాయిస్..2.దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఏఈఓ భవాని రామకృష్ణ పదోన్నతి కోసం అడ్డదారి తొక్కలని ప్రయత్నించాడు అంధుకు కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగికి లంచం ఆశ చూపించాడు..


కొంత మొత్తాన్ని సైతం ఫోన్పే ద్వారా చెల్లించడం జరిగింది. అయితే కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారి ఆ లంచాన్ని తిరస్కరించి తిరిగి వెనక్కి పంపి ఏఈఓ భవాని రామకృష్ణపై వెంటనే దేవాదాయ శాఖ కమిషనర్ ఫిర్యాదు చేశారు. దీంతో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వెంటనే విచారణ జరిపి సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.కానీ ఆ ఆదేశాలను అమలు చేయకుండా మూడు నెలల క్రితం జరిగిన ఈ ఘటనపై అప్పటి భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్న అధికారి ఎటువంటి విచారణ జరిపించలేదు.

వాయిస్..3.ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై ప్రస్తుతం దేవస్థానం ఈవో గా విధులు నిర్వహిస్తున్న దామోదర్ రావు విచారణ నిర్వహించి తప్పు చేసినట్లుగా రుజువైతే శాఖ పరమైన చర్యలు చేపడతామని ఈవో దామోదర్ రావు తెలిపారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### - కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్

హుజురాబాద్, సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):


లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వరద ఉధృతి పెరిగే అవకాశాలుంటే సహాయ కేంద్రాలను సంప్రదించాలని ఒడితల ప్రణవ్ అన్నారు. గురువారం వరకు కురిసిన వర్షానికి వరద నీటిలో మునిగిన లోతట్టు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుజూరాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో వరద చుట్టుముట్టిందని,దానికి తగ్గట్టుగా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. త్వరలోనే హుజూరాబాద్ నాలాలను కబ్జా అరికట్టి, వరద ప్రభావిత ప్రాంతాల్లో మురికి కాలువలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వరదల్లో చిక్కుకొని నష్టపోయిన హుజూరాబాద్ పట్టణ ప్రజలను



ఆదుకునేందుకు ప్రభుత్వం తరఫున కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలోని పలు కాలనీలో వరద ముంచెత్తుతున్న విషయాన్ని తెలుసుకున్న అనంతరం అధికార యంత్రాంగాన్ని వరద బాధితులను కాపాడేందుకు సిద్ధం చేసినట్లు అని తెలిపారు.

## చేతులెత్తేసిన జూపల్లి!

మహబూబ్ నగర్ సెప్టెంబర్ 12 ,(భారతశక్తి):




వచ్చేసారి మా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందో..? లేదో..? తెలియదు.. నేను మళ్లీ గెలుస్తానో..? లేదో తెలియదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇందిరమ్మ నమూనా గృహం ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి సంచలన వ్యాఖ్యలు చేసారు. నేను హామీలు ఇవ్వను.. ఎందుకంటే వచ్చేసారి మా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందో లేదో తెలియదు.. అందుకే నేను హామీలు ఇవ్వను. నా వంతుగా ప్రయత్నం మాత్రం చేస్తా.. నా నియోజకవర్గంలోనూ హామీలు ఇవ్వను.. ప్రజలకు ఏం పనులు కావాలో అవి చేస్తా నని అన్నారు

# అతి త్వరలోనే నూతన డ్రైన్స్ పనులు ప్రారంభం : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, సెప్టెంబర్ 12 (భారత శక్తి):హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీలో నిన్న సాయంత్రం పడిన వర్షానికి వరద నీటితో నిండిపోయిన కాలనీలలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ, పక్కనే ఉన్న స్మశానవాటికలో వర్షపునీరు నిండిపోయి వరదనీరు బంజారాకాలనీలోని కొన్ని రోడ్లను ముంచెత్తిందని అన్నారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో పడ్డ భారీ వర్షాలకు గాను ఇక్కడ ఒక డ్రైన్ కట్టడం జరిగింది. దానివల్ల దాదాపు 15 కాలనీవాసులకు వరదనీటి సమస్యల నుంచి పూర్తిస్థాయిలో విముక్తి లభించిందని అన్నారు. ప్రస్తుతానికి వరదనీటి సమస్యల కోసం నూతన డ్రైన్స్ మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతానికి తాత్కాలిక సమస్యల్లో భాగంగా కొంత మేర గోడ కూలగొట్టి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తామని అన్నారు. ఎక్కడ గోడ తొలగించాలో కాలనీవాసులు నిర్ణయం తీసుకున్న తర్వాత గోడ కూలగొట్టి వరదనీరు డ్రైన్స్ లోకి వెళుతుందని అన్నారు.అతి త్వరలోనే నూతన డ్రైన్స్ నిర్మాణ పనులు ప్రారంభం చేస్తామని,ఈ పనులు సకాలంలో పూర్తి అయితే పద్మావతి కాలనీ,హయత్ నగర్ బస్ డిపో, కోర్టు పరిసర ప్రాంతం,హయత్ నగర్ ప్రధాన రహదారిపై వర్షపునీరు నిల్వకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నగొని శ్రీధర్ గౌడ్, భాస్కర్ సాగర్, అధికారులు హేము నాయక్,సురేష్, నాయకులు రాకేశ్, లక్ష్మణ్, ఇంద్రకరణ్ రెడ్డి, మధు ముదిరాజ్, మనోజ్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చిలుక మధుర ఉపేందర్ రెడ్డి దంపతులను అభినందించిన కాంగ్రెస్ అగ్రనేతలు



ఎల్బీనగర్, సెప్టెంబర్ 12 (భారత శక్తి):మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని మార్గదర్శి కాలనీ కమ్యూనిటీ హాల్, టెలిఫోన్ కాలనీ పార్కులో వాకర్స్, సీనియర్ సిటిజన్స్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి దంపతులు తమ స్వంత నిధులతో కట్టించిన వాష్ రూమ్స్ ను ప్రారంభించిన మాజీ శాసనసభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యులు కిచెన్న గారి లక్ష్మా రెడ్డి టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి. ఈ సందర్భంగా వారిద్దరు మధుర ఉపేందర్ రెడ్డిలను అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించే వాడు నాయకుడు అవుతాడు. సేవకుడే నాయకుడు అవుతాడు రాబోయే రోజులలో మరింత విస్తృతస్థాయిలో సేవ చేయడానికి ఉపేందర్ రెడ్డికి అవకాశం ఇయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, నల్లెంకి ధనరాజ్ గౌడ్, శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం ఛైర్మన్ కుంచారపు సురేంద్ర కుమార్, కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు ఎలిమినేటి సంజీవరెడ్డి, టీ. రమణయ్య, జి. వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు యస్. రాములు గౌడ్, మధుసూదన్, యస్. శివలింగం గౌడ్, రామ్మూర్తి, వరాల పుష్పలత మోహన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బి. మధుసూదన్, వాసు, యస్. సాంబశివరావు, పున్న కృష్ణయ్య, ఏ. బాలరాజ్, మోహన్ రెడ్డి, మొగిల్వగొని వెంకటేష్ యాదవ్, పాము యాదగిరి, సుధాకర్ రెడ్డి, నవనీత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపూర సైదులు, యాదవ రెడ్డి, ముప్పిడి లింగా స్వామి గౌడ్, దుబ్బాక శేఖర్, అక్బర్, డక్కియార్ నాయక్, కళ్యాణ్, సురేందర్ రెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, షేక్ నాథి, శ్రీశైలం, శ్రీధర్, పటేల్, మామిడి రామకృష్ణ గౌడ్, పాషా, శ్రవణ్, షఫీ, పగడాల ఎల్లన్న, అశోక్, సమ్మద్, రాజు, బొడ్డుపల్లి నాగేష్, రఘు, టైలర్ శివ, జిల్లా జగన్నాథం, శ్యామ్ సుందర్ గౌడ్, రేణుక, కవిత, సంతోష, లక్ష్మీ సీనియర్ సిటిజన్స్ మహిళా సంఘాల నాయకులు కాలనీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని ప్లాట్లకు మున్సిపల్ సేవలు ఉండవు: మున్సిపల్ కమిషనర్



ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12 (భారత శక్తి): ములుగు మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేని ప్లాట్లకు మున్సిపల్ సేవలు ఉండవని కమిషనర్ జనగాం సంపత్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికారికంగా లేఔట్లు వేసి ప్రజలకు ప్లాట్లు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని,ఇలాంటి అనధికారిక లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి భవన అనుమతులు, నీరు, డ్రైనేజీ, విద్యుత్ ఇతర మున్సిపల్ సేవలు ఉండవని ఆయన పేర్కొన్నారు. ప్రజలుమోసపోకుండా ఎవరైనా ప్లాటు కొనుగోలు చేయడానికి ముందు తప్పనిసరిగా మున్సిపల్ కార్యాలయంలో లేఔట్ కు అప్రూవల్ ఉన్నదో లేదో చూసుకొని కొనుగోలు చేయాలని తెలిపారు. అక్రమంగా లేఔట్లు తీసి విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు.

## ఈనెల 15 నుంచి తెలంగాణలో వృత్తి విద్యా కళాశాలల నిరవధిక బంద్




హైదరాబాద్: ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయకపోతే ఈనెల 15 నుంచి కళాశాలలను నిరవధికంగా బంద్ చేయనున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని కలిసిన సమాఖ్య సభ్యులు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు బంద్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మొత్తంగుండం విశ్వేశ్వరయ్య జయంతి రోజును ఇంజినీర్స్ డేగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆ రోజును బ్లాక్ డేగా ప్రకటిస్తూ ఇంజినీరింగ్, ఫార్మా, నర్సింగ్, ఎంబీఏ, ఎంసీఏ సహా వృత్తి విద్యా కళాశాలలు బంద్ నిర్వహిస్తాయని తెలిపారు. డిగ్రీ, పీజీ కాలేజీలు 16వ తేదీ బంద్ చేపట్టనున్నట్లు ప్రకటించాయి. రూ.10వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, వాటిలో ఇప్పటికే టోకెన్లు విడుదల చేసిన రూ.1200కోట్లు అయినా ఈనెల 30వ తేదీ నాటికి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలు బంద్ కొనసాగిస్తే దాదాపు పది లక్షల మంది విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో ఉన్నత విద్యా మండలి, ప్రభుత్వం తక్షణం బకాయిలు విడుదల చేయాలని కళాశాల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి.

## మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుంటే పోరాటాలు నిర్వహిస్తాం

తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఏసురత్నం డిమాండ్



ఎల్బీనగర్, సెప్టెంబర్ 12 (భారత శక్తి):రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ జోన్ పరిధిలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ఏసురత్నం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా కే యేసురత్నం మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, చేసేంతవరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 30 వేల రూపాయల జీతం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వచ్చేనెల రెండో తారీఖున దసరా పండగ ఉన్నందున రాష్ట్ర మున్సిపల్ కార్మికులందరికీ ఈనెల 26వ తారీకు వరకు కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని కోరారు. పండుగ సెలవులు సీఎల్ లు అమలు చేయాలని అన్నారు. కార్మికులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు.మరణించిన కార్మికుల వారి కుటుంబాలకి దహన సంస్కారాల ఖర్చులు 30 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ కనీస వేతనాలు పెంచకుంటే దసరా పండగ తర్వాత పెద్ద ఎత్తున పోరాటాలు ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి వి.పాపనాథరావు, రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ఉపాధ్యక్షులు ఎం మద్దిలేటి, కార్మికులు లక్ష్మి, అండాలు, పద్మ, దయాకర్, శ్రీరాములు,హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ లో అందుబాటులోకి అత్యాధునిక క్యాన్సర్ సంబంధిత వైద్య సేవలు

ఒకే చోట నిపుణులైన వైద్య బృందం,
అత్యాధునిక వైద్య సదుపాయాలు
150 పడకల ఆసుపత్రి
ముఖ్య అతిథిగా పాల్గొన్న పశ్చిమ వరంగల్,
శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి



ఉమ్మడి వరంగల్ బ్యూరో,(భారత శక్తి)సెప్టెంబర్12:ఉమ్మడి వరంగల్ ప్రజలకు క్యాన్సర్ సంబంధిత అత్యుత్తమ వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. రెనోవా బన్ను హాస్పిటల్స్ ను రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ప్రారంభించింది. ములుగు 'ఎక్స్' రోడ్, హన్మకొండ, లో ఈ కొత్త హాస్పిటల్ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి వారితో పాటు గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, డాక్టర్ గోదా, తదితర ప్రజాప్రతినిధులు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ పెద్దిరెడ్డి, ఫౌండర్ & సీఈఓ, రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వారితో పాటు డాక్టర్ వీరమల్ల చరణ్ జిత్ రెడ్డి, ఫౌండర్ & ఛైర్మన్, బన్ను ఆరోగ్యదా సేవ సొసైటీ, డా. రాజేష్ బొల్లం, మెడికల్ & హెమటో ఆంకాలజిస్ట్, డైరెక్టర్, రెనోవా బన్ను హాస్పిటల్స్, వరంగల్, ఇతర వైద్య నిపుణులు, సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన నాయిని రాజేందర్ రెడ్డి క్యాన్సర్ వ్యాధి వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, రెనోవా బన్ను హాస్పిటల్స్ ద్వారా తెలంగాణ లో రెండవ పెద్ద నగరమైన వరంగల్ ప్రాంతంలో సామాన్యులకు అత్యాధునిక, సమగ్రమైన క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి రావడం, హన్మకొండ నియోజక వర్గ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినందుకు రెనోవా బన్ను హాస్పిటల్స్ యాజమాన్యానికి అభినందనీ యమన్నారు. క్యాన్సర్ చికిత్సలో ఎంతో అనుభవం గడించిన వైద్యులు, యాజమాన్య సభ్యులు కలసి కొత్తగా ప్రారంభించిన రెనోవా బన్ను హాస్పిటల్స్ రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందించడంలో ముందజలో ఉంటుందని ప్రేమతో, ఆప్యాయతతో, లాభాపేక్ష ఎక్కువగా లేకుండా, సరైన నైతికతో నిర్వహిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి రొమ్ము క్యాన్సర్ పైన అవగాహనా కల్పించటం కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని అంతేకాకుండా ఆరోగ్య శ్రీ సేవల ద్వారా వరంగల్ పేద ప్రజలకి మెరుగైన వైద్య సేవలను అందించాలని రెనోవా యాజమాన్యాన్ని తెలిపారు. అనంతరం రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఫౌండర్ & సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ లో రెండవ పెద్ద నగరమైన వరంగల్ ప్రాంతంలో మొట్ట మొదటి సమగ్రమైన క్యాన్సర్ హాస్పిటల్ గా రెనోవా బన్ను హాస్పిటల్స్ నిలుస్తుందని తెలిపారు. కేవలం వరంగల్ నగర వాసులకే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల వారికి కూడా ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. గతంలో నాణ్యమైన క్యాన్సర్ చికిత్సకు హైదరాబాద్ కు వెళ్ళల్సి వచ్చేదని అయితే ప్రస్తుతం వారి ముంగిట్లో నే ప్రపంచ స్థాయి చికిత్స సిద్ధంగా ఉన్నాదని ఆయన తెలిపారు. అంతే కాకుండా క్యాన్సర్ చికిత్సల్లో అత్యాధునిక సదుపాయాలైన హాలోయెన్ ఇమేజ్ గైడెడ్ రేడియేషన్ మెషిన్ పెట్ సిటీ స్కాన్ వంటి అంతర్జాతీయ స్థాయి చికిత్సా సదుపాయాలు వరంగల్ ప్రజలకు కూడా అందుబాటులోకి వచ్చాయని, వాటితో పాటు అత్యాధునిక లాబొరేటరీ మరియు రేడియాలజీ ఇమేజింగ్ విభాగాలు కలిగి సమగ్రమైన క్యాన్సర్ చికిత్సను అందించడానికి వీలుగా ఒకే చోట సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగాలు ఉంటాయని తెలిపారు. అంతేకాక త్వరలో ఢిల్లీ, అలహాబాద్, ప్రయాగరాజ్ మరియు భువనేశ్వర్ లలో కూడా రెనోవా గ్రూప్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. భారతదేశం అంతటా అన్ని రాష్ట్రాల్లోని ప్రముఖ నగరాల్లో రెనోవా సేవలు విస్తరించనున్నట్లు గా ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డా.అలేటి రవీందర్ రెడ్డి, చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రెనోవా బన్ను హాస్పిటల్స్, వరంగల్, డా.వినోద్ కుమార్ దున్నా, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రెనోవా బన్ను హాస్పిటల్స్, డా.వై. విష్ణు వర్ధన్ రెడ్డి, చీఫ్ రేడియేషన్ ఆంకాలజిస్ట్, రెనోవా బన్ను హాస్పిటల్స్, వరంగల్, డా.ఎ.నిఖిల్ కుమార్, సీనియర్ రేడియేషన్ ఆంకాలజిస్ట్, రెనోవా బన్ను హాస్పిటల్స్, వరంగల్, డా.కె. శివ కుమార్,హెమటో ఆంకాలజిస్ట్, రెనోవా బన్ను హాస్పిటల్స్, వరంగల్, డా. తరుణ్ రెడ్డి బాజాల, సర్జికల్ ఆంకాలజిస్ట్, రెనోవా బన్ను హాస్పిటల్స్, వరంగల్, డా. కిరణ్ బాల్రా, కన్సల్టెంట్ రేడియాలజిస్ట్, రెనోవా బన్ను హాస్పిటల్స్, వరంగల్, డా.ఇండీవర్ కిరణ్, మెడికల్ డైరెక్టర్, రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, జనార్దన్, రెనోవా గ్రూప్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, రవీంద్రనాథ్ గరగ, సి.ఓ.ఓ రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, డా.జి. ప్రియాంక, సెంటర్ హెడ్, రెనోవా బన్ను హాస్పిటల్స్, వరంగల్, తో పాటు పలువురు వైద్యులు, ఇతరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని మర్యాదపూర్వకంగా కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్



కామారెడ్డి జిల్లా,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 12: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్. ఈ సందర్భంగా పార్టీ బలపరచడం, నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర పరిస్థితులపై చర్చించారు.


## పిడబ్ల్యూడి రోడ్డు నుండి మంథని దేవుని పల్లి రోడ్డును పరిశీలించిన మంత్రి సీతక్క





కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 12: కామారెడ్డి జిల్లాలో క్రిందటి నెలలో కురిసినటువంటి భారీ వర్షాలకు గాను రోడ్లకు భారీ నష్టం జరిగినందున రోడ్ల పునరుద్ధరణలో భాగంగా శుక్రవారం జరిగినటువంటి తనిఖీలో పాల్వంచ మండలం లోని పిడబ్ల్యూడి రోడ్డు నుండి మంథని దేవునిపల్లి వరకు గల రోడ్డును పరిశీలించిన పిఆర్ మంత్రి సీతక్క, గవర్నమెంట్ అడ్వైజర్ షబ్బీర్ అలీ, సి ఈ పి ఆర్ సమత. ఇందులో భాగంగా పి ఆర్ ఈ ఈ దుర్గాప్రసాద్, డిప్యూటీ ఈ ఈ స్వామి దాసు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వెంగళరావు నగర్లో... ఉపయోగం లేని వాటర్ ట్యాంక్ కూల్చివేసి



హైడ్రా:హైదరాబాద్, సెప్టెంబర్ 12: భారత శక్తివెంగళరావు నగర్ లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకర్ ను హైడ్రా శుక్రవారం తొలగించింది. వెంగళరావు నగర్ డి బ్లైట్ కాలనీలో 1974లో దీనిని నిర్మించారు. యిలా దశాబ్దాలపాటు వెంగళరావు నగర్ కాలనీ ప్రజలకు తగు నీరందించింది. అయితే మూడు దశాబ్దాలుగా వినియోగంలో లేదు. కూలడానికి సిద్ధంగా ఉంది. ఎప్పుడు ఎవరి ప్రాణాలకు ముప్పో అనేట్టు ప్రమాదకరంగా మారింది. దీనిని భద్రంగా తొలగించమని పలుమార్లు సంబంధిత అధికారులకు కాలనీ వాసులు ఫిర్యాదు చేసారు. చివరికి హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో శుక్రవారం జాగ్రత్తగా కూల్చివేసింది. ఎలాంటి ప్రమాదానికి ఆస్కారం లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంది. గురువారమే దగ్గరలో ఉన్న నివాసితులను అప్రమత్తం చేసి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా కూల్చివేసింది. ఈ 200ల గజాల స్థలాన్ని ప్రజావసరాల కు వినియోగించే విధంగా చూస్తామని స్థానికులు తెలిపారు.

## సెప్టెంబర్ 15 ఇంజనీర్స్ డే జరపొలి

ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి
ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానం బేస్



హైదరాబాద్ :భారతశక్తి రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థలు ప్రధానంగా ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలు రోజు రోజుకి పెరిగి పోతున్నాయి. అట్టి సమస్యలను పక్కకు పెట్టి అధ్యాపకులపై మానసిక వత్తిడి పెంచారు. రాష్ట్రంలోని ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని యాజమాన్యాల సంఘం పతి తీసుకున్న నిర్ణయం కి తెలంగాణ స్కూల్స్ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంఘీ బావం తెలుపుతున్నాది. కాని ఇంజనీర్స్ డే ను బ్లాక్ డే గా ప్రకటించడాని వ్యతిరేకిస్తున్నది. అధ్యాపకులందరూ ఇంజనీర్స్ డే ను గ్రాండ్ గా సెలబ్రేట్ చేయాలని తెలంగాణ స్కూల్స్ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు అయినేని సంతోష్ కుమార్ స్పష్టం చేసారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రీయంబర్స్మెంట్ కు బ్లాక్ డే కు ఎలాంటి సంబంధం లేదని వారన్నారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థలలో ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉండదని వారన్నారు. యజమాన్యాలు వేతన సంఘం జీతాలు చెల్లిస్తున్నామని చెబుతూ తాత్కాలిక జీతాలు చెల్లించి కాలం వెలదీస్తూ వస్తున్నారు. దీనిపై దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిటీ వేసి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.మా శ్రేయోభిలాషి అయినేని సంతోష్ కుమార్ వాఖ్యం రాష్ట్ర అధ్యక్షులు

# ఆర్ ఆర్ ఆర్ లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయండి -ఎమ్మెల్యేచింతా ప్రభాకర్



సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 12:
త్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను కోరారు.శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ప్రావిణ్యకు కొండాపూర్ రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు.కొండాపూర్ మండలంలోని గిర్మాపూర్, అలియాబాద్, మారేపల్లి, మాచేపల్లి, గంగారం శివన్న గూడెం, రాంపూర్ తండా గ్రామ పరిధిలో నీరు పెద రైతులు కోల్పోతున్న భూములపై జీవనంకొనసాగిస్తున్నారు.పట్టా భూములు ఆర్.ఆర్.ఆర్ రోడ్డు మరమ్మతులో కోల్పోకుండా నిరు పెద రైతులను కాపాడాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తెలిపారు.

ఆర్ఆర్ఆర్ లో పట్టా భూములు కోల్పోవడం తో మండలంలోని నీరు పెద రైతులు రోడ్డున పడతారని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కలెక్టర్ కు వివరించారు.రైతుల మంచి కోరే ప్రభుత్వం, రైతులను రోడ్డునా పడేసి ఆర్ ఆర్ ఆర్ ఏర్పాటు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులను సంతృప్తి చేసే విదంగా ఆర్ ఆర్ ఆర్ విధానాలు ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.


ఈ కార్యక్రమంలో మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాణిక్ ప్రభు ,రుక్మోదిన్, గోవర్ధన్ రెడ్డి, వినోద్, రాజు, ఆంజనేయులు, ప్రేమ నందం, సత్య నందం ప్రకాష్, అంజి రెడ్డి, జయేందర్ , నర్సింలు, మహేష్, పరమేశ్వర తదితరులు ఉన్నారు.

# గుమ్మడిదల బీజేవైఎం మండల అధ్యక్షుడిగా అనిల్ రెడ్డి



గుమ్మడిదల (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 12 :
సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బీజేవైఎం మండల అధ్యక్షుడిగా అమ్మగారి అనిల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పార్టీ అధ్యక్షులు కావలి ఐలేష్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, యువతను సంఘటితం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో ఇసుకమేటల తొలగింపు పనుల ప్రారంభం



కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 12:
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 04.09.2025 నాడు లింగంపేట్ మండలంలోని బురిగిద్ద తాండలో తీవ్ర వర్షాల కారణంగా పంట పొలాల్లో వచ్చిన ఇసుకమేటల వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించడం జరిగింది. దీనికి సంబంధించి ప్రభుత్వ ఆదేశానుసారం లింగంపేట్ మండలంలోని బురిగిద్ద తండాలో ఇసుకమేటలకు గురైన ముగ్గురు రైతులు సబవత్ రవీందర్, దేగవతలక్ష్మి, కోడూరి ఆంటోనీ ల పంట పొలాలలో చేరిన ఇసుకమేటలను ఉపాధి హామీ పథకంలో భూమి అభివృద్ధి పనుల క్రింద ఆ యొక్క ఇసుకమేటలను తొలగింపు కార్యక్రమము ప్రారంభించడం జరిగింది. ఇట్టి పనులను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. సురేందర్ సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లింగంపేట్ ఎంపీడీవో నరేష్, ఏపీవో నరేందర్, ఈసీ రాజ, ఎఫ్ఎ తదితరులు హాజరు కావడం జరిగింది.

# మూడేళ్లుగా నిలిచిపోయిన కలవట్టు

పోరుమామిళ్ల, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 12 : పోరుమామిళ్ల మండలం సంచర్ల పంచాయితీ నాగులకుంట్ల బీసీ కాలనీ వద్ద గల కలవట్టు సరైన రీతిలో లేక, పూర్తిగా బురదతో మురికి నీటితో నిండిపోయి ఉంది. దాదాపు మూడు సంవత్సరాలుగా అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా, పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ద్విచక్ర వాహనంపై వెళ్లాలన్నా, వాహనాలతో ధాన్యాలు తరలించాలన్నా, ఆటోలు రావాలన్నా కష్టమే. స్కూల్ పిల్లలు అవతలికి వెళ్లి బస్సు ఎక్కాలన్నా బురదలో మునిగి పోతున్నారు.

ప్రతి రోజు షూలు మట్టి లోనే ఇరుక్కుపోతున్నాయి. వర్షాకాలం కాబట్టి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇంట్లో నుంచి బయటకి రావడమే పెద్ద సవాలుగా మారింది" అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓట్లు అడిగేటప్పుడు ఇచ్చిన హామీలు ఎక్కడ? మా ఇబ్బందులు కనబడవా? మేము మనుషులం కాదా? అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి కలవట్టు పనులు పూర్తి చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇంకా నిర్లక్ష్యం కొనసాగితే ఆందోళన తప్పదని, రోడ్డుపైనే పోరాటం చేస్తాం అని స్పష్టంగా హెచ్చరించారు.

# మరో కేరళను తలపించిన గీతం ఓనం వేడుకలు

**లొట్టలేయించిన ఓనం సద్య**
**– ఆకట్టుకున్న సంప్రదాయాల ఉత్సాహం**
**అలరించిన పోటీలు**



సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి )సెప్టెంబర్ 12:
ప్రస్తుతం మనమెక్కడ ఉన్నాం? కేరళలోనా లేదా హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోనా? అనే సందేహాన్ని లేవనెత్తేలా ఓనం వేడుకలను శుక్రవారం గీతం విద్యార్థులు నిర్వహించారు. మరో కేరళను తలపించేలా సాగిన ఈ వేడుకలను గీతం స్టూడెంట్ లైఫ్ లోని అన్వేషణ విద్యార్థి విభాగం నిర్వహించింది. కేరళ యొక్క గొప్ప సాంస్కృతిక సంప్రదాయాలను గౌరవించడానికి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సమావేశమవడంతో, ప్రాంగణం అంతా పండుగ వాతావరణంతో ఉత్సాహంగా మారింది.గీతం కేఫ్ లో వడ్డించిన సాంప్రదాయ ఓనం సద్య, వివిధ రకాల ప్రామాణికమైన రుచికరమైన వంటకాలతో కూడిన గొప్ప శాఖాహార విందుతో వేడుకలు ప్రారంభమయ్యాయి. గీతం కుటుంబాన్ని ఒకే టేబుల్ పైకి తీసుకువచ్చే ఓనం యొక్క నిజమైన స్ఫూర్తిని %-% కలిసి ఉండటం, కృతజ్ఞత, ఆనందాన్ని %-% ఈ సద్య ప్రతిబింబించింది.విందు తరువాత, కేరళ సంప్రదాయాల ఉత్సాహం, కళాత్మకత, సమగ్రతను ప్రదర్శించే సాంస్కృతిక ప్రదర్శనలు, పండుగ కార్యకలాపాలతో వేడుకలు కొనసాగాయి. వీటికి టగ్ ఆఫ్ వార్, ట్రెజర్ హంట్, పుష్-అప్స్ ఛాలెంజ్, కొబ్బరి కాయలను పట్టుకోవడం, బంగాళాదుంప సంచిలో కాళు పెట్టి గెంతడం , అరటి పళ్లను అధిక సంఖ్యలో తినడం, మ్యూజికల్ చైర్స్, లెమన్-స్పూన్, రీల్ కాంపిటీషన్ వంటి పోటీలు జతకలిసి, విద్యార్థుల ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. కేరళకు చెందిన సాంప్రదాయ పెర్కషన్ బృందం అయిన చెల్లమేళం, దాని శక్తివంతమైన లయలతో గీతం ప్రాంగణంలోని వాతావరణం మరింత ఉత్తేజపూరితంగా మారింది. ఇక శివాజీ ఆడిటోరియంలోని వేదిక నృత్యం, సంగీతం, సమాజ స్ఫూర్తితో కూడిన కార్యక్రమాలతో సజీవంగా మారి, ఆనందం, సమ్మిళితత్వాన్ని ప్రసరింపజేసింది.ఈ కార్యక్రమానికి గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, వివిధ పాఠశాలల డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం, ఈ వేడుక స్ఫూర్తిని మరింత పెంచింది.సాంస్కృతిక వైవిధ్యం, సమ్మిళితత్వం, సమగ్ర విద్యార్థి జీవితం పట్ల గీతం హైదరాబాద్ నిబద్ధతను ప్రతిబింబించే ఇంత శక్తివంతమైన వేడుకను నిర్వహించినందుకు అన్వేషణ బృందం చేసిన కృషిని విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ప్రశంసించారు.ఈ ఓనం వేడుకలు సంప్రదాయాన్ని గౌరవించడమే కాకుండా, వైవిధ్యంలో ఏకత్వాన్ని పెంపొందించాలనే విశ్వవిద్యాయల దృక్పథాన్ని బలోపేతం చేశాయి. ఇందులో పాల్గొన్న వారందరికీ ఆనందం, సంస్కృతి, ఐక్యత యొక్క విలువైన జ్ఞాపకాలను మిగిల్చాయి.

# కాంగ్రెస్ హయాంలో ఆటో డ్రైవర్ల బ్రతుకులు అయోమయం

**– బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**
**– గుమ్మడిదలలో బీఆర్ఎస్ ఆటో యూనియన్ జెండా ఆవిష్కరణ, భారీ ర్యాలీ**



గుమ్మడిదల, ( భారతశక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 12 :
కాంగ్రెస్ హయాంలో ఆటో డ్రైవర్ల పరిస్థితి పూర్తిగా అయోమయంగా మారిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అనుబంధ సంస్థ బిఆర్టియు మల్లికార్జున ఆటో అసోసియేషన్ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. అనంతరం గుమ్మడిదల ప్రధాన వీధుల గుండా ఆటో ర్యాలీ నిర్వహించగా, ఆటో యజమానులు, డ్రైవర్లు భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఆటో డ్రైవర్ల పరిస్థితి పూర్తిగా అయోమయంగా మారిందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో పాటు ఆటో డ్రైవర్లకు నెలకు 12 వేల రూపాయలు జీతం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా, నేటివరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కూలీలు, కార్మికులు, ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, డ్రైవర్లు సంఘటితంగా ముందడుగు వేస్తేనే ప్రభుత్వాలు పట్టించుకుంటాయని ఆయన పిలుపునిచ్చారు. త్వరలోనే ఆటో డ్రైవర్లందరికీ బీమా సౌకర్యం కల్పించేందుకు బీఆర్ఎస్ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు నరసింహారెడ్డి, హనుమంత్ రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, వేణు, నాయకులు దేవేందర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి,తుపాకుల రాజు, వెంకట్రాంరెడ్డి, సత్యనారాయణ, మహిపాల్ రెడ్డి,రుక్మారెడ్డి,ఆంజనేయులు, గోపాల్,మురళి,ప్రకాష్, గణేష్,చక్రపాణి, రమేష్, ఆటో అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి వీర, అశ్వక్ ఖాన్, వెంకటేష్, శ్రీకాంత్ లక్ష్మీపతి, శివ, రమేష్, దయానంద్, స్థానిక నాయకులు, ఆటో యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# కోహిర్ స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్ భవనంలో త్వరలో కోర్సులు

**-యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు**
**– కలెక్టర్ పి. ప్రావిణ్య**



సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 12:
సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నితన్ డైరెక్టర్ వెంకటరమణ లు కలిసి శుక్రవారం స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్ , కోహిర్ భవనాన్ని సందర్శించారు. గత రెండు సంవత్సరాలుగా వినియోగంలో లేని ఈ భవనాన్ని పరిశీలించిన అనంతరం, కలెక్టర్ తక్షణమే వారం రోజుల్లో శుభ్రపరచి వినియోగంలోకి తేవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ- త్రాగునీరు, విద్యుత్, శుభ్రత వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి భవనాన్ని విద్యా, శిక్షణా కేంద్రంగా మార్చాలని సూచించారు. భవనాన్ని వినియోగంలోకి తెచ్చి, స్కిల్ డెవలప్మెంట్ లో , హాస్పిటల్ మేనేజ్మెంట్, హెూటల్ మేనేజ్మెంట్, ప్రోగ్రాంలు ప్రారంభించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలోనే ఓరియంటేషన్ ప్రోగ్రాంలు కూడా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పూర్తి కాలం కోర్సులు కాకుండా, సర్టిఫికేషన్ , షార్ట్‌టర్మ్ కోర్సులు ప్రారంభించడం ద్వారా యువతకు తక్షణ ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. ఈ భవనంలో హెూటల్ మేనేజ్మెంట్, హాస్పిటల్ మేనేజ్మెంట్ వంటి కోర్సులు ప్రారంభించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

ఇందిరా మహిళా శక్తి సంఘాలకు, హెూటల్ మేనేజ్మెంట్ కోర్సులు ,బేకరీ ఐటమ్ తయారీ శిక్షణ అందే విధంగా ప్రోగ్రాంలు ప్రారంభించాలన్నారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు లభించేలా ప్రత్యేక శిక్షణ తరగతులు రూపొందించాలని సూచించారు.ఈ సందర్భనలో డైరెక్టర్ వెంకటరమణ, ఈ డి ఎస్సి కార్పోరేషన్ రామాచారి , జిల్లా ఉపాదికలనాధికారి అనిల్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ తుల్జా నాయక్ జహీరాబాద్ ఆర్ డి ఓ దేవుజా,రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు ,తదితరులు పాల్గొన్నారు .

# మెడికవర్ హాస్పిటల్ వరంగల్‌లో రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభం



ఉమ్మడి వరంగల్ బ్యూరో,(భారత శక్తి)సెప్టెంబర్12:
మెడికవర్ హాస్పిటల్ వరంగల్‌లో ఆధునిక రిహాబిలిటేషన్ సెంటర్‌ను వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో ఇలాంటి సదుపాయం అందుబాటులోకి రావడం రోగులకు ఎంతో మేలు చేస్తుందని, ఇకపై మెట్రో నగరాలకు వెళ్లకుండా స్థానికంగానే అత్యాధునిక రిహాబిలిటేషన్ సేవలు పొందే అవకాశం లభిస్తుందని తెలిపారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన రోగులను పరామర్శించి, మెడికవర్ వైద్యులు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ నమ్రత మాట్లాడుతూ, వరంగల్ ప్రజలకు ప్రపంచ స్థాయి రిహాబిలిటేషన్ సేవలు అందించడం మా లక్ష్యం అని పేర్కొన్నారు.

డాక్టర్ షఫీ (కార్డియాలజిస్ట్), డాక్టర్ కస్తూరి ప్రమీల (గైనకాలజిస్ట్), డాక్టర్ దీపక్ (క్రిటికల్ కేర్) సహా వైద్యులు రిహాబిలిటేషన్ సెంటర్ ప్రత్యేకతలు, ఫిజియోథెరపీ, కార్డియాక్, న్యూరో, పోస్ట్-సర్జికల్ కేర్ వంటి విభాగాల్లో అందుబాటులో ఉండే ఆధునిక వైద్య సౌకర్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ హెడ్ హరినాథ్ పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణ దేవరాయ నిత్యాన్నదాన ట్రస్టు ప్రారంభోత్సవానికి హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

తిరుపతి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12 (భారత శక్తి ): కాణిపాకంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ దేవరాయ నిత్యాన్నదాన ట్రస్టు, ఆఫీసు ప్రారంభోత్సవ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు , తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు , మాజీ ఎమ్మెల్యే ఏ.ఎస్ మనోహర్ మరియు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కి శ్రీ కృష్ణ దేవరాయ నిత్యాన్నదాన ట్రస్టు సభ్యులు సాదర స్వాగతం పలికారు.దానంలోకెల్లా అన్నదానం మిన్న ...కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి సన్నిధిలో శ్రీ కృష్ణ దేవరాయ నిత్యాన్నదాన ట్రస్టును ఏర్పాటు చేసి, ఆకలిని తీర్చే శ్రీ కృష్ణ దేవరాయ నిత్యాన్నదాన ట్రస్టు సభ్యులకు అభినందనలు తెలియజేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.

# విలువల కోసం పోరాడిన ఏచూరికి ఘన నివాళి

**– సామాజిక న్యాయం, సమానత్వం, సోషలిజం లక్ష్యంగాపనిచేసినఏచూరి**
**– ప్రజల నిత్య జీవితా అనుభవం నుండి పోరాటాలు, ఐక్య ఉద్యమాలు వస్తాయని నమ్మిన వ్యక్తి ఏచూరి**
**– భిన్నత్వంలో ఏకత్వం భారతీయ భావనకు మాత్రమే దేశ ప్రజల మద్దతు ఉంటుంది**
**– రాజ్యాంగాన్ని సోషలిస్టు రాజ్యాంగంగా అభివృద్ధి చేసుకోవాలి**

కడప, (భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్12: ఉదయం 10 గంటలకు, కడప స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, కామ్రేడ్ సీతారాం ఏచూరి కి మొదటి వర్ధంతి సభ నిర్వహించి, ఘనమైన నివాళి అర్పించారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ... కామ్రేడ్ సీతారాం ఏచూరి, సిపిఎం అఖిల భారత కార్యదర్శిగా, పార్లమెంటులో సిపిఎం పక్ష నాయకులుగా, భారతీయ సమాజంలోని వైరుధ్యాలను మార్క్సిస్టు శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి, భిన్నత్వంలో ఏకత్వం భారతీయ భావనకు మాత్రమే దేశ ప్రజల మద్దతు ఉంటుందని ధైర్యంగా తన రచనలు కొనసాగించిన మహెూన్నత ప్రజా అనుకూల మేధావి అన్నారు.7 దశాబ్దాలు విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగించి, క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు దిగ్గజం అని కొనియాడారు. నేడు తక్షణం భారత దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, లౌకికవాదం, ఫెడరలిజం , ప్రజాస్వామ్యంతో భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల అమలు ద్వారా పాలక ప్రభుత్వాలు సోషలిస్టు రాజ్యాంగంగా అభివృద్ధి చేసుకోవడం తక్షణ లక్ష్యంగా పనిచేయాలని ఏచూరి రాజ్యాంగ నిపుణులైన మేధావులందరినీ ప్రభావితం చేసిన మహా మేధావి అన్నారు. ప్రజల నిత్య జీవిత అనుభవం నుండి పోరాటాలు, ఐక్య ఉద్యమాలు వస్తాయని ప్రధానంగా నమ్మిన వ్యక్తి అన్నారు. 2024 గ్లోబల్ ఎంప్లాయ్మెంట్ రేట్స్ ఫర్ యూత్ నివేదిక ప్రకారం దేశంలో చదువుకున్న నిరుద్యోగ యువత ఉపాధి లేక ప్రతి సంవత్సరం 13 శాతం పెరుగుతూ ఆందోళన చెందుతూ ఉందన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలు అమలు ఆపకపోతే, శ్రీలంక, బంగ్లాదేశ్ , నేపాల్ లో యువత నిరుద్యోగంపై చేసిన ప్రతిఘటన పోరాటం లాంటివి భారతదేశంలో భవిష్యత్తులో రానున్నాయని వారి హెచ్చరించారు. భూమిలేని ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల భూమి పంపిణీ చేయాలని, లేకుంటే ఆహార ధాన్యాల కొరత సమస్య పరిష్కారం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక బడ్జెట్లు ప్రవేశపెడుతున్నాయని, వ్యవసాయ కార్మికులు, రైతుల ఉపాధి రోజురోజుకు బాగా తగ్గిపోతోందని, కార్పొరేట్ల అనుకూల ఆర్థిక విధానాల అమలు చేస్తున్నారని, ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. ప్రజల నిత్యవసర వస్తువుల ధరలు ప్రతి సంవత్సరం 4 శాతం నుండి 7 శాతం వరకు పెరుగుతున్నాయని సర్వేలు చెబుతున్నా, పాలక ప్రభుత్వాలు ధరల అదుపు చేయటానికి ప్రయత్నం చేయటం లేదని వారు ఆరోపించారు. వ్యవసాయానికి కావలసిన ఎరువుల ధరల తగ్గింపు చేయకుండా, పెంచుతున్నారని స్వామినాథ కమిషన్ రికమండేషన్లు అమలు చేస్తామని ఒకవైపు చూపుతూనే, మరోవైపు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారాణి ఆరోపించారు. అమెరికా 50% సుంకాల ప్రభావం దేశీయ వస్త్ర పరిశ్రమలపై, దేశ అసంఘటిత కార్మిక శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. శ్రమ ఆధారిత పరిశ్రమల్లో సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర పాలక ప్రభుత్వాలు పేదరిక తగ్గింపు నకిలీ వాదనలు ప్రచారం చేస్తున్నారని వీటిని దేశ ప్రజలు ఎవరూ నమ్మడం లేదన్నారు. తిప్పి కొట్టాల్సిన అవసరం దేశ ప్రజల అందరిపై ఉందన్నారు. విద్యుత్ సంస్కరణ పేరిట టైమ్ ఆఫ్ డే టారిఫ్ అధిక చార్జీలు, ప్రీపెయిడ్ మీటర్స్ పేరిట మోయలేని భారాలు వేస్తున్నారన్నారని, విద్యను కాషాయకరణ చేస్తున్నారని, బీహార్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరిట ఓటర్లను తొలగిస్తున్నారని, పహల్గావ్ దాడి పై శ్వేత పత్రం విడుదల చేయలేదని, భారత దేశ మూలవాసి జాతుల వ్యతిరేక కార్యకలాపాల డిమాండ్లను అడ్డుకోవడానికి, ప్రమాదకరమైన చట్టాలు తెస్తున్నారని, ఒకే దేశం ఒకే ఎన్నిక నమూనా బహుళత్వ భారత సమాజానికి సరిపోదు అనే విషయాన్ని నిపుణులు చెబుతున్నా బిజెపి గుడ్డిగా ముందుకు పోతోందని, దేశ ప్రజల పౌరాస్వేచ్ఛ దెబ్బతీసే కీలకమైన నిబంధనలతో అప్రజాస్వామిక చట్టాలు పార్లమెంటులో చర్చ లేకుండా ఆడియన్స్ రూపంలో తెస్తూ అమలు చేస్తున్నారన్నారని, స్నేహపూర్వక పాలక ప్రతిపక్ష రాజకీయాలు ఉండాల్సిన స్థానంలో ప్రతీకార రాజకీయాలు బిజెపి, ఎన్డీఏ కూటమి ప్రవేశపెట్టి నడిపిస్తోందని తెలిపారు. కుల గణన సర్వే సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణం నుండి చేయకుండా, మత ప్రాతిపదిక సర్వే చేస్తున్నారని, ఇది అశాస్త్రీయమైందని, అహేతుకమైందని దీనిని సవరించి అమలు చేయాలన్నారు. దేశంలో 11 సంవత్సరాల మోడీ పరిపాలనలో, మైనార్టీలపై,



దళితులపై, గిరిజనులపై, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. సుపరిపాలన, జవాబుదారితనం, దేశ సమైక్యత, సమగ్రత గాలికి వదిలేసారన్నారు. గ్రామీణ పేదల వ్యవసాయ పని దినాల సంఖ్య రోజురోజుకు తగ్గుతున్నాయన్నారు. ప్రజా ప్రతినిధుల్లో, ఉన్నత అధికారుల్లో అవినీతి తీవ్రమవుతుందన్నారు. పేదలకు ఇచ్చే గృహ నిర్మాణ ఖర్చు కనీసం ఐదు లక్షల రూపాయలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. గ్రామీణ శ్రామికుల, కార్మికుల, రైతుల సమస్యలపై ప్రజలు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 2025 సెప్టెంబర్ 8, 9, 10, కడపలో జరిగిన అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏ.ఐ.ఏ.డబ్ల్యూ.యు.) జాతీయ కౌన్సిల్ సమావేశాలు విజయవంతానికి కృషి చేసిన, సహకరించిన వారందరికీ విప్లవ అభివందనాలు తెలియజేస్తూ, జాతీయ కౌన్సిల్ తీర్మానాలైన దేశంలోని పేదలందరికీ భూమి, వేతనాలు పెంపు, ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలు, స్వగ్రామాల్లోనే ఉపాధి అందాలని, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడాలని, విద్యా, వైద్యం ప్రతి ఒక్కరికి ఉచితంగా అందాలని, ఆదివాసీల జనాభా ప్రాతిపదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్లో నిధులు కేటాయించాలని, హిందుత్వం పేరుతో దేశ ప్రజలను విడదీసే విచ్ఛిన్నకార శక్తులను ఎదుర్కోవాలని, వలస కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, అమెరికా సుంకాలను వ్యతిరేకించాలని, ఐక్య ఉద్యమాలకు ప్రజలందరూ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.అన్వేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, సిపిఎం కడప నగర నాయకులు చంద్రారెడ్డి రామకృష్ణారెడ్డి నారాయణరెడ్డి విజయ్ రఘు ఒంటిమిట్ట మండల కార్యదర్శి నరసయ్య తదితరులు మాట్లాడారు.



# టీమ్ఇండియా ఆటగాళ్లకు బ్రాంకో టెస్టు..
# బీసీసీఐ వీడియో విడుదల

ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను పరీక్షించేందుకు యో యో టెస్టుతోపాటు బ్రాంకో టెస్టు (ఃతీనీనిఙనీ ుపబబి)ను కూడా అమలుచేసేందుకు బీసీసీఐ ప్రయత్నాలు చేస్తున్నట్లు అనిపిస్తోంది. మొన్నటివరకూ బ్రాంకో టెస్టును నిర్వహించేది లేదన్న వార్తలు వచ్చాయి. తాజాగా బీసీసీఐ షేర్ చేసిన వీడియోతో బ్రాంకో టెస్టు తప్పనిసరి చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇంతకీ ఆ వీడియోలో ఏముందంటే?

బ్రాంకో టెస్టును భారత క్రికెట్‌లో అమలుచేయాలని భావించిన స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్ అడ్రియన్ రౌక్స్ ఎట్టకేలకు రంగంలోకి దిగాడు. ఆసియా కప్ కోసం దుబాయ్‌లో ఉన్న టీమ్ఇండియా ఆటగాళ్లకు బ్రాంకో టెస్టు ఎలా నిర్వహిస్తారో డెమో ఇచ్చాడు.



"ఇవాళ మనం చేసిన రన్ బ్రాంకో రన్. ఇదేమీ కొత్తది కాదు. కొత్త ప్రమాణం కూడా కాదు. విభిన్న క్రీడల్లో గత కొన్నేళ్లుగా బ్రాంకో టెస్టు ఉంది. మనం ఇప్పుడు ఇక్కడ రెండువిధాలుగా ఉపయోగించుకుంటాం. ఒకటి ట్రైనింగ్ మెకానిజం కోసం కాగా.. రెండోది ఫిట్‌నెస్ ప్రమాణాలను తెలుసుకొనేందుకు. ఈ టెస్టును ఎక్కడైనా చేయొచ్చు. విదేశాలకు వెళ్లినప్పుడూ ఇబ్బంది రాదు. వారి ఫిట్‌నెస్‌ను అంచనా వేసేందుకు ఈ విధానం ప్లేయర్లకు బాగుంటుంది. గత కొన్నేళ్లుగా క్రికెట్‌లో ఎన్నో మార్పులు వచ్చాయి. అద్భుతమైన నైపుణ్యాలు కలిగిన ప్లేయర్లు ఉన్నారు. అయితే, వారి కెరీర్‌ను మరింతకాలం కొనసాగేలా చేయడంలో సహకరిస్తాం. గాయాలను తగ్గించేందుకు చేయాల్సిందంతా చేస్తాం. మరిన్ని సీజన్లు ఆడేలా చూడాలి. భారత ఆటగాళ్లకు ఉన్న పని నిబద్ధత నన్నెంతో ఆకట్టుకుంది. ఐపీఎల్ సమయంలో చాలామంది క్రికెటర్లతో పనిచేసిన అనుభవం ఉంది" అని అడ్రియన్ వెల్లడించాడు.

## ఏనీవ ఖీనీనీబి: రూట్ ఒక్క సెంచరీ చెయ్..
# మా నాన్న నుంచి కాపాడు: హేడెన్ కుమార్తె విన్నపం



ల

అత్యంత ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీసుల్లో యాషెస్ ఒకటి. ఇంగ్లాండ్ – ఆస్ట్రేలియాజట్ల మధ్య జరిగే ఐదు టెస్టుల యాషెస్‌పై సర్వత్రా ఆసక్తి ఉంటుంది. ఇక్కడ సెంచరీ చేసినా, ఐదు వికెట్ల ప్రదర్శన చేసినా చాలు వారి పేరు మారుమోగిపోతుంది. ఈ ఏడాది ఆస్ట్రేలియా వేదికగా యాషెస్ సిరీస్ జరగనుంది. ఈ క్రమంలో ఆసీస్ మాజీ ఆటగాడు మ్యాథ్యూ హేడెన్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. దీంతో ప్రత్యర్థి బ్యాటర్‌ను కూడా సెంచరీ చేయమనే పరిస్థితి హేడెన్ కుమార్తెకు వచ్చింది. అసలు మ్యాథ్యూ హేడెన్ ఏమన్నాడు? ఆయన కుమార్తె గ్రేస్ హేడెన్ విన్నపం ఏంటో చూద్దాం.. ప్రస్తుతం టెస్టుల్లో అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న క్రికెటర్ జో రూట్. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన సచిన్ తెందూల్కర్ (15,921) రికార్డుకు చేరువగా ఉన్న ఆటగాడు కూడా అతడే. మరో 2,400 పరుగులు చేస్తే ఆ రికార్డు సొంతమవుతుంది. ఈ క్రమంలో రాబోయే టెస్టు సిరీస్ రూట్‌కు అత్యంత కీలకం. అయితే, ఆసీస్ మాజీ ఆటగాడు మ్యాథ్యూ హేడెన్ మాత్రం రూట్‌పై ఒత్తిడి పెంచేలా ఓ సవాల్ విసిరాడు. ఒకవేళ యాషెస్ సిరీస్ (ంబష్ట్రవబ ావతీతివబ)లో రూట్ ఒక్క సెంచరీ కూడా చేయకపోతే తాను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో 'నగ్నంగా నడుస్తా' అనిసోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టాడు. హేడెన్ కామెంట్లకు విపరీతమైన స్పందన వచ్చింది. అందులో హేడెన్ కుమార్తె, క్రీడా వ్యాఖ్యాత గ్రేస్ హేడెన్ కూడా ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా రూట్‌కు ఓ విన్నపం చేసింది. "ప్లీజ్ రూట్.. ఒక్క సెంచరీ అయినా చెయ్" అని కామెంట్ సెక్షన్‌లో పోస్టు చేసింది. రూట్‌కు ఆసీస్ గడ్డపై ఒక్క టెస్టు శతకం కూడా లేకపోవడం గమనార్హం. దీంతో ఆసీస్ బౌలర్లు రూట్ విషయంలో ఏం చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 21 నుంచి పెర్త్ వేదికగా తొలి టెస్టు మొదలుకానుంది. మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్టు మ్యాచ్ జరగనుంది.

# సంజు విషయంలో టీమ్ఇండియా ఆలోచన అదే: అశ్విన్



ఆసియా కప్)లో టీమ్ఇండియా స్క్వాడ్‌ను ప్రకటించినప్పుడు సంజు శాంసన్‌కు చోటు దక్కిందని చాలామంది సంబరపడ్డారు. అయితే, తుది జట్టులో ఆడిస్తారా? లేదా? అనే అనుమానాలను తొలగిస్తూ యూఏఈతో తొలి మ్యాచ్‌లో ఆడించారు. కానీ, ఓపెనర్‌గా పంపించలేదు. అభిషేక్ శర్మ – శుభ్‌మన్ గిల్‌తో ఇన్నింగ్స్ మొదలైంది. అలాగని వన్‌డౌన్‌లో దింపలేదు. దీంతో మళ్లీ అభిమానుల్లో సందేహాలు మొదలయ్యాయి. తదుపరి మ్యాచుల్లో సంజును పక్కన పెడతారా? అని. అయితే, దీనిపై భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఒకవేళ టాప్ ఆర్డర్‌లో త్వరగా వికెట్లను కోల్పోతేనే సంజును బ్యాటింగ్‌కు పంపించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాడు. "మేనేజ్‌మెంట్ వ్యూహాలు నాకు ఆశ్చర్యంతోపాటు సంతోషం కలిగిస్తున్నాయి. ఎందుకంటే సంజు శాంసన్‌కు అవకాశం ఇచ్చినందుకు హ్యాపీ. కోచ్, కెప్టెన్ నుంచి మద్దతు దక్కింది. ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనూ 'సంజు తర్వాతే ఎవరినైనా చూస్తాం' అని సూర్య చెప్పిన మాటలు నచ్చాయి. సంజు బ్యాటింగ్‌కు దిగాలంటే పవర్‌ప్లేలో అయితేనే బాగుంటుంది. ఇది ప్రాజెక్ట్ సంజు శాంసన్. గతంలో నేను అతడిని ఇంటర్వ్యూ చేసినప్పుడు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇచ్చిన సపోర్ట్ గురించి ప్రస్తావించాడు. వరుసగా 21 సార్లు డకౌట్ అయినా సరే 22వ మ్యాచ్‌లో తీసుకుంటానని భరోసా ఇచ్చాడని పేర్కొన్నాడు. అలాంటి ఆత్మవిశ్వాసం ప్లేయర్లకు ఇవ్వడంలో సంజు – సూర్య అద్భుతం. జట్టుకు సంజుశాంసన్ బలమని నమ్మారు. అందుకే ఫైనల్ %శ×%లో అవకాశం కల్పించడం చూశాం" అని అశ్విన్ వెల్లడించాడు.

శ్రేయస్‌కు చోటు కోసమే ఇలా..: క్రిష్

రవిచంద్రన్ అశ్విన్ తెలిపిన అభిప్రాయాలకు భిన్నంగా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ వ్యాఖ్యానించాడు. సంజును మిడిలార్డర్‌కు పరిమితం చేయడం శ్రేయస్ అయ్యర్‌కు దారి చూపేందుకేనని తెలిపాడు. "సంజు శాంసన్‌ను మిడిలార్డర్‌లో ఆడించేందుకు బీసీసీఐ నిర్ణయం తీసుకున్నట్లు అనిపిస్తోంది. అయితే, అక్కడ సంజు ఎక్కువ పరుగులు చేయలేకపోయాడు. దీంతో ఐదో స్థానంలో ఇబ్బందిపడే అవకాశం లేకపోలేదు. అతడి ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఆసియా కప్‌లో సంజును ఆడించి.. విఫలమైతే మాత్రం శ్రేయస్ అయ్యర్‌ను మళ్లీ జట్టులోకి తీసుకొనే అవకాశం ఉంది. మిడిలార్డర్‌లో సంజు ఫినిషర్ పాత్ర పోషించాల్సిన అవసరం లేదు. ఇన్నింగ్స్‌ను దూకుడుగా ముందుకుతీసుకెళ్తే చాలు. ఫినిషర్లుగా ఇప్పటికే హార్దిక్ పాండ్య, శివమ్ దూబె ఉండనే ఉన్నారు" అని క్రిష్ తెలిపాడు.

# సచిన్ వల్లే క్రికెట్‌లోకి వచ్చా..
## కోహ్లి నిబద్ధతే నాపై చెరగని ముద్ర వేసింది: గిల్

ప్రపంచ క్రికెట్‌లో తనకు ఇద్దరే మార్గదర్శకులని.. వారిని చూస్తూ పెరిగానని భారత్ ఆటగాడు శుభమన్ గిల్ (వెల్లడించాడు. టెస్టు టీమ్‌కు సారథిగా మారిన అతడు.. వన్డేలు, టీ20ల్లో వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ప్రస్తుతం ఆసియా కప్ కోసం దుబాయ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో తాను క్రికెటర్‌గా మారేందుకు కారణమైన దిగ్గజాల గురించి ఆసక్తికర విశేషాలు వెల్లడించాడు. తన తండ్రికి సచిన్ అంటే ఎంతో ఇష్టమని.. అందుకే తనను క్రికెటర్‌గా మార్చినట్లు గిల్ తెలిపాడు. కోహ్లీకి ఆటపై ఉన్న నిబద్ధతే తనకు స్ఫూర్తి అని వ్యాఖ్యానించాడు.

"టాలెంట్, నైపుణ్యం ఉంటేనే సరిపోదు. ఆడాలనే తపన, అభిరుచి లేకపోతే సక్సెస్ కావడం చాలా కష్టం. ఈ విషయంలో విరాట్ కోహ్లి నిబద్ధతే నాకు స్ఫూర్తి. ప్రశంసల గురించి చూస్తూ కూర్చోకుండా నా బాధ్యతలు నెరవేర్చేందుకు చూస్తా. క్రికెట్‌లో నాకు ఇద్దరు మార్గదర్శకులు. దిగ్గజ ఆటగాడు సచిన్ తెందూల్కర్ అంటే మా నాన్నకు చాలా ఇష్టం. నేను క్రికెట్‌లోకి రావడానికి అతడే కారణం. సచిన్ 2013లో రిటైర్ అయితే.. నేను 2011–13 సమయంలోనే క్రికెట్ ఆడటం ఎలాగో అర్థం చేసుకున్నా. కేవలం నైపుణ్యమే కాకుండా.. మానసికంగా, వ్యూహాత్మకంగా గేమ్ గురించి ఆలోచించడం మొదలుపెట్టా. విరాట్ కోహ్లితో కలిసి నేను ఆడే అవకాశం వచ్చింది. అప్పట్నుంచి చాలా దగ్గరగా విరాట్‌ను గమనించా. అతడి నిబద్ధత అద్భుతం" అని గిల్ వెల్లడించాడు.



# ఆయుష్ సంచలనం

భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలనం సృష్టించాడు. 2023 ప్రపంచ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత, ప్రపంచ మాజీ నంబర్ 2 కొడై నరౌకా (జపాన్)కు షాకిస్తూ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్స్‌లో ఆయుష్ 21–19, 12–21, 21–14తో విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో అతడు స్మాష్‌లతో విరుచుకుపడ్డాడు. అయితే తొలి గేమ్‌లో అతడు చాలా వరకు వెనుకబడ్డాడు. 2–5, 9–12, 13–15.. ఇలా వెనుకంజలో నిలిచిన అతడు ఆఖర్లో పుంజుకున్నాడు. బలమైన స్మాష్‌లతో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టి గేమ్‌ను చేజిక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న నరౌకా విరామానికి 11–5తో ఆధిక్యంలో నిలిచాడు. ఆయుష్ లయ అందుకోలేకపోయాడు. జోరు కొనసాగిస్తూ నరౌకా ఆ గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. తిరిగి లయను దొరకబుచ్చుకున్న ఆయుష్.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో అదరగొట్టాడు. ఎటాకింగ్ గేమ్ ఆడాడు. ఆరంభంలో 3–3తో సమంగా నిలిచిన ఆయుష్ ఆ తర్వాత 8–4తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ధాటిని కొనసాగిస్తూ 17–10తో నిలిచాడు. చక్కని రిటర్న్లు చేసిన అతడు ప్రత్యర్థికి పుంజుకునే అవకాశమివ్వకుండా గేమ్‌ను నెగ్గి ముందంజ వేశాడు. ఆయుష్ క్వార్టర్‌ఫైనల్లో 20వ ర్యాంకు షట్లర్ లక్ష్య సేన్‌ను ఢీకొంటాడు. ప్రిక్వార్టర్స్‌లో లక్ష్య 15–21, 21–18, 21–10తో మరో భారత షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్‌ని ఓడించాడు. కిరణ్ జార్జ్ 6–21, 12–21తో చో తీన్ చెన్ (తైపీ) చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో ప్రపంచ 9వ ర్యాంకు జంట సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి క్వార్టర్స్‌లో ప్రవేశించారు. ప్రిక్వార్టర్స్‌లో ఈ జోడీ 18–21, 21–15, 21–11తో థాయ్‌లాండ్ జోడీ పీరాచై సుక్‌ఫున్, పకాపన్ తీరాత్‌సకుల్‌లను ఓడించింది. తొలి గేమ్‌ను కోల్పోయిన భారత జంట ఆ తర్వాత గట్టిగా పుంజుకుంది.

# సెమీస్‌కు పూజారాణి.. భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయం



లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయమయ్యాయి. సీనియర్ బాక్సర్ పూజారాణి.. మహిళల 80 కిలోల విభాగంలో సెమీస్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. క్వార్టర్స్‌లో పూజా.. 3–2తో ఎమిలా కొటెర్స (పోలండ్)ను ఓడించింది. ఈ టోర్నీలో ఇప్పటికే నుపుర్ షెరోన్, జైస్మీన్ లంబోరియా సెమీస్ చేరిన విషయం విదితమే.మహిళల 57 కిలోల క్వార్టర్స్‌లో జైస్మీన్.. 5–0తో మమజొనోవా (ఉజ్బెకిస్థాన్)పై ఏకపక్ష విజయం సాధించింది. కాగా రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన నిఖత్ జరీన్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. పురుషుల విభాగంలో అవినాశ్ జమ్వాల్ సైతం క్వార్టర్స్‌లోనే ఇంటిబాట పట్టాడు.

# ప్రాక్టీస్ చేస్తున్న రోహిత్ శర్మ.. గూజ్‌బంప్స్ రియాక్షన్ ఇచ్చిన రితిక



ముంబై: వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ కొంత బ్రేక్ తర్వాత మళ్లీ బ్యాట్ పట్టాడు. నెట్స్‌లో అతను ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. ప్రాక్టీస్ సెషన్‌కు చెందిన ఓ వీడియోను తన ఇన్‌స్టా అకౌంట్‌లో పోస్టు చేశాడు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత రోహిత్ అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడలేదు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున అతను ఈ ఏడాది చివరగా క్రికెట్ ఆడాడు. అయితే ఆస్ట్రేలియాతో జరగబోయే వన్డే సిరీస్‌లో మళ్లీ మైదానంలోకి దిగే ఆలోచనలో రోహిత్ శర్మ ఉన్నాడు. ఆ ఉద్దేశంతోనే అతను మళ్లీ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.

# అలాంటి పునాదులే ఇన్నేళ్లు నిలబెట్టాయి



నటనలో సహజత్వం... అందంలో అచ్చ తెలుగుదనం. సహజ నటి జయసుధని తెలుగు ప్రేక్షకుల హృదయాలకు చేరువ చేసిన విషయాలివే. ఒకవైపు అగ్ర కథా నాయకుల సరసన నటిస్తూనే... మరోవైపు నటనకి ప్రాధాన్యమున్న పాత్రల్లో ఒదిగిపోయారు. 'లక్ష్మణరేఖ', 'జ్యోతి', 'ఆమె కథ', 'ఎదురీత', 'శివరంజని', 'ఇది కథ కాదు', 'పక్కింటి అమ్మాయి'... ఇలా ఆమె చేసిన మరపురాని చిత్రాలెన్నెన్నో. 300కిపైగా సినిమాలతో దక్షిణాది భాషలపై ఓ నటిగా తిరుగులేని ప్రభావం చూపించారు. సహాయ పాత్రలపైనా తనదైన ముద్ర వేస్తున్నారు. కథానాయికగా ఆమె పరిచయమైన చిత్రం 'లక్ష్మణరేఖ' ప్రేక్షకుల ముందుకొచ్చి నేటితో యాభయ్యేళ్లు. యాభయ్యేళ్ల ఈ ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే?

ఒక మహిళ ఇన్నేళ్లు చిత్ర పరిశ్రమలో కొనసాగడం సాధారణమైన విషయం కాదు. కథానాయికగా ఎంత ప్రభావం చూపించానో, సహాయ పాత్రలకి మారాక అంతే శక్తిమంతమైన పాత్రల్ని చేశా. 'అమ్మా నాన్న ఓ తమిళమ్మాయి', 'బొమ్మరిల్లు', 'శతమానం భవతి', 'ఎవడు' ఇలా ఎన్నో సినిమాల్లో గుర్తుండిపోయే పాత్రల్ని చేశా. ఈ ప్రయాణానికి కారణం నా ప్రతిభ మాత్రమే కాదు, దేవుడి ఆశీస్సులు కూడా తోడయ్యాయని నమ్ముతుంటా. నేను కథానాయికగా పరిచయమైన చిత్రం 'లక్ష్మణరేఖ' అయితే, అంతకుముందే బాలనటిగా కొన్ని సినిమాలు చేశా.

**'లక్ష్మణరేఖ' నాయికా ప్రధానంగా సాగే కథ. అలాంటి బలమైన పాత్రకి మిమ్మల్ని ఎంపిక చేయడంపై చర్చ జరిగిందంట కదా. అప్పుడు మీ మనసులో ఎలాంటి ఆలోచనలు ఉండేవి?**

నిజంగా అది చాలా కష్టమైన పాత్ర. తొలి సినిమా చేస్తున్న ఓ కథానాయిక అలాంటి పాత్రని స్వీకరించడం ఓ పెద్ద సవాలే. కానీ నాకు అప్పటికే కె.బాలచందర్ సినిమాల్లో నటించిన అనుభవం ఉంది. ఆ ధైర్యంతోనే 'లక్ష్మణరేఖ' చేయడానికి ఒప్పుకున్నా. ఆ విషయం చాలా మందికి తెలియదు. దానికితోడు అప్పట్లో కొత్తవాళ్లతో సినిమాలు చేయడానికి చాలా మందికి ధైర్యం సరిపోయేది కాదు. అందుకే నిర్మాతల్నీ, దర్శకుడు గోపాలకృష్ణనూ భయపెట్టారు. కానీ దర్శకుడు మాత్రం నన్ను బలంగా నమ్మారు. సీనియర్ నటులు గుమ్మడి నన్ను సెట్‌లో చూసి 'మరీ చిన్నమ్మాయి కదా, ఇంత బలమైన పాత్రని చేస్తుందా?' అని అడిగారు. కానీ ఆ సినిమా తర్వాత ఆయనే నా 'జ్యోతి' సినిమాలోనూ నటించారు. ఆరంభంలోనే అలాంటి బలమైన పాత్రలు వేసిన పునాదుల కారణంగానే ఇన్నేళ్లు నటిగా నిలబడగలిగానేమో.

**ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు మీకు ఎదురైన సవాళ్లు ఎలాంటివి?**

నాకు తెలుగు చదవడం రాదు. ఇప్పటికీ నా పేరు కూడా తెలుగులో రాసుకోలేను. మొదట్నుంచీ నా సంభాషణల్ని దర్శకుడు చదివితే, అర్థం చేసుకుని కెమెరా ముందు చెప్పడం అలవాటు. ఎంత పెద్ద సంభాషణ అయినా సరే, రెండు మూడుసార్లు వింటే చాలు తిరిగి చెప్పేయడం నాకు దేవుడు ఇచ్చిన ఓ గొప్ప వరం. అది నాకు ఎంత మైనస్సో అంత ప్లస్ కూడా అయ్యింది. కొన్నిసార్లు ఆ సంభాషణల్ని నాదైన శైలిలో అర్థం చేసుకుని మనం ఇంట్లో ఎలా మాట్లాడుకుంటామో అలా చెప్పేదాన్ని. అది ఎంతో సహజంగా ఉండేది. ఏమాత్రం నటన అనిపించేది కాదు. అదే నన్ను సహజనటిగా మార్చేసింది. 'లక్ష్మణరేఖ'లో నా వయసుకు మించిన పాత్ర కావడంతో ఎంతో పరిణతితో నటించాల్సి వచ్చింది. 'జ్యోతి'లో అయితే సిరిమల్లె పువ్వల్లె నవ్వు... పాటలో నవ్వు కోసం దర్శకుడు కె.రాఘవేంద్రరావు ఎంత కష్టపడ్డారో మాటల్లో చెప్పలేను. ఊరికే అంత నవ్వు ఎలా వస్తుంది? అందుకే కెమెరా వెనకాల చిన్న పిల్లల్లా కోతి పనులన్నీ చేయిస్తూ నాతో నవ్వించేవారు.

**ఈ ప్రయాణంలో సినీ నిర్మాణం చేపట్టారు, మరి దర్శకత్వం చేయాలని ఎప్పుడూ అనిపించలేదా?**

రామ్‌గోపాల్ వర్మ నిర్మాతగా, నా దర్శకత్వంలో ఓ సినిమా రావల్సింది. కానీ చివరి నిమిషంలో ఆ సినిమా ఆగిపోయింది. ముప్పయ్యేళ్ల కిందట మోహన్‌బాబు, విజయశాంతి ప్రధాన పాత్రధారులుగా ఓ సినిమా చేయాలనుకున్నా. పరుచూరి బ్రదర్స్ రచయితలుగా ఆ సినిమా కూడా దాదాపుగా ఆరంభ దశలో ఆగిపోయింది. వాటి వెనకాల రకరకాల కారణాలున్నాయి. నిర్మాతగా ఏడు సినిమాలు చేశా. ప్రస్తుతానికి నటనపైనే దృష్టి.

**కెరీర్ పరంగా తొలినాళ్లల్లో మీరు అనుకున్న లక్ష్యాల్ని చేరుకున్నారా? ఇంకా నెరవేరని కలలేమైనా ఉన్నాయా?**

పదిహేనేళ్ల వయసులో కథానాయికగా నా ప్రయాణం మొదలైంది. రేపటి గురించి ఆలోచన అన్నదే లేని రోజులవి. ఇక కెరీర్ గురించి నాకు కలలేం ఉంటాయి? అప్పటికీ, ఇప్పటికీ చీరలంటే నాకు పిచ్చి. నా కెరీర్ ఆరంభమైన కొత్తలో వాణిశ్రీ చీరకట్టుకు అందరూ పడిపోయేవారు. మోడ్రన్ డ్రెస్సులే అవసరం లేదు, మన చీరలతోనూ ఇంత అందంగా కనిపిస్తారని వాణిశ్రీ నిరూపించారు. అదే సమయంలోనే హిందీలో జయాబాధురి అంతే సహజంగా కనిపించేవారు. గుడ్డీ, మిలీ చిత్రాల్ని చూసి 'ఇలాంటి డ్రెస్‌లే వేసుకోవాలి, ఇలాంటి వేషమే వేయాలి' అనుకునేదాన్ని. 'మిలీ' సినిమా కొంచెం 'జ్యోతి' తరహాలోనే ఉంటుంది. అలా నాకు కెరీర్ ఆరంభంలో వాణిశ్రీ, జయాబాధురితోపాటు... పాశ్చాత్య దుస్తుల్లో ఇంకా ప్రభావం చూపించిన నీతూసింగ్, జీనత్ అమన్, షబానా అజ్మీ, స్మితా పాటిల్, రేఖ తదితర కథానాయికలు స్ఫూర్తి.

**అప్పట్లో నాయికల మధ్య పోటీ ఎలా ఉండేది?**

పోటీ అప్పుడూ ఇప్పుడూ ఒక్కటే. అయితే అవకాశాలు, పోటీ గురించి ఆలోచించే అవసరం నాకెప్పుడూ రాలేదు. 'లక్ష్మణరేఖ' విడుదల తర్వాత మూడు నాలుగేళ్లకు వెనక్కి వెళ్లిపోదామనుకున్నా. ఎక్కడైనా స్వేచ్ఛ ఉంటేనే నేను పనిచేయగలుగుతా. ఆ వాతావరణం కరువైందేమో అనిపించేది. ఆ వెంటనే మళ్లీ ఏవో అవకాశాలు రావడం, బిజీ కావడం అలా సాగిపోయేది. వేరే కథానాయికకి అవకాశం వచ్చింది, నాకు రాలేదే అని ఎప్పుడూ ఆలోచించలేదు. అయితే చేస్తున్న సినిమాలో 'అందరికంటే నేను బాగా చేయాలి, పేరు తెచ్చుకోవాలి' అనే పట్టుదలైతే ఉండేది. ఎక్కువగా 'డీ గ్లామరైజ్డ్ పాత్రలే చేస్తున్నావు, గ్లామర్ పాత్రలు చేస్తే ఇంటికి వెళ్లిపోవల్సి ఉంటుంది' అని భయపెట్టేవారు. నేను ఆ మాటల్ని ఎప్పుడూ లెక్క చేయలేదు. పెద్దవాళ్లని గౌరవించాలి, క్రమశిక్షణగా ఉండాలని మా నాన్న ఎప్పుడూ చెప్పేవారు. ఆ మాటల్ని మాత్రం నేనెప్పుడూ మరిచిపోలేదు. ఇంత సుదీర్ఘమైన ప్రయాణానికి మరో కారణం అదే అని నమ్ముతా.

**కథానాయిక నుంచి సహాయ పాత్రలకి మారిన దశ, ఆ ప్రయాణ క్రమం గురించి ఏం చెబుతారు?**

వయసు ప్రకారమే అదంతా. 'ఆంటీ' సినిమా చేసేటప్పటికీ నా వయసు 40 అనుకుంటా. 45, 50 ఇలా వయసుకు తగ్గట్టుగా తల్లి పాత్రలు చేస్తూ వచ్చా. అయితే తల్లి పాత్రలపైనా ఎంతో ప్రభావం చూపించగలిగా. 'ఎవడు', 'వారసుడు' తదితర సినిమాల్ని డబ్బింగ్‌లో చూసిన హిందీ ప్రేక్షకులు అక్కడికి వెళ్లినప్పుడు 'దక్షిణాది అమ్మ కదా మీరు...' అంటూ పలకరిస్తుంటారు. అయితే అమ్మ, అత్త పాత్రలే కాకుండా... ఇలా ఇతరత్రా పాత్రలు చాలానే సృష్టించవచ్చు కానీ, మన దర్శకులు ఆ దిశగా ఆలోచించడం లేదు. కొన్ని ఆంగ్ల సినిమాలు చూస్తున్నప్పుడు మనం చేయడానికి ఇన్ని రకాల పాత్రలు ఉన్నాయా అనిపిస్తుంది.

# నేను రాజకీయాల్లోకి వస్తే హీరోని అయిపోతా..: జగపతి బాబు



ఒకప్పుడు అగ్ర కథానాయకుడిగా అలరించిన జగపతిబాబు ఇప్పుడు ప్రతి నాయకుడి పాత్రలో వరుస సినిమాలతో మెప్పిస్తున్నారు. తాజాగా 'మిరాయ్'తో ప్రేక్షకుల ముందుకువచ్చారు. తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీని ప్రచారంలో భాగంగా ఈ చిత్రబృందం 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ శర్మ షో'లో సందడి చేసింది. అందులో జగపతిబాబు పొలిటికల్ కామెంట్‌తో నవ్వులు పూయించారు.

ఈ కార్యక్రమంలో కొందరు 'పుష్ప 2' స్కిట్‌ను ప్రదర్శించారు. ఆ సినిమాలో జగపతి బాబు కేంద్ర మంత్రి కొగటం వీర ప్రతాప్ రెడ్డి పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే. దీని గురించి చెబుతూ ఆయన సరదా కామెంట్ చేశారు. "నేను ఇప్పటివరకూ విలన్‌గా నటిస్తున్నాను. రాజకీయాల్లోకి వస్తే నేను హీరో అవుతాను. ఎందుకంటే ఆ రంగంలో ప్రతినాయకులు (ప్రత్యర్థులు) ఎక్కువ. అప్పుడు నేనే హీరో అవుతాను" అంటూ నవ్వులు పూయించారు.

**'దృశ్యం' చూసి నా భర్త భయపడ్డాడు: నటి శ్రియ**

ఇక ఈ షోలో పాల్గొన్న శ్రియ తన భర్త ఆండ్రీను తొలిసారి కలిసిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "నేను పొరపాటున విమాన టికెట్ ఒక ప్రాంతానికి బదులు మరో ప్రాంతానికి బుక్ చేసుకున్నా. దీంతో ఒంటరిగా మాల్దీవులకు వెళ్లాల్సివచ్చింది. అక్కడే ఆండ్రీని తొలిసారి కలిశాను. ఒకరికిఒకరం తెలియకుండానే ఆ ట్రిప్‌ను ఎంజాయ్ చేశాం. మేమిద్దరం కలిసి చూసిన మొదటి సినిమా 'దృశ్యం'. ఆ మూవీ చూసి ఆండ్రీ భయపడ్డాడు" అని శ్రియ గుర్తుచేసుకున్నారు. 'మిరాయ్'లో శ్రియ తేజ సజ్జాకు (౨వతీజీ ౧ాజీతీతీజీ) తల్లిగా నటించిన విషయం తెలిసిందే. నేడు ప్రేక్షకుల ముందుకువచ్చిన 'మిరాయ్' విజువల్ వండర్‌గా ప్రశంసలు అందుకుంటోంది.

## అందుకే సైయారాలో 'కోహ్లీ సీన్': అహాన్ పాండే



ఇటీవల విడుదలై సంచలనం సృష్టించింది 'సైయారా'. చిన్న సినిమాగా ప్రేక్షకుల ముందుకువచ్చి స్టార్ హీరోల చిత్రాలతో పోటీపడి వసూలు చేసింది. ఇందులో కోహ్లీని అనుకరించే సీన్ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. తాజాగా దానిపై హీరో అహాన్ పాండే) ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.విరాట్ కోహ్లీ ) సిగ్నేచర్ షాట్‌ను అనుకరిస్తూ వాణి(హీరోయిన్) చేసిన సన్నివేశం ప్రత్యేకంగా నిలిచింది. తన తండ్రితో వాదనకు దిగిన తర్వాత క్రిష్‌ను (అహాన్ పాండే) ఉత్సాహపరిచేందుకు హీరోయిన్ కవర్ డ్రైవ్ షాట్ చేస్తూ నటిస్తారు. దీనిపై అహాన్ మాట్లాడుతూ.. "నేను విరాట్‌కు వీరాభిమానిని. ఆయన నిజంగా లెజెండ్. పరుగులు చేసి రికార్డులు బద్దలు కొట్టే వ్యక్తులు చాలామంది గురించి వింటాం. కానీ, ఎప్పటికీ గుర్తుండాలంటే మాత్రం విరాట్‌లా జీవించాలి.

# ఉచిత విద్య కోసం సొంతిల్లును పాఠశాలగా మార్చి లారెన్స్ ఉదారత



ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకుడు, నటుడు రాఘవ లారెన్స్ మరోసారి సేవా గుణాన్ని చాటుకున్నారు. ఆయన ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆయన ఇప్పుడు విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు తన సొంతింటిని పాఠశాలగా మారుస్తున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం తాను నటిస్తున్న 'కాంచన 4' చిత్ర అడ్వాన్స్‌తో ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు. "ప్రతిసారీ నా సినిమాలకు తీసుకునే అడ్వాన్స్‌తో ఓ కొత్త సామాజిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తానని మీలో చాలా మందికి తెలుసు.

ఈసారి నా మొదటి ఇంటిని పిల్లల ఉచిత విద్య కోసం పాఠశాలగా మార్చనున్నానని తెలియజేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ఇల్లు నాకెంతో ప్రత్యేకం. డ్యాన్స్ మాస్టర్‌గా నేను సంపాదించిన డబ్బుతో కట్టించిన తొలి ఇల్లిది. దీన్ని ఇంతకు ముందు అనాథాశ్రమంగా మార్చాం. ఇక్కడ ఆశ్రయం పొందిన వాళ్లు ఇప్పుడు ఉద్యోగాలు చేస్తున్నారు. ఇప్పుడీ ఇంటిని మరోసారి సేవకు వినియోగిస్తున్నందుకు గర్వంగా ఉంది. ఇక ఈ స్కూల్‌లో పాఠాలు చెప్పనున్న తొలి గురువు ఇదే ఇంట్లో పెరిగిన పిల్లల్లో ఒకరు కావడం నాకు మరింత సంతోషంతో పాటు గర్వంగా అనిపిస్తోంది" అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు లారెన్స్. ప్రస్తుతం ఆయన 'కాంచన 4'తో పాటు 'బెంజ్' అనే మరో సినిమాలోనూ నటిస్తున్నారు.

# నేను ఆడుతోంది మన గ్రౌండ్‌లోనే..



"ఒక అంతర్జాతీయ స్థాయి సినిమా చూపించాలన్న లక్ష్యంతో చేసిన చిత్రమే 'మిరాయ్'. ఇది చాలా క్లీన్ సినిమా. యాక్షన్, అడ్వెంచర్, ఫాంటసీ, డివోషనల్.. ఇలా అన్ని అంశాలతో థియేటర్లో ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందిస్తుంది" అన్నారు తేజ సజ్జా. 'హనుమాన్' విజయం తర్వాత ఆయన నుంచి వస్తున్న కొత్త పాన్ ఇండియా చిత్రమిది. కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మించింది.

**'హను-మాన్' తర్వాత మీలో వచ్చిన మార్పులేంటి? ఇండస్ట్రీ మిమ్మల్ని ఎలా చూస్తోంది?**

"చిత్ర పరిశ్రమ నన్నెలా చూస్తుందన్నది చెప్పలేను గానీ.. నటుడిగా నేను పడే కష్టంలో.. ఎంచుకునే సినిమాల్లో అప్పటికి ఇప్పటికీ ఏ తేడా లేదు. హీరోగా చిత్రసీమలోకి అడుగు పెట్టినప్పుడు ఎలాంటి కొత్త రకమైన చిత్రాలు చేయాలనుకున్నానో.. అలాంటి సినిమాలే చేస్తున్నా. 'హను-మాన్' కోసం శ్రమించిన దాని కన్నా 'మిరాయ్' కోసం ఇంకా ఎక్కువ కష్టపడ్డా. దీనికి తగ్గట్లే మాపై ఇటు ప్రేక్షకుల్లోనూ.. అటు సినీ వర్గాల్లోనూ ఓ నమ్మకం ఏర్పడింది. 'హనుమాన్'కు ముందు ఇలాంటి పరిస్థితి లేదు. 'వీళ్లు నిజంగా ఏదో మ్యాజిక్ చేస్తారా' అని కొందరు నమ్మకపోయి ఉండొచ్చు. అది తప్పేం కాదు. కానీ, ఆ విజయం తర్వాత మాపై ఓ నమ్మకమైతే ఏర్పడిందని అనుకుంటున్నా. వీళ్లు నిజంగా కష్టపడుతున్నారు.. ఏదో సర్‌ప్రైజ్ చేయగలరని విశ్వసిస్తున్నారు".

**'హను-మాన్' విజయం మీపై ఏమైనా ఒత్తిడిని పెంచిందా? ఆ చిత్ర ఫలితాన్ని బట్టి 'మిరాయ్'లో ఏమైనా మార్పులు చేశారా?**

"నేను ప్రేక్షకుల్ని ప్రతిసారీ ఆశ్చర్యపరచాలి.. దానికి తగ్గట్లుగా గొప్ప చిత్రాలు చేయాలనే తపనతోనే ఉంటా. ఆ ఒత్తిడి నాపై ఎప్పుడూ ఉంటుంది. అంతేగానీ 'హను-మాన్' విజయం వల్ల నాపై కొత్తగా వచ్చిన ఒత్తిడేమీ లేదు. ఓ విజయం దక్కిందంటే అది నా ఒక్కడి ఘనతే అనుకునే వ్యక్తిని కాదు నేను. నా గత చిత్ర రికార్డులు అందుకోవాలి.. ఆ స్థాయి వసూళ్లు సాధించాలన్న అంచనాలేమీ పెట్టుకోను. నాకు ప్రతి సినిమా ప్రత్యేకమే. 'హనుమాన్' ఫలితం 'మిరాయ్'పై ఎలాంటి ప్రభావం చూపించలేదు. దీన్ని మేము తొలుత ఏ స్కేల్‌లో చేయాలనుకున్నామో.. అదే స్థాయిలో తీశాం. కథలోనూ.. బడ్జెట్ పరంగానూ ఏ మార్పులు .చేయలేదు. నా హోంగ్రౌండ్ తెలుగు. మన వాళ్ల అభిరుచుల్ని దృష్టిలో పెట్టుకుని.. వాళ్ల కోసం చేసిన చిత్రమిది. ఇది ఇతర భాష ల్లోనూ ఆడిందంటే .

# అలాంటి మహిళలే విజయం సాధిస్తారు: సమంత



అగ్ర కథానాయిక సమంత మహిళలను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారు. నటిగానే కాకుండా హెల్త్ పాడ్‌కాస్ట్‌లతో అవగాహన కల్పిస్తుంటారు. తాజాగా ఆమె తన 15 ఏళ్ల కెరీర్ గురించి మాట్లాడారు. ఎన్నో విజయవంతమైన చిత్రాల తర్వాత తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని స్వీకరించినట్లు చెప్పారు. ఒక స్టార్‌గా తాను ఎంతోమందికి స్ఫూర్తిగా ఉండాలని అనుకుంటున్నట్లు చెప్పారు. తన ఇన్‌స్టాలో ఓ వీడియో పంచుకున్నారు. "నటీమణులకు కెరీర్ పరంగా తక్కువ సమయం ఉంటుందని నేను భావిస్తాను. స్టార్‌డమ్, కీర్తి, గుర్తింపు ఇవన్నీ ఉత్సాహాన్నిస్తాయి. కానీ, ఇవే శాశ్వతం కాదు. స్టార్‌గా కొనసాగుతున్నప్పుడు కొందరిలో అయినా స్ఫూర్తి నింపగలగాలి. నలుగురిపై ప్రభావం చూపాలని ఎవరికి వారు సొంతంగా అనుకోవాలి. నా చుట్టూ నన్ను ప్రోత్సహించేవారు ఉన్నందుకు ఎంతో ఆనందంగా ఉన్నాను. వారు నాకు ఎప్పుడూ మార్గనిర్దేశం చేస్తుంటారు. ఏవిషయంలోనైనా ధైర్యంగా ముందడుగు వేసి రిస్క్ తీసుకొనే మహిళలే విజయం సాధిస్తారు. ఈ విషయాన్ని నేను కచ్చితంగా చెప్పగలను. మనల్ని మనం నమ్మినప్పుడే పురోగతి సాధ్యమవుతుంది. దూరదృష్టి ఉన్న ప్రతి మహిళ నలుగురిలోకి వచ్చి తన ఆలోచనలను పంచుకోవాలి. ఎందుకంటే ప్రపంచం వారి నాయకత్వాన్నే కోరుకుంటోంది" అని అన్నారు. ప్రస్తుతం నటిగానే కాకుండా నిర్మాతగానూ సమంత బిజీగా ఉన్నారు. తన సొంత బ్యానర్‌పై 'శుభం'ను నిర్మించి విజయాన్ని అందుకున్నారు. ఇక తన యూట్యూబ్ ఛానల్ వేదికగా వరుస పాడ్‌కాస్ట్‌ల్లో నిపుణులతో వీడియోలు చేస్తూ ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు.

# 'వదిలే ప్రసక్తే లేదు.. సీబీఐకి కంప్లైంట్ చేస్తా': కవిత సంచలన ప్రకటన



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో హెచ్ఎంఎస్ - సింగరేణి జాగృతి సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటీవల హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నికైన కల్వకుంట్ల కవితను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సింగరేణిలో అవినీతిపై సీబీఐకి కంప్లైంట్ చేస్తామని కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. రాబోయే సింగరేణి ఎన్నికల్లో హెచ్ఎంఎస్ జెండా ఎగురబోతోందని జోస్యం చెప్పారు. అవినీతిని కట్టడి చేయకుంటే సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ అని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతి కాంట్రాక్ట్‌లో 25 శాతం అవినీతి జరుగుతోందని ఆరోపణలు చేశారు. దాంట్లో 10 శాతం వాటా కాంగ్రెస్ పెద్దలకు వెళ్తోందని అన్నారు. సింగరేణిలో అవినీతిని ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించం.. అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం, సీఎంలను డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే తామే సీబీఐకి, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని ప్రకటన చేశారు. త్వరలోనే జరగబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికుల విశ్వాసం పొంది హెచ్ఎంఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హెచ్ఎంఎస్‌లో గౌరవాధ్యక్షురాలిగా నన్ను ఎన్నుకున్నారు.. మీరిచ్చిన గౌరవాన్ని కాపాడుకుంటూ కార్మికుల బాగు కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. 'టీబీజీకేఎస్ అనేది మొన్న ఎన్నికల్లో పోటీనే చేయలేదు. గుర్తింపు సంఘం అనుకుంటున్న వాళ్లు వాపును చూసి బలుపు అనుకుంటున్నారు.. నిజానికి సింగరేణి ఎన్నికల్లో వాళ్లకు గెలిచే అంతా సీన్ లేదు. అప్పుడు ఉన్న పొలిటికల్ సిచ్యువేషన్ కారణంగా ఆ పరిస్థితి వచ్చింది. సింగరేణిలో ఇప్పుడున్న ఎర్రజెండా కాకుండా మరొక జెండా ముందుకు రాబోతోంది. హెచ్ఎంఎస్, జాగృతి సంస్థలు మొత్తం 40 వేల మంది సింగరేణి కార్మికుల కోసం పనిచేస్తాయి. సింగరేణిలో పనిచేయడమంటేనే ఎంతో రిస్క్‌తో కూడుకున్నది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సరే వారికి పూర్తిస్థాయిలో భద్రత ఉండదు. ముఖ్యంగా కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌ను మనుషులే కాదన్నట్లుగా చూస్తున్నారు. అలాంటి వారికి మేము అండగా ఉంటామని కవిత భరోసా ఇచ్చారు.



## "ప్రజలతో మమేకమై సేవ చేయాలని పిలుపు

గుమ్మడిదల, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : ప్రజలతో మమేకమై సేవ చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా జిన్నారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు కొత్తకాపు జగన్ రెడ్డి ఆధ్వర్యంలో సేవా పక్వాడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రఘునందన్ రావు హాజరై మాట్లాడారు.. ప్రజా సమస్యల పరిష్కారమే నిజమైన సేవ అని పేర్కొన్నారు. సేవా భావంతో నిరంతరం ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని, రక్తదానం వంటి సేవలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాపరెడ్డి, శంషాబాద్ రాజు, వంగేటి రాజిరెడ్డి, పూడూరి సుధాకర్, మాణిక్యం, రమణ సింగ్, గుమ్మడిదల మండల అధ్యక్షులు ఐలేష్ గోవర్ధన్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీకు ఆ రోజు సిగ్గు లేదా?

## పార్టీ ఫిరాయింపుల అంశంపై మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేల వివాదంపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం సీఎంను కలిశామని వారు చెబుతున్నారని గుర్తుకు చేశారు. పార్టీ ఫిరాయింపుల విషయంపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని, ఆ అంశం కోర్టు పరిధిలోనిదన్నారు. దానిపై తాము ఎందుకు చర్చించాలని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రేపు ఎల్లుండి కూలిపోతుందని బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నేతలు మాట్లాడారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలనే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు ఏదో తప్పు చేసినట్లుగా మాట్లాడుతున్నారు.. మీకు ఆ రోజు సిగ్గు లేదా..? 88 స్థానాలు గెలిచిన తర్వాత కూడా గతంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకోలేదా..? అని నిలదీశారు. మేము ఏ తప్పు చేయలేదు కదా? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది మీరు.. మళ్లీ మీరే సిగ్గుందా అని మాట్లాడుతున్నారని కేటీఆర్‌పై మంత్రి జూపల్లి ఫైర్ అయ్యారు. ఆయన సగం మాట్లాడి సగం వదిలేస్తున్నారని అన్నారు.



ఎమ్మెల్యేలు పనుల కోసం కలిశామని చెబుతున్నా కూడా.. మీరు పార్టీలో చేరారు అనడం ఏంటని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో నిర్ణయాలు చట్ట ప్రకారమే ఉంటాయని, స్పీకర్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే జరుగుతోందని క్లారిటీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో నిన్న తాను చేసిన వ్యాఖ్యలపై మంత్రి జూపల్లి స్పందించారు. తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని అన్నారు. నేను చెప్పిన సందర్భాన్ని వదిలేశారని అన్నారు. నేను ఏమన్నానంటే? ఏడు సార్లు పోటీ చేశాను.. ఏడు పర్యాయాలు పోటీ చేసిన ఏ వేదికపై హామీలు ఇవ్వలేదు.. అయిన కూడా అన్ని పనులు చేశాను. దాన్ని వదిలేసి జూపల్లి అస్త్రాన్ని వదిలేశారు. నిరాశలో ఉన్నాడని బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.



## కాళోజీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల

* **కాళోజీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల**
* **2025-26 ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల కోసం..**

హన్మకొండ టౌన్, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : : కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 202526 విద్యా సంవత్సరానికి గాను ఎంబీబీఎస్/బీడీఎస్ అడ్మిషన్ల కోసం తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేసింది. తాత్కాలిక మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంబంధించిన పత్రాలతో తమ ఫిర్యాదులను అధికారిక వెబ్సైట్ knrugadmission@gmail.com కు 14.09.2025 సా. 05:00 గం. లేదా అంతకు ముందు గానీ సమర్పించవచ్చని తెలిపారు. తుది మెరిట్ జాబితా, వెబ్ ఎంపికలు knruhs.telangana.gov.in లో అనుసరించాలని సూచించారు.

## నేను ఇంగ్లీషులో చదివాను.. నాలాగా అందరూ ఇంగ్లీషులో మాట్లాడాలి

* **నేను ఇంగ్లీషులో చదివాను.. నాలాగా అందరూ ఇంగ్లీషులో మాట్లాడాలి**
* **కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యా రంగానికి పెద్దపీట**
* **రాష్ట్రమంత్రి శ్రీధర్ బాబు**
* **మహాముత్తారం మండలంలో కేజీబీవీ జూనియర్ కళాశాల భవనం ప్రారంభం**



భూపాలపల్లి, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : నేను చిన్నప్పుడు పట్టణంలో ఉండి ఇంగ్లీష్ మీడియంలో చదివి, ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడుతున్నాను. నాలాగే మంథని నియోజకవర్గంలోని విద్యార్థులంతా ఇంగ్లీష్ మీడియంలో చదివి ఇంగ్లీష్ అనర్గలంగా మాట్లాడాలని ఉన్నత చదువులు చదివి పైకి రావాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. మహాముత్తారం మండలంలో రూ.2 కోట్ల 30 లక్షలతో నిర్మించిన కేజీబీవీ జూనియర్ కళాశాల భవనాన్ని శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు తమ కాళ్ళపై తాము నిలబడాలనే సంకల్పం కలిగి ఉండాలని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ చదువుకుంటే గ్రామం బాగుపడుతుందని తద్వారా రాష్ట్రం దేశం విద్యాపరంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు టీ ఫైబర్ ద్వారా ల్యాప్ టాప్ లు అందజేస్తామన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల నియామకం పూర్తిచేసి ఖాళీగా ఉన్న పాఠశాలలో టీచర్ల నియామకం చేపట్టామని అంతేగాక గురుకుల పాఠశాలలో విద్యార్థుల కోసం కాస్మోటిక్ ఛార్జీలు పెంచి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల్లో 70 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రహదారుల, 72 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడి భవనాలు, 7 గ్రామ.పంచాయతీల్లో 1 కోటి 40 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ట్రేడ్ ప్రమోషన్ చైర్మెన్ అయిత ప్రకాష్ రెడ్డి, ఈ.జి.ఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కోట రాజా బాపు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పంతగాని నిర్మల సమ్మయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్‌లో నీళ్ల పెట్రోల్.. షాకింగ్ వీడియో వైరల్!



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : పెట్రోల్ బంకుల్లో రోజుకో రకమైన మోసం బయటపడుతుంది. ఇటీవల ఓ బంకులో రీడింగ్ తప్పు చూపిస్తూ మోసానికి పాల్పడిన సంగతి తెలిసిందే. డబ్బులు ఎక్కువ తీసుకుంటూ పెట్రోల్ తక్కువ కొట్టి అడ్డంగా దొరికిపోయారు. కాగా తాజాగా మరో రకమైన మోసం బయటపడింది. ఏకంగా పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయి. హైదరాబాద్‌లోని షెరిగూడ పరిధిలోని ఓ బంక్‌లో నిన్న రాత్రి మహేష్ అనే కస్టమర్ బ్రెజా కారులో పెట్రోల్ కొట్టించుకున్నాడు. అయితే అతడి కారు మధ్యలోనే ఆగిపోవడంతో మెకానిక్ దగ్గరకు వెళ్లాడు. చెక్ చేసిన మెకానిక్ పెట్రోల్ లో నీళ్లు ఉన్నాయని చెప్పాడు. దీంతో కస్టమర్ అదే బంకుకు వెళ్లి బాటిల్‌లో పెట్రోల్ కొట్టించగా అందులో నీళ్లు కనిపించాయి. దీంతో సిబ్బందిని నిలదీసి వారితో గొడవకు దిగాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సైతం నెట్టింట వైరల్ అవుతోంది.

## గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిపై వేటు.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : గాంధీ ఆసుపత్రి పారిపాలనా విభాగంపై రేవంత్ సర్కార్ ఫుల్ ఫోకస్ పెట్టింది. ఈ మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి ఆ పోస్టు నుంచి తప్పిస్తూ వైద్య ,ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టీనా గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె పనితీరుపై గత కొంత కాలంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలోనే డాక్టర్ రాజకుమారి సంబంధిత శాఖ క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించినట్లుగా తెలుస్తోంది. అయితే, వైద్య, విద్య అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వాణికి గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు కట్టబెడుతూ తాజాగా అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.



# భారత్‌లో లక్షల ఉద్యోగాలు గల్లంతు: ట్రంప్ అధిక టారిఫ్‌పై శశిథరూర్ తీవ్ర ఆగ్రహం

**అమెరికా, సెప్టెంబర్ 12 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న అసాధారణ నిర్ణయాలు భారత్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ ఆవేదన వ్యక్తం చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న కారణంతో భారత వస్తువులపై 50 శాతం సుంకాలు విధించాలన్న ట్రంప్ నిర్ణయం దిగ్భ్రాంతికరమని అన్నారు. ఈ చర్య వల్ల ఇప్పటికే సూరత్‌లోని వజ్రాలు, ఆభరణాల పరిశ్రమతో పాటు సముద్ర ఉత్పత్తులు, తయారీ రంగాల్లో లక్షకు పైగా ఉద్యోగాలు పోయాయని ఆయన ఆరోపించారు. సముద్రపు ఆహారం, తయారీ రంగంలోనూ ఈ ప్రభావం కనిపిస్తోందని తెలిపారు. టారిఫ్‌ల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని వాపోయారు. సింగపూర్‌లో జరిగిన ఒక రియల్ ఎస్టేట్ సదస్సులో భారత్‌అమెరికా సంబంధాలపై అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ, "ట్రంప్ చాలా చిత్రమైన వ్యక్తి. అమెరికా అధ్యక్షుడికి ఆ దేశ వ్యవస్థ అపరిమితమైన స్వేచ్ఛను ఇస్తుంది. ఆయన నిర్ణయాల వల్ల భారత ఎగుమతిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు" అని ఆయన తెలిపారు. ట్రంప్ కంటే ముందు 44 లేదా 45 మంది అధ్యక్షులుగా పనిచేసినప్పటికీ వైట్ హౌస్ నుంచి ఈ రకమైన ప్రవర్తన ఎన్నడూ చూడలేదని ఆయన అన్నారు. సంప్రదాయ దౌత్య ప్రమాణాలను ట్రంప్ గౌరవించడం లేదని విమర్శించారు. భారత్‌పై విధించిన 50 శాతం సుంకంలో, రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు అదనంగా 25 శాతం పెనాల్టీ కూడా ఉందని శశిథరూర్ వివరించారు. "ఇది పన్ను కాదు, ఇది కచ్చితంగా మనపై విధించిన ఆంక్షలు. ఇది పూర్తిగా అన్యాయం. ఎందుకంటే మనకంటే చైనానే రష్యా నుంచి ఎక్కువ చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటోంది. కానీ వారిపై ఇలాంటి చర్యలు లేవు. రష్యా నుంచి చమురు కొనే అన్ని దేశాలపై ఒకే రకమైన విధానం అమలు చేయాలి కదా?" అని ఆయన ప్రశ్నించారు. ట్రంప్ వైఖరిని ఎండగడుతూ, "తనకు నోబెల్ శాంతి బహుమతి రావాలని ఒక ప్రపంచ నేత బహిరంగంగా చెప్పడం మీరెప్పుడైనా విన్నారా? చరిత్రలో ఇలా ఎప్పుడూ జరగలేదు" అని శశిథరూర్ అన్నారు. భారత్, రష్యా దేశాలవి డెడ్ ఎకానమీలు అని చెప్పడం ఎప్పుడైనా విన్నారా? ఒక దేశాధ్యక్షుడి నుంచి వినిపించకూడని భాష ఇది అని ఆయన అన్నారు. అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించడం మనకు చాలా కష్టంగా మారిందని, అయినప్పటికీ చర్చలు జరుగుతున్నాయని, వాటిపై ఆశాభావంతో ఉన్నామని తెలిపారు. ఈ పరిస్థితుల్లో భారత్ కేవలం అమెరికాపైనే ఆధారపడకుండా తన దౌత్య, ఆర్థిక సంబంధాలను ఇతర దేశాలతో విస్తరించుకోవాలని ఆయన సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సమావేశానికి వెళ్లడం, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనుండటం వంటి పరిణామాలు ఈ దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అమెరికా ఆంక్షల విధానం వింతగా, సమర్థించుకోలేని విధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## బాంబు పెట్టాం..
# అందరినీ బయటకు పంపించండి

**ఢిల్లీ, సెప్టెంబర్ 12 (భారత శక్తి) :** దేశ రాజధాని ఢిల్లీలోని హైకోర్టులో శుక్రవారం తీవ్ర కలకలం రేగింది. ఢిల్లీ హైకోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు ఆగంతుకులు పంపిన ఒక ఈమెయిల్ భద్రతా వర్గాలను ఉరుకులు పరుగులు పెట్టించింది. ఈ బెదిరింపుతో అప్రమత్తమైన పోలీసులు, భద్రతా సిబ్బంది వెంటనే హైకోర్టు ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈరోజు మధ్యాహ్నం లోపు హైకోర్టులో బాంబు పేలుతుందని హెచ్చరిస్తూ గుర్తుతెలియని వ్యక్తులు ఈమెయిల్ పంపారు. సమాచారం అందిన వెంటనే అధికారులు స్పందించారు. ముందు జాగ్రత్త చర్యగా హైకోర్టు ప్రాంగణంలోని సిబ్బందిని, న్యాయవాదులను, ఇతర సందర్శకులను వెంటనే బయటకు పంపించి, ప్రాంగణాన్ని పూర్తిగా ఖాళీ చేయించారు. సమాచారం అందుకున్న బాంబ్ స్క్వాడ్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌తో కలిసి హుటాహుటిన హైకోర్టుకు చేరుకున్నాయి. కోర్టులోని ప్రతి గదిని, ప్రాంగణంలోని అన్ని ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాయి. ప్రస్తుతానికి ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మెయిల్ వచ్చిన ఐపీ అడ్రస్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కనిమొళి తేవిడియా పేరుతో వచ్చిన ఆ మెయిల్‌లో ఈ వారంలో తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కుమారుడి పైనా దాడులు చేస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు వెల్లడించారు. బాంబే హైకోర్టుకు కూడా బాంబు బెదిరింపు మెయిల్ వచ్చినట్లు ముంబై పోలీసులు తెలిపారు. కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయించి గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. న్యాయస్థానం ప్రాంగణంలో ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదని, ఇది నకిలీ బాంబు బెదిరింపుగా గుర్తించినట్లు తెలిపారు.

# కోల్ ఇండియా ఉద్యోగులకు కేంద్రం శుభవార్త.. కిషన్ రెడ్డి కీలక ప్రకటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (భారత శక్తి):** బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కోల్ ఇండియాలో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ప్రయోజనాలు కల్పిస్తూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం కీలక ప్రకటన చేశారు. ఇందులో భాగంగా రెగ్యులర్ ఉద్యోగులకు కోటి రూపాయల అదనపు బీమా కవరేజీతో పాటు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా కార్మికులు, అధికారులందరికీ ఒకేరకమైన డ్రెస్ కోడ్ ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. రాంచీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు, విశ్వకర్మ పూజను పురస్కరించుకుని ఈ సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఈ కొత్త పథకాలు అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. కొత్త నిబంధనల ప్రకారం, కోల్ ఇండియాలోని రెగ్యులర్ ఉద్యోగులకు కోటి రూపాయల అదనపు బీమా లభిస్తుందని, కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 40 లక్షల వరకు బీమా వర్తిస్తుందని వివరించారు. దీంతో పాటు, రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగులకు గౌరవప్రదమైన గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో దేశంలోని అన్ని బొగ్గు గనుల్లో ఒకేరకమైన డ్రెస్ కోడ్ తీసుకువస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. ఈ యూనిఫామ్‌లను కోల్ ఇండియా సంస్థే అందిస్తుందని, ఇది అధికారులకు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో బొగ్గు రంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందని మంత్రి తెలిపారు. దేశంలో బొగ్గు ఉత్పత్తి మొదటిసారిగా ఒక బిలియన్ టన్నులు దాటిందని, దిగుమతులు తగ్గించుకోవడం ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ. 60,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశామని చెప్పారు. ప్రభుత్వం కేవలం బొగ్గుపైనే కాకుండా, కీలక




ఖనిజాల అన్వేషణపై కూడా దృష్టి సారించిందని, ఇందుకోసం రూ. 32,000 కోట్లతో 'నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్' ప్రారంభించినట్లు ఆయన గుర్తుచేశారు. దేశంలో 74 శాతం విద్యుత్ థర్మల్ పవర్ నుంచే ఉత్పత్తి అవుతున్నందున, ఇంధన భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణలో పలు జిల్లాల్లో
# రెండు రోజుల పాటు అతి భారీ వర్షా లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (భారత శక్తి) :** తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో పలు జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ రోజు ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ సమయంలో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

# 2034 నాటికి ఏపీ ఎలా ఉండబోతోందనే అంశాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు


**అమరావతి, సెప్టెంబర్ 12 (భారత శక్తి) :** రాబోయే దశాబ్ద కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడమే లక్ష్యమని, ఇందుకోసం ఒక స్పష్టమైన, బృహత్తరమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. 2034 నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)ని రూ. 57 లక్షల కోట్లకు, ప్రతి వ్యక్తి తలసరి ఆదాయాన్ని రూ. 10.55 లక్షలకు చేర్చడమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'వే2న్యూస్ సంస్థ నిర్వహించిన కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన, 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌ను ఆవిష్కరించి, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "కేవలం విజన్ రూపొందించడంతోనే సరిపెట్టకుండా, దాన్ని ఆచరణలో సాధ్యం చేసే దిశగా పనిచేయాలి. జాతీయ స్థాయిలో 'వికసిత్ భారత్ 2047'కు అనుగుణంగా రాష్ట్రంలో 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌ను సిద్ధం చేశాం. ఈ లక్ష్యాలను సాధించడం అసాధ్యమేమీ కాదు. కచ్చితమైన ఆలోచన, బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే" అని అన్నారు. రాష్ట్రంలోని భాగస్వాములందరినీ కలుపుకొని ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి సంబంధించిన నిర్దిష్ట లక్ష్యాలను ఆయన ప్రజల ముందుంచారు. "ఈ ఏడాది, గత ఏడాది రెండంకెల వృద్ధి సాధించగలిగాం. ఇదే స్ఫూర్తితో 202829 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీని రూ. 29.29 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ. 5.42 లక్షలకు చేరుస్తాం. ఆ తర్వాత, 2034 నాటికి జీఎస్‌డీపీని రూ. 57.21 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ. 10.55 లక్షలకు పెంచేలా ప్రణాళికలు రూపొందించాం. ఈ మెగా డ్రీమ్‌ను నిజం చేసే బాధ్యతను ఎన్డీఏ కూటమి తీసుకుంటుంది" అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ, "ఒకప్పుడు భారతీయులకు ప్రపంచంలో సరైన గుర్తింపు లేని సమయంలో, తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు ప్రధానిగా చేపట్టిన సంస్కరణలతో దేశ ప్రగతి పరుగులు పెట్టింది. 2038 నాటికి భారత్ ప్రపంచంలోనే నంబర్ 1 స్థానానికి చేరుకుంటుంది. ఇందులో తెలుగువారి పాత్ర కీలకంగా ఉండాలి" అని ఆకాంక్షించారు. తాను గతంలో అమలు చేసిన విజన్ 2020 సాకారమైన తర్వాత కూడా ఇంకా కొందరు అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామని చంద్రబాబు స్పష్టం చేశారు. "భారత్ లాంటి దేశంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాలి. సూపర్ సిక్స్ పథకాల ద్వారా సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, సంపద సృష్టి ద్వారా అభివృద్ధికి సమానంగా నిధులు కేటాయిస్తాం. నేను కేవలం రాజకీయాల గురించే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి చెందేది కాదు, విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావు. ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టించి, దాన్ని పేదలకు పంచుతున్నాం" అని వివరించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవుతారని, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతుందని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# నేపాల్ లో భారతీయుల బస్సుపై దాడి

నేపాల్, సెప్టెంబర్ 12 : నేపాల్ లోని పశుపతినాథ్ ఆలయ దర్శనానికి వెళ్లిన భారతీయులపై దాడి జరిగింది. వారు ప్రయాణిస్తున్న బస్సుపై దుండగులు దాడి చేశారు. బస్సులోని ప్రయాణికులను బెదిరించి నగదు, నగలు, సెల్ ఫోన్లు సహా విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. కాసేపటికి నేపాల్ ఆర్మీ వచ్చి తమను కాపాడిందని, భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో స్వస్థలాలకు చేరుకున్నామని భక్తులు తెలిపారు. యూపీకి చెందిన ఈ టూరిస్టు బస్సుకు ఆంధ్రప్రదేశ్ కు చెందిన రాజ్ డ్రైవర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ దోపిడీ ఘటనను రాజ్ మీడియాకు వివరిస్తూ.. పశుపతినాథ్ ఆలయం నుంచి తిరిగి వస్తుండగా ఒక దొంగల ముఠా బస్సును అడ్డగించిందని, బస్సు అద్దాలను ధ్వంసం చేసి ప్రయాణికులను బెదిరించిందని చెప్పారు. తమ వద్ద ఉన్న నగదు, నగలు, విలువైన వస్తువుల తో పాటు బ్యాగులను కూడా ఎత్తుకెళ్లారని ఆయన వివరించారు. దొంగలు పలువురు ప్రయాణికులపై దాడికి పాల్పడ్డారని బాధితులు తెలిపారు. ఆ తర్వాత కాసేపటికి నేపాల్ సైనికులు వచ్చి తమకు సహాయం చేశారని, భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో తాము సురక్షితంగా సరిహద్దులు దాటామని వారు పేర్కొన్నారు.

## ఉపరాష్ట్రపతిగా
# సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : భారతదేశ 15వ ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అత్యంత వైభవంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన చేత పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా సహా పలువురు మంత్రులు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు హాజరయ్యారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. రాజీనామా చేసిన తర్వాత ధన్‌ఖడ్ బహిరంగంగా కనపడడం ఇదే తొలిసారి. ఇటీవల జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా బరిలోకి దిగిన రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయన గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా



చేశారు. ప్రస్తుతం ఆ రాష్ట్ర గవర్నర్‌గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. చిన్న వయసులోనే ఆర్ఎస్ఎస్ భావజాలానికి ఆకర్షితులైన రాధాకృష్ణన్, తన 16వ ఏటనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. తమిళనాడు బీజేపీలో కార్యదర్శిగా, అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూర్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు. తన అనుచరులు ఆయన్ను 'తమిళనాడు మోదీ' అని పిలుచుకుంటారు. మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన జార్ఖండ్ గవర్నర్‌గా, తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ సేవలు అందించారు.

# రెండు ప్రధాన రైల్వే లైన్లను రేవంత్‌రెడ్డి విస్మరించారు: వినోద్ కుమార్



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : హైదరాబాద్ నుంచి అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఏపీ విభజన చట్టంలో ఉందని భారత రాష్ట్ర సమితి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. రెండు ప్రధాన రైల్వే లైన్లను సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించారని చెప్పారు. ఆదిలాబాద్ పట్టణానికి రైల్లో వెళ్లాలంటే మహారాష్ట్ర మీదుగా వెళ్లాల్సి వస్తోందని, నిజాం కాలంనాటి రైల్వే లైనే ఇప్పటికీ ఉందని చెప్పారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్ రైల్వే కోసం సర్వే, డీపీఆర్ సిద్ధం చేయించినట్లు గుర్తు చేశారు. హుజూరాబాద్ మీదుగా కరీంనగర్ నుంచి కాజీపేటకు రైల్వే లైన్‌పై చర్చించలేదని, ఈ రైల్వే లైన్‌లో కొత్త లింకులు కలిపితే.. ఉత్తర తెలంగాణ పది జిల్లాలకు రైల్వే కనెక్టివిటీ వస్తుందని చెప్పారు. ఈ రెండు రైల్వే లైన్లపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టాలన్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జీఎంకు కూడా లేఖ రాసినట్లు తెలిపారు.

# టౌన్ ప్లానింగ్ విభాగాల్లో టన్నులకొద్దీ అవినీతి..

- ఆందోళనకు గురిచేస్తున్న వెలుగులోకి వస్తున్న సంఘటనలు..
- తీవ్రమైన గందరగోళానికి దారితీస్తున్న అధికారుల చరిత్రలు..
- అవినీతి అధికారులను కేవలం బదిలీ చేస్తే సరిపోదు..
- న్యాయ విచారణ జరగాలి.. కఠిన శిక్షలు అమలవ్వాలి..
- ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినా చర్యలు శూన్యం..
- సస్పెండ్ చేయడం మాత్రమే పరిష్కారం కాదు..
- శాశ్వతంగా విధుల నుంచి తప్పించాలి.. జైలు శిక్షలు విధించాలి..
- అమాయకుల జీవితాలతో ఆడుకుంటున్న వారిని ఉపేక్షించకూడదు..
- అక్రమ సంపాదనతో కోట్లకు పడగలెత్తిన వారి ఆస్తులు జప్తు చేయాలి..
- మరో సారి లంచం అనే మాట ఎత్తాలంటే వణికిపోవాలి..
- ప్రభుత్వాలు కఠినంగా ఉంటే ఇన్ని పరిణామాలు జరుగుతాయా..?
- టీపీఓల పాపాల్లో ఉన్నతాధికారులకు సైతం వాటాలు..!
- ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పకుంటున్న రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి..
- అవినీతిని కూకటివేళ్లతో సహా పెకిలించాలి డిమాండ్ చేస్తున్న " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..



hmda Growing Global

**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (భారత శక్తి) :** హైదరాబాద్ నగరానికి సంబంధించి పునరుద్ధరణ, అటవీ ప్రాంతాల అభివృద్ధి, భవన నిర్మాణం, వాణిజ్య స్థలాల కల్పన వంటి అన్ని పనులను జీ.హెచ్.ఎం.సి. టౌన్ ప్లానింగ్ శాఖ నిర్వర్తిస్తుంది. అయితే, ఈ శాఖలోని అవినీతి సమస్యలు నగర ప్రజలకు నేరుగా ప్రభావం చూపుతున్నాయి.

నిర్మాణ అనుమతులల్లో అంతులేని అవినీతి చోటుచేసుకుంటోంది..నిబంధనలకు విరుద్ధంగా, కొన్ని ప్రాజెక్టుల అనుమతులు సాధారణ విధానాలను దాటిపోతూ కేవలం మోసగాళ్లకు మాత్రమే మంజూరు చేయబడుతున్నాయి. ఇది సాధారణ ప్రజలకు అన్యాయానికి కారణమవుతుంది.

ఇక భూసంబంధిత అవినీతికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.. పట్టాలు, ప్లాట్ల మార్పిడి, రిజిస్ట్రేషన్ లకు సంబంధించి కరువుదారుల సహకారం, అధిక ఖర్చుతో భూసంబంధిత మోసాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం అనుమతించని మార్పులు జరగడం, ప్రాపర్టీ హక్కులు ఉల్లంఘించడం కొనసాగుతోంది. నిర్మాణ నిబంధనల ఉల్లంఘన జరుగుతోంది.. బిల్డింగ్ కోడ్, సరిహద్దులు, పార్కింగ్, ప్రకాశన హరిత ప్రాంతాలు వంటి నిబంధనలు చాలాసార్లు ఉల్లంఘనకు గురి అవుతున్నాయి.. ఇది



పర్యావరణ, భద్రతా సమస్యలకు దారి తీస్తుంది.

అదేవిధంగా రియల్ ఎస్టేట్ కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.. పరిమితి నివారణ, నగర అభివృద్ధి ప్రణాళికల కింద రియల్ ఎస్టేట్ కంపెనీలకు ప్రత్యేకంగా అనుమతులు ఇవ్వడంతో సాధారణ ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతోంది.. ఇక టౌన్ ప్లానింగ్ అధికారుల నివేదికలు, సర్వే డేటా, సొమ్ము లెక్కలు వాస్తవానికి విరుద్ధంగా ఉండడం సాధారణంగా మారిపోయింది.. ఈ విధంగా అవినీతి పద్దతులు మరింతగా పునరావృతం అవుతున్నాయి. నగరంలో నియంత్రణ లేని అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయి.. పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది.. మోసపూరిత ప్రాజెక్టులు అడుగడుగునా వెలుస్తున్నాయి.. సాధారణ ప్రజల సమస్యలకు పరిష్కారం అనేది లేకపోవడం ఆందోళన కలిగించే విషయం..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతిపై ఇటీవల వెలుగులోకి వచ్చిన సంఘటనలు, అధికారులు, ప్రజలు, మీడియా మధ్య తీవ్ర చర్చలకు దారితీస్తున్నాయి.

జీ.హెచ్.ఎం.సి. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతిపై కొన్ని కీలక సంఘటనలు చూద్దాం :

ఏకంగా 27 మంది అధికారులు బదిలీ అయ్యారు.. జూన్ 2025లో, జీ.హెచ్.ఎం.సి. కమిషనర్ ఆర్.వి. కర్నన్ 27 మంది టౌన్ ప్లానింగ్ అధికారులను అవినీతిపై ఆరోపణలతో బదిలీ చేశారు. ఇందులో 13 అసిస్టెంట్ సిటీ ప్లానర్లు కాగా 14 మంది సెక్షన్ ఆఫీసర్లు ఉన్నారు. ఈ చర్య ప్రజల ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తీసుకోబడింది

నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో రూ. 10 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు ఒక టౌన్ ప్లానింగ్ అధికారి.. సెప్టెంబర్ 2025లో, నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారిణి తెలంగాణ యాంటీ కారప్షన్ బ్యూరో వారు రూ. 4 లక్షల లంచం తీసుకుంటూ ఉండగా పట్టుకున్నారు. ఆమె లే అవుట్ రిజిస్ట్రేషన్ స్కీం అంటే ఎల్.ఆర్.ఎస్. ఫైల్ క్లియరెన్స్ చేయడానికి మొత్తం రూ. 10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి




ఆగస్టు 2025లో, షేక్ పేట్, జూబ్లీహిల్స్లోని సూర్య నగర్ కాలనీ నివాసులు జీ.హెచ్.ఎం.సి. సర్కిల్ 18 అధికారులపై అవినీతికి సంబంధించిన ఫిర్యాదు చేశారు. వారు అక్రమంగా 78 అంతస్తుల భవనాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లు, అధికారులకు బినామీ ఆస్తులు ఉన్నట్లు ఆరోపించారు

మరొకటి టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ వ్యాపార పార్క్లో అక్రమ నిర్మాణం.. జులై 2025లో, జూబ్లీహిల్స్లోని అల్లు అర్జున్ వ్యాపార పార్క్లో నాల్గవ అంతస్తు అనధికారికంగా నిర్మించబడినట్లు జీ.హెచ్.ఎం.సి. గుర్తించింది. అల్లు అరవింద్కు షోకాజ్ నోటీసు జారీ చేయబడింది

అవినీతి పెచ్చుమీరడానికి అనేక కారణాలు ఉన్నాయి..అనధికారిక నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం: అధికారులు అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి, భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించడం తరచుగా జరుగుతోంది..

ఇక ఎల్.ఆర్.ఎస్. వంటి అనుమతుల కోసం లంచాలు డిమాండ్ చేస్తున్నారు.. అవినీతి అధికారులు తమ కుటుంబ సభ్యుల పేర్లపై అక్రమ ఆస్తులు సృష్టించుకుంటున్నారు..

జీ.హెచ్.ఎం.సి. తీసుకుంటున్న చర్యలు ఎలా ఉన్నాయి అన్నది చూస్తే.. అవినీతిపై ఆరోపణలతో అధికారులను బదిలీ చేయడం..సస్పెండ్ చేయడం మాత్రమే జరుగుతోంది.. దీనివలన ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు..

అయితే అనధికారిక నిర్మాణాలను అరికట్టడానికి కొత్త నిబంధనలు అమలు చేయడం లాంటివి చేయాలి.. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవాలి..

ఇక ఈ వ్యవహారంలో ప్రజల పాత్ర చాలా ముఖ్యమైనది.. ప్రజలు తమ ఫిర్యాదులను ప్రజావాణి లేదా తెలంగాణ యాంటీ కారప్షన్ బ్యూరో ద్వారా నమోదు చేయవచ్చు. అవినీతికి సంబంధించిన సమాచారం కోసం ఏసీబీ వారి టోల్ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ నంబర్ 9440446106 ను సంప్రదించవచ్చు.

టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతిని రూపుమాపడానికి " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " పోరాటం సాగిస్తోంది.. మా పోరాటంలో మీరందరూ భాగస్వాములు కావాలని కోరుకుంటోంది.. ఆహ్వానిస్తోంది..

# ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉంది : మంత్రి వివేక్



లక్షెట్టిపేట, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత తీర్చేందుకు ఇప్పటికే కేంద్ర మంత్రితో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చర్చించి అదనపు యూరియాను రాష్ట్రానికి తెప్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక రేకులు ఏర్పాటు చేసి మంచిర్యాల జిల్లా రైతులకు యూరియా లోటు లేకుండా చేస్తామన్నారు. కొందరు ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాలని రైతులను పక్క దారి పట్టించేలా చేస్తున్నారని పరోక్షంగా విపక్షాలపై మండిపడ్డారు. రైతులకు ఎట్టి పరిస్థితిలో అన్యాయం జరుగకుండా చూస్తామన్నారు. అంతేకాకుండా మంచిర్యాల జిల్లా ప్రజల కోసం ఏం పీ వంశీ కృష్ణ వందేభారత్ ఎక్స్ప్రెస్ నిలుపుదల కోసం ఎంతోగానో కృషి చేశారన్నారు. తెలంగాణకు యూరియా లోటు రాకుండా చూడాలని కూడా గతంలోనే కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అంతకుముందు పలువురు కార్యకర్తలు మంత్రి దృష్టికి పలు విషయాలను తీసుకెళ్లారు. తెలంగాణ ఉద్యమంలో పని చేసిన వారిని గుర్తించాలని కోరారు. కొందరికి ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.అనంతరం పలువురు కార్యకర్తల విజ్ఞప్తి మేరకు స్థానిక టీ స్టాల్ లో మంత్రి టీ తాగి వారి సమస్యలను సావధానంగా విన్నారు. ప్రభుత్వం అందరి సమస్యలు పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరుగు తిరుపతి,దమ్మ సునీల్, కళ్యాణం రవి,మినుములు శాంతి , మాలెం చిన్నయ్య, గరిసే రవీందర్, మూల కిషన్ గౌడ్, దమ్మ నారాయణ, మూల లచ్చన్న,మల్లేష్, శ్రీనివాస్ కొండ నరేష్. కళ్యాణం రవి హమాలీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ ఎగవేతదారులపై కఠిన చర్యలు..

*** ఏఐ టెక్నాలజీ వాడండి..**

*** వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష**



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (భారత శక్తి) :** నిర్దేశించిన లక్ష్యాలను అందుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖ యంత్రాంగం కృషి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆదాయం కోల్పోతున్న ప్రాంతాలను గుర్తించాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు, వ్యాపార లావాదేవీలను కేంద్ర కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఇకనుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి కమర్షియల్ ట్యాక్స్ శాఖ ప్రగతి పై సమీక్ష నిర్వహిస్తానని డిప్యూటీ సీఎం తెలిపారు. జీఎస్టీ రేట్ రేషనలైజేషన్ ద్వారా రాష్ట్రం కోల్పోతున్న ఆదాయాన్నిక్షుణ్ణంగా అధ్యయనం చేసి ఓ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జీఎస్టీ ఎగవేత దారుల పైన కఠినంగా వ్యవహరించాలని, అదేవిధంగా నిఘా వ్యవస్థ నిరంతరం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని, అధికారుల నిర్లక్ష్యం మూలంగా రాష్ట్ర ఆదాయానికి గండి పడే ప్రమాదం ఉందని అన్నారు. ఉన్నత స్థాయి అధికారులు నిత్యం ఏఐ టెక్నాలజీని వినియోగించుకుని పర్యవేక్షణ సాగించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే లావాదేవీలు పన్నుల వసూలులో వస్తున్న సమస్యలను అధిగమించడానికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. గత సంవత్సరానికి ఈ సంవత్సరానికి కమర్షియల్ ట్యాక్స్ శాఖలోని ఎన్ ఫోర్స్మెంట్ , ఆడిట్ తదితర విభాగాల్లో సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఆదాయం పెంచుకునేందుకు కమర్షియల్ ట్యాక్స్ శాఖలో అంతర్గతంగా కమిటీలు వేసి అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఏ రిజ్వీ, కమిషనర్ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి కిరణ్, డిప్యూటీ కమిషనర్లు సౌజన్య, వాసవి, సంయుక్తారాణి, సునీత, గీత తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు.. జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్

ఆత్మకూరు, సెప్టెంబర్ 12 (భారత శక్తి) : బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. హనుమకొండ జిల్లాలో కురిసిన వర్షాలకు చెరువులన్నీ నిండుకుండలా మారాయి. ఆత్మకూరు మండలం కటాక్షాపూర్ శివారులో జాతీయ రహదారి(163)పై అలుగుపారడంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో వాహనాలు ఒకవైపు నుంచే వెళ్తున్నాయి.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.